శ్రీరామకథాకందము

అరణ్యకాండము

(పద్యకావ్యము)



రచన

యడవల్లి వీరరాఘవస్వామి

17-1-388/6, శ్రీలక్ష్మీనగర్ కాలనీ,

హైదరాబాదు - 500 659.

This book is published with the financial assistance of Tirumala Tirupathi Devasthanams under their scheme 'Aid to publish religious books'.

ప్రథమ ముద్రణము :
శుక్ల - మాఘ
జనవరి - 1990

ప్రతులు - వేయి

ముఖచిత్రము - శ్రీ వి. నాగేశ్వరరావు


ప్రతులకు :
రచయిత
17-1-388/6, శ్రీలక్ష్మీనగర్ కాలనీ,
సైదాబాదు, హైదరాబాదు - 500 659.

వెల : రూ. 20-00

ముద్రణ :
పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్,
హైదర్‌గూడ, హైదరాబాదు - 29

శ్రీః

శ్రీ వేంకటైశ్వర్యమ్



శ్రీ వేంకటేశ మీశానం హృల్లక్ష్మీవాసభాసురమ్,
సుధీః శ్రీవైభవ ప్రాప్త్యై భావయామి నిరంతరమ్

శ్రీః

పార్వతీపారమైశ్వర్యమ్



పరస్పరతపఃఫలాభ్యామ్ నమః
భక్తేషు ప్రకటితఫలాభ్యామ్ చ నమః
జగతఃపితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ.

వేదాంత విశారద, వ్యాకరణ శిరోమణి,
శ్రీ గీతారామాయణ, భారత, భాగవత,
సప్తాహప్రవచన చక్రవర్తి, పౌరాణిక
శ్రీ రాచర్ల రామసూర్యనారాయణశాస్త్రి

వీరరాఘవీయమ్

చి॥ యడవల్లి వీరరాఘవస్వామి విరచితమగు శ్రీరామ కథాకంద మందలి అరణ్యకాండ నామూలాగ్రముగ చదివి చాల సంతసించితిని. అసలు రామకథయే మధురము. దానికి తోడుగా వీరరాఘవస్వామి గారి కవితాశైలి బంగారమునకు పరిమళమబ్బిన రీతిగా మధురాతిమధురముగా విలసిల్లినది. ఈ గ్రంథమందలి శ్రీరామకథామాధుర్యము సాహితీవేత్తలగు వారే గాక సామాన్యులు కూడ చవి చూచి యానందింతు రనుటలో నెంత మాత్రము సందియము లేదు. సంస్కృత భాషలో వాల్మీకి వచనారవింద గళితమైన రామాయణమధువు ఆంధ్రభాషలో అందములగు కందపద్యము లలో వీరరాఘవముఖారవింద గళితమై సంస్కృతభాష నందుకొనని వారికి సులభముగా లభ్యమై వారు ధర్మార్థకామమోక్షములు పొందగలుగు రనుట నిస్సందేహము. ఈయన కవితాశైలి సమమధురోపనతార్థ వాక్య బద్ధమై యలరారుచున్నది. ఉదాహరణమునకు కొన్ని అందములగు పద్యము లను దిలకించుడు.

దండకారణ్యము నందలి ఒకానొక ఆశ్రమ వర్ణనమున సులలి తాక్షరపద సంపుటి యిట్లున్నది.

'పల్లవ కోరక సహితోత్ఫుల్ల ప్రసవ ఫలపూరి తోర్వీరుహ సం
వేల్లిత వల్లీ నిచయ ప్రోల్లసిత మమలజలాశ యోదారంబున్'
శరభంగాశ్రమ సమీపమున రాముడు తమ్మునితో ఇట్లా అంటాడు.

'హారి లసద్బహువర్ణోదార దివిజకుసుమ మాలికాలంకృతమున్
దారేశమండల ధవళధారాధర సన్నిభము సితచ్ఛత్రము తోన్'
"ఒక తేజోమయదేహుం డొక శశ్వద్దేమభూషితోజ్జ్వల మణిర
త్నకిరీటుడు హరివశ్వప్రకల్పితస్యందనుండు వచ్చె నచటికిన్"
(అరణ్య - 55-56)

పంచాప్సరస్తటాకోదంతమున - వర్ణనము -
"రమణీయపుష్పవనములు, సమున్నత ధరాధరములు
సానువులున్ గృ
ష్ణమృగ పృథుశృంగకలిత ప్రమత్తసైరిభములు వనబర్హి
చయములున్
(అరణ్య - 147)

ఇట్లు రాఘవునిమహిమ వీరరాఘవుని కవితాకన్య ఒంపుసొంపులతో నందముగ నలరామన్నది. విచారించినచో రామకథా శ్రవణము ఎవ్వనికి ఉత్తేజము కల్గింపదు? దానికి తోడు కవితాశిల్పము కూడ రమణీయముగా నున్నచో నిక చెప్పనేల? వాల్మీకిగిరిసంభూతమై రామసాగరగామిని యైన రామాయణమహానది ముల్లోకములను తరింపజేయునదియై యున్నది. రామాయణము శతకోటి ప్రవిస్తరము. ఆదికావ్యమును వాల్మీకిమహర్షి నూరుకోట్ల సంఖ్యగల శ్లోకములతో రచించినాడు. అష్టాదశమహాపురాణములు, అష్టాదశ ఉపపురాణములు ఈ గ్రంథమునుండి వెలువడినవియే యని ఆనందరామాయణమున చెప్పబడినది. ఈ రామాయణమును ముల్లోకములవారు మూడు భాగములుగా పంచుకొనినారట. 33 కోట్ల 33 లక్షల 33 వేల, 33 వందల, 33 శ్లోకముల చొప్పున బ్రహ్మ స్వర్గ పాతాళ లోకవాసులు పంచుకొని యున్నారు. అచ్చట తుంబురునారదాదులు గానము సేయుచుందురట.

నూరుకోట్లనుంచి సారభూతములైన శ్లోకములు తీసి చతుర్వింశతి సంఖ్యాక గాయత్రీమంత్ర వర్ణసంపుటితో 24 వేల శ్లోకములను అల్పాయుర్దాయముగల మానవులకు బ్రసాదించినారు. ఇట్లు ద్రాక్షాఫల

సమ్మిళితమైన రామాయణ మధువును గ్రోలుట బహుజన్మ సంస్కారముగల వారికిగాని లభ్యము కాదు. కాని భారతీయులలో రాముడన్న తెలియని వారుండరు. రాముని మధురస్వరూపము ప్రతి భారతీయుని హృదయ మందిరముననుప్రతిష్ఠింపబడి యున్నదని చెప్పవచ్చు. భగవంతుని నామములలో రామనామానికి గల ప్రాశస్త్యము చాల గొప్పది. రామ శబ్దమునకు అనేకార్థములు గలవు. "రా" అక్షరము అగ్నిబీజము. "మ" అమృతబీజము. "రా" శబ్దోచ్చారణముచే సమస్త పాతకములు ధ్వంస మగును. "మ" శబ్దోచ్చారణముచే జీవుడు అమృతత్వమును బొందును. ఇంకొక యర్థమున ".రా." శబ్దోచ్చారణముచే సమస్త పాపములు ముఖమునుండి బయటకు వెడలును. అట్లు వెడలిన పాపములు మఱల లోనికి రాకుండుటకు'మ"శబ్దము కవాటములు బంధించినట్లు ప్రవర్తించును

"'రా' శబ్దోచ్చారణేనైవ ముఖాన్నిర్యాంతి పాతకాః
పునఃప్రవేశాభావాయ 'మ' శబ్దస్తు కవాటవత్"

విష్ణుసహస్రనామాల్లో పరమేశ్వరుడు పార్వతితో అంటాడు కదా- శ్రీరామరామరామ యని - యీ సప్తాక్షరమహామంత్రము ఒకమారు ఉచ్చరించినచో సహస్రనామపారాయణ ఫలము లభించును.

"శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే
సహస్రనామతత్తుల్యం రామనామ వరాననే"

స్కందపురాణము నందు కూడ శ్రీరామకోటిలేఖనము, దాని మాహాత్మ్యము చెప్పబడి యున్నవి. శ్రీరామకోటి వ్రాయుటకు శాస్త్రమందు విధాన మున్నది గాని మఱియే ఇతర నామమునకు చెప్పబడి యుండలేదు దీనిని బట్టి రామనామమునకు ఎంతప్రాశస్త్యము గలదో తెలియుచున్నది. అందువలననే కాబోలు మనలో చాలమంది "శ్రీరామ" అని వ్రాయకుండ దేనిని కూడ వ్రాయుట కుద్యమింపరు. జనసామాన్యము ఊతపదంగా "రామ" "రామ" అని ఉచ్చరిస్తూంటారు.

ఉచ్చారణ సులభం. ఫలమధికం. ఈ రామనామ ప్రభావము అనేక పురాణములందు గొప్పగా వర్ణింపబడినది. ఇట్టి రామునిచరిత్రమును

ఆంధ్ర భాషలో తేటతెల్లని పదములతో అర్థభావగాంభీర్యములతో రచించు భాగ్యము ఈ కవితల్లజునకు లభించుట అనేక జన్మల సుకృత విశేషమని చెప్పవలెను. ఈ కాలమున సంఘపరముగా వ్రాయువారే ఎక్కువమంది కలరు. భగవద్విషయికములగు కథలను వ్రాయువారు చాలా తక్కువ. అట్టిచో వీరికి యీ సంకల్పముగల్గుట వీరికేగాక పాఠకులకు కూడ భవిష్యత్తులో ఎంతో ఉపయోగము.

అరణ్యకాండలో చిట్టచివరి భాగమున శబరి భక్తితో శ్రీరాముని స్తుతించిన విధమున నీ రచయిత స్వాభిప్రాయమును గూడ ఎట్లు తేటతెల్లముగ దెలియజేసికొనినాడో యీ క్రింది పద్యముల వలన గ్రహింప వచ్చును.

"హృదయమున నీదునామము వదలక స్మరియించుచున్ భవత్పావనమూ
ర్తి దనివితీఱగ దర్శించి దేహబంధంబు వాయ సిద్ధం బైతిన్.
జీవితము ధన్యమయ్యెన్ దావకపాదాబ్జ దర్శనంబున రామా!
భావితతపః ఫలంబున్ గైవసము భవాబ్ధితారకమునై తనరున్"

ఈ గ్రంథకర్త భక్తకవియైన పోతన కోవలో తన కావ్యమును ఆ శ్రీరామచంద్రమూర్తికే యంకిత మిడినాడు. భక్తకవియగు నీయన యుద్ధకాండము, ఉత్తరకాండములను గూడ సంపూర్ణముగా ననువదించి శ్రీరామానుగ్రహముచే నాయు రారోగ్యైశ్వర్య భక్తిజ్ఞాన వైరాగ్యాభివృద్ధి కలిగి చరితార్థు లగుదురు గాక యని భగవంతుని ప్రార్థించుచున్నాను.

"శ్రీవీరరాఘవస్వామి కవిం శ్రీవీరరాఘవః
ఆయురారోగ్యమైశ్వర్యం దత్త్వా రక్షతు సర్వదా"

శుభంభూయాత్

హైదరాబాదు,
శుక్ల, పుష్య ఏకాదశి
సోమవారము 22-1-1990.

రాచర్ల రామసూర్యనారాయణ శాస్త్రి

ఉభయ భాషాప్రవీణ
పెరవలి లింగయ్య శాస్త్రి
రిటైర్డ్ లెక్చరరు,
ఆంధ్రసారస్వత ప్రాచ్యకళాశాల,
హైదరాబాదు.

ఇం.నెం. 53/2 RT
సైదాబాద్ కాలని,
హైదరాబాదు-500 659

శ్రీరామాయనమః

అభినందనాశీస్సుమాంజలి

"రమంతే యోగినోయస్మిన్నిత్యానందే చిదాత్మని
ఇత్యేవం రామశబ్దేన పరంబ్రహ్మాభిధీయతే"

చి॥ యడవల్లి వీరరాఘవస్వామి కవిశ్రీ గారు సుకవియై జన్మించినారో! జన్మించి సుకవియైనారో! అన్నది వారి కవితాకంద సౌరభాన్ని తలస్పర్శిగా నాస్వాదించిన పిమ్మట నాలోఁగలిగిన ముగ్ధసంభావనాలేశము. వీరు వాల్మీకి రామాయణ విమలగాథను స్వీయమృదుమధురోదార గంభీరంగా కందపద్యాల్లో విరచించి భక్తపఠితల కాకంఠదఘ్నంగా నామెతలిడినారు.

ఇందు ధీరోదాత్త గుణోత్తరుడు, విగ్రహమునుదాల్చిన ధర్మమనదగు శ్రీరామ పరంబ్రహ్మమే నాయకోత్తర గుణోత్తరుడు గాన భక్తులకు, పాఠకులకు ముక్తికాంతా సామ్రాజ్య సింహాసనాధిరోహణానికి చిఋ సోపాన పంక్తివలె శ్రీ యడవల్లి వారి రచన సాగినది

"పదలాలిత్యము, సర్థగౌరవము, జీవద్భాష, యౌచిత్య సం
పద, తామొక్కటికొక్కటెక్కువయి సమ్మాన్యంబుగా వస్తువుం
గుదురన్ దా సకలాంగ శోభియయి చూడ్కుల్‌దన్ను తన్వంగివో
లెదలిర్పగా"

కందపద్యాలలో వివిధ భంగిమల్లో వివిధ కథాఘట్టాలను సుమధుర రస సంచయోదంచితంగా అనన్య సులభంగా విరచించిన శ్రీ స్వామిగారు పవిత్ర త్రిపథగా తరంగమాలికలలో నోలలాడించినారు.

"కృతులగల్పించు పుణ్యాతిరేకమునకు
నన్య సంతానమెటు సామ్యమందనేర్చు,
వరము లిచ్చెడి పట్ల శంకరుని వంటి
దేవతానేత యొకడు ధాత్రిని గలండె"

శ్రీ వీరరాఘవస్వామికి నిజ సంతానమునకు దోడు వారి సత్కృతి సంతానము వారి యన్వవాయానికి సుయశోవహమును, అతైల దీప్తమగు మణిప్రదీప మనుట నిశ్చప్రచము.

"నతే వాగనృతా కావ్యేకించి దత్ర భవిష్యతి" అని వల్మీకభవుని గూర్చి బ్రహ్మోవాచ.

అట్లయ్యు, దరువాతివారగు భాస, కాళిదాస భవభూత్యాది రూపకకర్తలు అలంకారికులు, కావ్యప్రబంధ చంపూ రచయితలు పాత్రపోషణ, రసౌచిత్యాదులకు విహితములును సూపస్కృతములగు నెన్నియో మార్పులు చేర్పులు చేసిరి. అవి సహృదయ రసిక పఠితలకు పరమాహ్లాదాన్ని కలిగించినవని తేటతెల్లము.

కందములలో గ్రంథాన్నంతటిని అనూదితము చేసిరచించుట యసిధారావ్రతమే.

విస్తర భీతిచే వీరి సముచితౌజః ప్రసాదాదిసుగుణ సుందర కంద పద్య రచనకొక చిన్నియొండు రెండుదాహరణముల స్థాలీపులాక న్యాయమున ప్రదర్శింతును.

"ఇక ధాత్రి మన్నిశిత సాయకౌఘ విచ్ఛిన్న తావకాహీనగళా
త్తకవోష్ణఫేన బుద్బుద నికరాంచిత రక్తపాన నిరతిబరగెడిన్"

"ఫలకుసుమ భరిత తరువులు బిలబిల రవముల పులుగులు
బిసరుహకలిత
మ్ములు విమల జలనిలయములు లలితపదగతి నటనము
లలరెడునెమళులున్"

తథాపీత్థమస్తు.

"రామః కమల పత్రాక్షస్సీతాజాని ర్మహాయశాః
వీరరాఘవ విద్వాంసం పాయాదారవితారకమ్"

"దాయం దాయం శంభుః శ్రేయః ప్రేయాంసి సర్వదోవ్యాత్త్వామ్
వారం వారం రామస్తుభ్యంనిఃశ్రేయసాయబోభూయాత్"

ఇతిశమ్.

భవదీయః

పెరవలి లింగయ్యశాస్త్రి

శుక్లపుష్య కృష్ణ
ద్వాదశి
భౌమవాసరః
23-1-1990

కామరాజుగడ్డ రామచంద్రరావు, 194 సైనాబాదు కాలనీ,
రిటైరుడు డిప్యూటి సెక్రటరీ. హైదరాబాదు-500659.
ఆం.ప్ర. ప్రభుత్వం లా డిపార్టుమెంటు.

అభినందనము

"శ్రీరామకథా కంద" మని శ్రీయుతులు యడవల్లి వీరరాఘవ స్వామిగారు వెలువరిస్తున్న సంపుటాల్లో యిది నాల్గవది. మొదటిది 'శ్రీరామకథ' సుందర కాండము, రెండవది 'అయోధ్య కాండము' మూడవది 'బాలకాండము' నాల్గవది ఈ అరణ్యకాండము.

రామాయణం ఆదికావ్యం. వాల్మీకి ఆది కవి. రామాయణం మనుష్యులకు ఆదర్శ గ్రంథం. ఏది ఆదర్శం? ధర్మార్థ కామమోక్షాలు ఆదర్శం. రామాయణ భారత భాగవతాలు ధర్మమోక్షాలను బోధిస్తూండడం చేతనే అవి నిత్యమైన గ్రంథాలు. శ్రీరామకథ సూర్యచంద్రులు ప్రకాశవంతులై యున్నంత వఱకు ధర్మమోక్షాల గూర్చిన బోధచేస్తూనే ఉంటుందనేది మఱువరానిమాట.

శ్రీ వీరరాఘవస్వామి గారు శ్రీరామభక్తుడు. "భక్తిమాల" ను రామచంద్రుని పేరస్తవరూపంలో వ్రాసిన రచయిత! దైవీసంపద కలిగిన వాడు. అలాంటివాడు శ్రీరామకథను చేపట్టటంలో ఆశ్చర్యంలేదు. సంస్కృత రామాయణం చదివినప్పటి తన ఆనందాన్ని తెలుగువారికి పంచాలనే మానవనైజాన్ని ప్రదర్శించారు. అనుభవాన్ని ఎవరికివారే అనుభవించటం మానవేతర భూతలక్షణం. అంతా అలా పంచుతారా అంటే మరి వీరికి కలిగిన ఉత్ఫుల్లమైన భావాలకు ఇంతటి ప్రద్యోతకశక్తి ఉన్నదన్న మాట.

"ఎన్నో రామాయణాలున్నాయి. మళ్ళీ రామకథా" అనడం కద్దు కొందరు. కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారన్నట్లు ఎవరి నాలుక రుచి వారిది. ఎవరి సంతృప్తి వారిది. కాని వీరి కృతిలో వీరు పాఠకులకుపయోగకరమైన నియమాలు పాటించి మనకు మహోపకారం చేశారు. సంస్కృతం రానివారికి శ్రీరామకథ నందించం ఒకటి. వాల్మీకి చెప్పిన కథనంతనూ చేర్చడం మఱొకటి. ఇది చదివితే వాల్మీకి రామాయణంలోని కథను చదువకపోతినే అనే చింత పడటముండదు.

లక్ష్మణుడు శ్రీరామునెదుట "స్వతంత్ర నిర్ణయము నాకగునె శతాబ్దములున్నన్" (250) అంటూ రామాజ్ఞనే సర్వత్రాశిరోధార్యంగా చేసికొన్నట్లు ఈ రచయిత వాల్మీకి కావ్యాన్నే శిరోధార్యం చేసికొని కావ్యం వెలార్చారు. వర్ణనలు విసుగుకలిగింపకుండా తగ్గించి చదువరులకు ఆసక్తిని కలిగించారు. చెప్పిన వర్ణనలు ఎంతో సంతోషాన్ని కలిగించడమే గాక సాధారణంగా విద్యార్థులకు తెలియని విషయాల్ని స్ఫురింపచేస్తూ ఉన్నాయి.

ఉదాహరణకు :—

"తమమావరించిన కొలది
యు మిక్కుటమ్ములగును జలియున్ గాలియు, వ
న్యమృగాళి చరింపదు దీ
ర్ఘములయ్యె నిశలు, తలపజగమగోచరమౌ - (277)

చలికాలంలో నిశలు పొడవవడం అలా ఉంచి, వన్యమృగాలు తిరుగాడవనేది తెలియాల్సిన సంగతే. ఇంకా—

"ధరణిజములు శ్వేతప్రా
వరణము లయ్యెన్ దుషారపాతంబున బు
ష్పరహితములగుట నిద్రా
పరవశములు నైనటుగన వచ్చెడి నవియున్ - (278)

చెట్లు నిద్రాపరవశం అయినవనడంలో చెట్లలో చైతన్యాన్ని గుర్తుచేసి పరమాత్మను జ్ఞాపకం చేయడాన్ని దర్శించవచ్చు ఈ పద్యంలో!

శ్రీ వీరరాఘవస్వామి గారి ఈ రచన సులభమైంది. తెలుగు సంస్కృత పదాలతో, చిన్న వాక్యాలతో, మూల గ్రంథానికి సన్నిహితంగా కథను అందించుతూ ఉన్నది. ధారాశుద్ధితో పద్యాలు పరువెడుతవి. ఇది ఇలా వెలార్చడం శ్రీ వీరరాఘవస్వామిగారికి గల శ్రీరామచంద్రుని అనుగ్రహంవల్ల అనేది నిజం. వారికి నా అభినందనలు.

25-1-1990 కామరాజుగడ్డ రామచంద్రరావు

ఓం

శ్రీగురుభ్యోనమః

అభినందన

భగవదవతారానికి ధర్మగ్లానినీ అధర్మాభ్యుత్థానాన్నీ కారణాలుగా చెప్పినా, అవి గౌణాలుగానే పరిగణించా లనిపిస్తుంది. నిజానికి అవిద్యాలంపటత్వంతోనూ కామ్యకర్మల చిక్కులతోనూ కొట్టుమిట్టాడే మానవులు వినడానికీ స్మరించుకోడానికీ తగిన కార్యాలను ఆవిష్కరించడానికే ఆ మహాప్రియుడు అవతరిస్తూ ఉంటాడు. ఆ కథలను వింటూ, పాడుకుంటూ పదేపదే చెప్పుకుంటూ మాటి మాటికి తలచుకుంటూ ఆనందిస్తూ కాలాన్ని గడుపుకొనే వాళ్ళకు భవప్రవాహాన్ని ఉడిగింపజేసే తత్పదాంబుజాలు దర్శనమిస్తాయి తప్పకుండాను.

శ్రీరామావతార కథ ఆటువంటి శ్రవణస్మరణార్హమైన వాటిలో గొప్పది. అందుకనే ఈ గాథను గానం చెయ్యడం పదేపదే జరుగుతూనే ఉంది. శ్రీ యడవల్లి వీరరాఘవస్వామి గారి రామకథాకందం ఆ గాన పరంపరలో ఒకటి ఇప్పటికి సుందర బాల అయోధ్యకాండ లయ్యాయి. అరణ్యకాండ ఇప్పుడిప్పుడే పూర్తి అయింది. ఇది శ్రీరాముని దండకారణ్యప్రవేశంతో ప్రారంభమై పంపాసరోవర తీరం చేరుకోవడంతో అంతమవుతుంది. ఎంతమంది భక్తులకో మనఃప్రీతినీ చక్షుః ప్రీతినీ కలుగజెయ్యడమే కాక శత్రుత్వమిషతో ఎదురొచ్చిన రక్షస్సుల కెందరకో సద్గతినీ పరాగతినీ ప్రసాదించాడాయన. చతుర్దశభువన భర్తయైన శ్రీరామప్రభువు చతుర్దశ సంవత్సరాలు వనవాసం చెయ్యడానికి దండకానికి వచ్చి, ముంద

స్త్రీగా చతుర్దశ రాక్షసుల్ని ఒక్క వేటునచంపి ఆ మీద చతుర్దశ సహస్ర నిశాచరుల్ని ఒకటిన్నర ముహూర్తంలో మట్టుబెట్టేడు. భారతంలో పద్దెనిమిదికి మాదిరిగానే రామాయణంలో పధ్నాలుగుకి విశిష్టత్వం ఉందనిపిస్తుంది. ఎన్నెన్ని అపవిత్ర రూపాలనో ఆయన తన పావన స్పర్శతో పవిత్రీకరించాడు. ఎవరికీ కనపడకుండా భస్మశాయిని అయి తపస్సు చేసుకొనే అహల్యనుద్ధరించడం బాలకాండలో చదువుతాం. అరణ్యకాండలో విరాధ కబంధులనే కాక శాపగ్రస్తమైన దండకవనాన్ని పావనమయం చేశాడా రామప్రభువు.

దండకవనం శ్రీరాముడి పూర్వీకుడి రాజ్యం. దండకుడు ఇక్ష్వాకుడి నూర్గురి పుత్రుల్లో ఒకడు. అతడు ఇక్ష్వాకుడి ఆదేశంతో దక్షిణ దేశాన్ని పాలిస్తూ ఉండేవాడు. ఒకసారి దండకమహారాజు గుర్రాన్నెక్కి ఒంటరిగా అరణ్యానికి వెళ్ళాడు. దైవవశాత్తూ అదే సమయానికి ఆ అరణ్యశోభను తిలకించడానికి శుక్రాచార్యుడి కుమార్తె అరజస్క అయిన విరజ అక్కడకు వచ్చింది. ఆమెను చూడడమే తడవు, దండకుడి నెత్తి మీద కామభూతం ఎక్కి తాండవాన్ని ఆరంభించింది. మనిషి కామం వలలో పడ్డపుడు తన హితాహితాల్ని ఏమాత్రమూ పట్టించుకొనే స్థితిలో ఉండడు. ఇంతకుముందు ఎన్ని మిడుతలు ఈదీపశిఖల్లోపడి కాలిపోయినప్పటికీ, దానిని చూసి ఏ ఒక్క శలభమూ పాఠాన్ని గ్రహించలేదు. దండక శలభానికి విరజా సౌందర్య దీపశిఖమీద పట్టరాని ఆసక్తి పుట్టుకొచ్చింది. ఆమె ఎన్నో విధాలుగా నచ్చచెప్ప చూచింది. శుక్రాచార్యుడియ్యబోయే ఘోర శాపమూ అరజస్క అయిన కన్యను ధర్షించడంవల్ల చుట్టుకొనబోయే మహాపాపమూ అతణ్ణి ఆపలేకపోయాయి. కామ ప్రేరితుడై ఆమెను బలాత్కరించాడు దండకనరేశుడు నరపిశాచంలాగ. ఈ కాలంలో ఎక్కువగా జరుగుతూ ఉన్న ప్రసభవ్యవాయ పరంపరకు దండకుడే మూలపురుషు డనిపిస్తాడు. బలాత్కరించిన తరవాత భయంపట్టుకుంది, గుర్రమెక్కి పారిపోయాడు

దండకుడు. కూతురు వాలకం చూసిన శుక్రాచార్యుడికి అంతా తెలిసింది. జఘన్యమైన ఈ మహాపాపాన్ని చేసిన దండకుడూ దండకుడి రాజ్యమూ నశించి పోవడమేకాదు, అక్కడ ఆ రాజ్యంలో సప్తదిన పర్యంతం తప్తవాలుకావర్షం కురిసి వృక్ష పశు పక్ష్యాదు లేపీ నిల్వలేని అరమణీయమైన వాలుకామయ అరణ్యం అవుతుందని కూడా ఘోరశాపాన్నిచ్చాడాయన. అమ్మాయిని తన ఆశ్రమంలో తపస్సు చేసికోమని చెప్పి శుక్రాచార్యుడు మరోచోటికి వెళ్ళిపోయాడు. ఆ విధంగా దండకుని రాజ్యం దండకారణ్యం అయింది.

శ్రీరాముడు అవతరించబోతున్నాడని, ఆయన దర్శనంకోసమని మునిగణాలు ఆ వనంలో కుటీరాలు నిర్మించుకొని నివసింపసాగారు. శ్రీరాముడు రాబోతున్నాడన్న ఉత్సాహంతో చెట్లు మొలిచాయి. దండక వనంలోకి కోదండధరుడు అంతకాంతకుడి మాదిరిగా ప్రవేశించి ఖరవర్ణాలతో దూషిస్తూ వికృతంగా విరావిస్తూ మదమోహదర్పాల కాశ్రయ భూతులైన 'అసు' రమణులకు (భౌతికానికే ప్రాధాన్యతనిస్తూ శరీరానికే సీమితులై ప్రాణైక పరాయణులైన వాళ్ళకు) మరణదండన విధించాడు. నిజానికి మరణమంటే ప్రియతముని చేరుకోవడానికి మరో ఆవకాశం దొరకడమే. శ్రీరాముడి సంచారనివాసాలతో దండకం పావనమయమై శాపవిముక్తిని పొందింది. అయితే దండకుడిలాగానే కామపిశాచానికిలొంగి రావణుడు సీతాపహరణం చేయడం జరిగింది. ఇది స్థలమాహాత్మ్యమేమో మరి? శ్రీరాముడు పతితపావనుడు కనుకనే రావణుణ్ణి సంశోధించి పావనీకరణ యజ్ఞం చెయ్యడానికి బయలుదేరాడు లంకవైపుకు.

యడవల్లి వారి అరణ్యకాండ కథాకందరస వాహిని దండక సంశుద్ధిని చెయ్యడంలో తనవంతు పని తనుచేసింది. పద్యాల కూర్పులో ఈయన పనితనం బాగా కనిపిస్తుంది. దక్షిణ దక్సంశుద్ధికి శ్రీకారం చుట్టడానికి అగస్త్య మహర్షి వచ్చాడు. ముందుగానే శ్రీరాముడికి స్వాగతం చెప్పడానికి వీలుగా వింధ్యుణ్ణి వినమ్రుడిగాచేసి వచ్చిన అగస్త్యుణ్ణి వర్ణిస్తూ

"అగగర్వంబడగించుట నగస్త్యుడయ్యెముని...(190) మూలంలో ధ్వనిమాత్రంగానే ఉన్న (అరణ్య. 11-79) "అగస్త్య"ని శక్తిని అను ప్రాసాను ప్రాణితంగా చెప్పారు. ఈ కవిగారి కొన్ని కొన్ని కందాల్లో తిక్కన్నగారు తొంగిచూస్తూ ఉంటారు. ఉదాహరణకు—

"కనుచుంజనుచుండగ రామునికెదురై వచ్చె తోడి మునిచయము లతో డనగస్త్యుడు, రాముడు పాదనమస్కృతి సేసెభక్తి తాత్పర్యమునన్ (207)

"నినుఁ గాపాడుచు నుండుమనెనన్ని చట రాముడమ్మ! యెప్పట్టు
ననైననతిక్రమింపజాల దదనఘస్వాంతు వచనంబు దాల్మి గొనుమికన్ (637)

"అనుచితమాడుట వనితాజనస్వ భావంబు పరగు జగతీస్థలినె
ల్లనిదియ, సధర్మరతలంగనలూన్ గ్రూరులు విరోధకల్పను లెందున్ (647)

జటాయువు కలిసినప్పుడు కూడ మూలంలో లేని జటాయు వాక్యా న్నొకదాన్ని వ్రాసి స్వారస్యాన్ని చేకూర్చారు.

"ఎఱిగితిగర్జాకర్జిగ బురంబువీడి వనికీవు వోవుటయున్రా
ణ్మరణంబు గైకయీ కృతభరతధరాపాలక పదవైభవతృష్ణన్ (242)

అయితే 650, 652 పద్యాల్లో "భవతి భిక్షాందేహి" అని ఉండ వలసియుండగా 'భవతీ' అని సంబోధనాన్ని దీర్ఘాంతంగానే వాడేశారు. వ్యవహారంలో మాదిరిగా "దూరాద్ధూతేచ" అనే సూత్రరీత్యా పిలుపులో ప్లుతాన్ని ఉపయోగించడం కొంతలో కొంత సమర్థించవచ్చు.

జన స్థానంలో పధ్నాలుగువేల రాక్షసులవధ సీతాపహరణానికి నాంది కనుక చాలా ముఖ్యమైనది. 'జనస్థాన'మన్న పేరులో కామాది ప్రవృత్తులకు మూలస్థానమైన అధశ్చక్రాలు మూడూ ఉన్నాయనిపిస్తుంది. అలాగే రాక్షసోన్మూలనంలో నాడీశుద్ధి, చక్రశుద్ధి, ఇమిడి ఉన్నాయని

కూడా అనిపిస్తుంది. ఈ సంశుద్ధి కార్యక్రమానికి అవసరమైన అగ్నిని రుద్రరూపంగా వాల్మీకి అభివర్ణించాడు. రాక్షసోన్మూలనార్థం ఉటజానికి ముందు నిలుచున్న కవచధారి రాముడు "తిమిరే మహానగ్ని రివోత్థితః" (అరణ్య 24-17) అని అగ్నివత్తుగా ఉపమితుడయ్యాడు. అంతేకాదు. 26వ శ్లోకంలో "బభూవ రూపంక్రుద్ధస్య రుద్రస్యేవమహాత్మనః" అనిన్నూ, 35వ శ్లోకంలో "తస్యరుష్టస్య రూపంతు రామస్య దదృశేతదా! దక్ష స్యేవక్రతుం హన్తుముద్య తస్య పినాకినః" అనీన్నూ వాల్మీకి వర్ణించ డంలో రాముడు రుద్రత్వాన్నంగీకరించి దండక సంశుద్ధికై బయలు వెడలాడన్నది పదే పదే చెప్పినట్లయింది. అగ్నిరుద్రుల ఏకత్వం "త్వమగ్నేరుద్రః" ఇత్యాది మంత్రాల్లో గోచరిస్తుంది. శ్రీరామశరాగ్నిలో శలభప్రాయంగా దహించుకుపోయిన ఖరుడి పతనాన్ని అభివర్ణిస్తూ తిరిగి రుద్రోపమానాన్నే చెప్పాడు వాల్మీకి: "రుద్రేణేవవినిర్దగ్ధః శ్వేతారణ్యే యథాంధకః" అని (అరణ్య 30-27). ఈ అగ్నిరుద్రత్వాలను కథాకంద రచయిత అక్కడక్కడ తడిమి శ్రీరాముడిలో ఈ తత్వాలను స్ఫురింప జేశారు.

మొత్తానికి వీరి రచనలోనూ అనువాద ఫక్కీలోనూ ఒడిదుడుకుల్లేని చక్కటి ప్రవాహం ద్యోతకమవుతూ ఉంటుంది. అదే వీరి అనువాదానికి అందాన్నిచ్చింది. వీరు తతిమ్మా కాండలను కూడా శీఘ్రంగానే పాఠక లోకానికి అందిస్తారని ఆశిస్తున్నాను. శ్రీరామప్రభువు ఈయనకు తన పని చేయించుకోవడానికి ఆవశ్యకమైన ఆయురారోగ్యాల్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.

ఇతిశమ్.

హైదరాబాదు, **ముంజులూరి నరసింహారావు**

28-1-1990

ఆత్మీయము

శ్రీమన్మహావిష్ణ్వవతారమైన శ్రీరామచంద్రప్రభువు కృపచేత నేను వెలయించుచున్న శ్రీరామకథాకందమను శ్రీరామకథలో నిది నాల్గవసంపుటము, అరణ్యకాండ. శ్రీసీతారామలక్ష్మణులు దండకావనమును ప్రవేశించిన తరువాత రాక్షసబాధానివారణ మొనరింపుమని యచటి మునులు ప్రార్థించుట, తాపసాశ్రమములు సందర్శించుచు, రాక్షసోన్మూలనము సేయుచు, బదేడులు గడిపి అగస్త్యమహాముని సూచన ప్రకారము పంచవటి యందు నాశ్రమమేర్పరచుకొని శ్రీరామాదులు నివసించుట, శూర్పణఖాపరాభవము, ఖరదూషణాది చతుర్దశసహస్రరాక్షసవధము, రావణకృత సీతాపహరణము, జటాయుమరణము కబంధశాపమోక్షణము, శబరిమోక్షప్రాప్తి, సుగ్రీవునితో మైత్రి కొఱకు ఋష్యమూకపర్వతమునకు శ్రీరామాదులు పయనమగుటయు, నను విషయము లీ కాండయందు వర్ణితములు. శ్రీరామావతారమునకు గారణమైన రావణవధకు బీజ మీ కాండయందే యున్నది. ఇందులో ప్రత్యాశ్రమ మునియోగోపదేశ విశేషముల నెక్కువకెక్కువగా సంగ్రహించ బ్రయత్నించితిని. రామాయణభారతములలోని యరణ్యములు వేదముల యారణ్యకముల వలె తత్త్వస్ఫోరకము లని నా భావన.

మా బావగారు శ్రీ బొక్కా శ్రీరాములుగారు, ప్రసిద్ధసాహితీవేత్త శ్రీ వడలి మందేశ్వరరావుగారు, దీనిని బరిశీలించి తగిన సూచనలందించిరి. విద్యా - భాషాప్రవీణ, మహాభారతము - విశ్వవిజ్ఞానకోశము గ్రంథకర్త, డా॥ మూలంపల్లి చంద్రశేఖరశర్మ ఎంఏ.,పి.హెచ్.డి., గారు సర్వ

విధముల సహకరించిరి. పౌరాణిక శ్రీ రాచర్లరామసూర్యనారాయణశాస్త్రి గారు, ఉభయభాషాప్రవీణ శ్రీ పెరవలి లింగయ్యశాస్త్రి గారు భారతకథా రచయిత, శ్రీ కామరాజుగడ్డ రామచంద్రరావుగారు, హైదరాబాదు వివేక వర్ధనీకళాశాలోపన్యాసకులు శ్రీ ముంజులూరి నరసింహారావుగారు దీనిని బరిశీలించి యాశీస్సులను అభినందనములను అందించిరి. వీరి కందఱికి నమస్సుమాంజలు లర్పించు చున్నాను.

దివ్య శ్రీ తిరుమలతిరుపతి దేవస్థానంవారు దీని ముద్రణమునకు ధనసహాయము చేసిరి. వారికి నా నమోవాకములు.

అందమైన ముఖచిత్రమును తయారుచేసి యిచ్చిన చిత్రకారుడు చి॥ నాగేశ్వరరావు (భరద్వాజ) నభినందించుచున్నాను.

ఈ పుస్తకమును తక్కువ వ్యవధిలో అందముగా ముద్రించి యిచ్చిన పద్మావతీ ఆర్టు ప్రింటర్సు హైదరాబాదు అధినేత శ్రీ శ్రీనివాస్ గారికి, వారి సిబ్బందికి గృతజ్ఞుడను.

హైదరాబాదు
31-1-1990

విధేయుడు
వీరరాఘవస్వామి

విషయానుక్రమణిక

		పేజీ
1.	శ్రీరాముని దండకావన ప్రవేశము	1
2.	విరాధ వధ	4
3.	శరభంగాశ్రమ సందర్శనము	11
4.	సుతీక్ష్ణముని సందర్శనము	19
5.	సీతారాముల రాక్షసవధావిషయిక సంవాదము	23
6.	పంచాప్సరస్తటా కోదంతము	30
7.	శ్రీరాము డగస్త్యమునిని దర్శించుట	33
8.	శ్రీరామాదులు పంచవటి కరుగుట	48
9.	హేమంతర్తు వర్ణనము	54
10.	శ్రీరాముని శూర్పణఖ మోహించుట	59
11.	శ్రీరాముడు ఖరదూషణాదుల వధించుట	64
12.	అకంపనుడు ఖరదూషణ వధమును రావణున కెఱిగించుట	91
13.	రావణుడు మారీచునికడ కేగుట	94
14.	మారీచుడు రావణునకు హితము దెల్పుట	95
15.	శూర్పణఖ రావణునితో సీతను గొనుమనుట	97
16.	రావణుడు మఱల మారీచునికడ కేగుట	106
17.	మారీచుడు సీతాపహరణము వలదనుట	107

18. రావణుడు మారీచుని బెదరించుట 115
19. మారీచుడు రావణుని వెంట నరుగుట 118
20. సీత మాయలేడిని దెమ్మని రాముని గోరుట 121
21. శ్రీరాముడు లేడిని బట్ట నరుగుట 125
22. సీత రామునకు సహాయముగా లక్ష్మణు నంపుట 126
23. రావణుడు బ్రాహ్మణవేషమున వచ్చుట 131
24. సీత రావణునకు దన్నెరింగించుట 134
25. రావణుడు సీతను దన్ను వరింపుమనుట 137
26. సీత రావణు నిరాకరించుట 138
27. రావణుడు సీత నపహరించుట 141
28. జటాయువు రావణు నెదిర్చి మడియుట 146
29. రావణుడు సీత నశోకవనమున నుంచుట 150
30. శ్రీరాముడు సీతను గానక విలపించుట 160
31. శ్రీరాముడు జటాయువున కపరక్రియలు సేయుట 181
32. కబంధశాపమోక్షణము 184
33. కబంధుడు శ్రీరాముని సుగ్రీవునితో జెలిమి సేయుమనుట 193
34. శ్రీరామ దర్శనమున శబరి మోక్షమున కేగుట 197

శ్రీ రా మ క థా కం ద ము

అరణ్యకాండ

శ్రీ సీతావల్లభ! కరు
ణాసాగర! దండకావనతపస్వివరా
వాసావలోకనవ్రమ
దా! సురవైరిహననపరతంత్రా! రామా!

శ్రీరాముని దండకావనప్రవేశము

1. అత్రిమహాముని వీడ్కొని
యా త్రిజగన్నుతచరిత్రు డా రాముడు భూ
పుత్రీసౌమిత్రులతో
నేత్రానందకర మ వ్వనిం జనుచుండన్.

2. కనవచ్చె నొక్క యాశ్రమ
మినరశ్మిసమప్రభం బహీనతపశ్శ
క్తి నిధానమౌనిమండల
మనవద్యము సాధుమృగవిహంగాకరమున్.

3. పల్లవకోరకసహితో
త్ఫుల్లప్రసవఫలపూరితోర్వీరుహసం
వేల్లితవల్లీనిచయ
ప్రోల్లసిత మమలజలాశయోదారంబున్.

4. తరుమూలవేదికలు, వి
స్తరతరుశాఖావలగ్నశాటీచయముల్
సురపూజాయోగ్యప్రస
వరాజియు మఖోపయుక్తవస్తువితతులున్.

5. సువిశాలాగ్ని గృహములున్
సవవేదులు నధ్యయనపుశాలలు జలపా
త్రవిశేషములున్ కృష్ణమృ
గ విచిత్రాజినచయములు గమలాకరముల్.

6. కడు నింపొదవింపగ రా
ముడు ధనువున్ జ్యావిముక్త మొనరించుచు నొ
ప్పెడు వేడ్క నాశ్రమాభిము
ఖుడయ్యె భార్యానుజు లనుగుల్ తో నడువన్.

7. మును లెదురు వచ్చి స్వాగత
మని యర్ఘ్యము పాద్య మిచ్చి యర్హాసనముల్
వనఫలము లొసగి సత్కృతి
దనిపిరి ప్రియమున మహీసుతారాఘవులన్.

8. శ్రీరామపదాబ్జాతము
లారాధించె మునిమధుకరావళి శ్రుతిమం
త్రారవమధురంబుగ భవ
తారణమకరందలాభతత్పరబుద్ధిన్.

9. మును లిట్లనిరి, వినమ్ర
స్వనముల, శ్రీరామచంద్రజగతీధవ! ధ
ర్మనిరతి నైజము కద! దు
ర్జనశిక్షయు సజ్జనపరిరక్షయు నీకున్.

10. దివిజేశచతుర్థాంశవి
భవుండు భూపాలకుండు, ప్రజ యెల్లయు న
య్యవనీశు గొల్చు దత్పర
త, విభుండును ద దఖిలజనతావనరతుడౌ.

11. సాకేతంబున నున్న న్
గీకారణ్యముల నున్న నీవ యరయగా
మాకున్ బ్రభుండ వౌదువు
శ్రీకల్యాణగుణః సాధుచిత్తాబ్జాళీ!

12. వనమూలఫలాశనులము
ననింద్యధర్మల మనారతాధ్యయనతపో
ధనులము నియతేంద్రియులము
జనవర! రక్షింపు మీ వజస్రము మమ్మున్.

13. ఆ తాపసోక్తులకు సం
ప్రీతాత్ముం డగుచు రామవిభు డట గడపెన్
సీతాసౌమిత్రులతో
నేతత్ సాంధ్యజపహోమకృత్యాసక్తిన్.

14. చని రమ్మఋనా డుదయ
మ్మున నమ్మువ్వురు నరణ్యపుందారి ముద
మ్మున మునులు వీడుకొల్పగ
దినముఖకృత్యంబు లెల్ల దీర్చి ప్రణతులై.

విరాధవధ

15. తరుగుల్మద్రుమచయముల్
విరులున్ మ్లానంబులయ్యె విహగంబులు శ
బ్దరహితములై యొదిగె భీ
కరమృగతతియు బొదరిండ్ల గ్రక్కున నడగెన్.

16. వని యెల్లయు నిర్జీవం
బు నీరవము నయ్యెను భయభూతవశంబై
యణగారినగతి దోచెన్
వనరాజ్యం బప్డు రామభద్రున కచటన్.

17. నలుదెసలున్ గమనించుచు
మెలమెల్లన నడుగు లిడుచు మెలకువ జను వా
రలకున్ వినవచ్చె నలఘు
జలధర గర్జా రవాతిశయ రావ మటన్.

18. అచల నిభోన్నత దేహం
బచలగుహా సన్నిభారుణాస్యంబును గ్రో
ధచలన్నిశాతదంష్ట్రా
ప్రచయంబును మెఱయ రామభద్రున కెదుటన్.

19. నాలుగు శరభము లొక శం
డాలంబును మఱిమృగేంద్రులన్మూటిని శా
ర్దూలములు రెండు గ్రుచ్చిన
శూలము చేతన్ ధరించి శోణిత మొలుకన్.

20. పలలాశి యొకడు రక్తా
క్షులు గుండ్రము గాగ ద్రిప్పుచు న్నిలిచి భుజ
మ్ములు సాచి పలికె బొలికే
కలు వెట్టుచు నత్యుదగ్రకంఠధ్వనితోన్.

21. మునివేషధారులై యీ
యనితరసాధ్యప్రవేశ మస్మద్వని జొ
చ్చి నరాధమకీటములా
ర! నిర్భయమ్మున జరింతు రహా! దుర్మదులై.

22. ఈ వరవర్ణిని తోడుగ
నీ వని కేల యరుదెంచి రీ రెవ్వరు దు
ర్భావుల రింకన్ నా యీ
యావాసము జొచ్చి బ్రతుకు నాసయు గలదే.

23. తాపస వేషము లూనియు
నీ పడతుక తోడ దేల! యిపుడే మిమ్మున్
రూపఱజేసి గ్రహించెద
నీ పుత్తడి బొమ్మను హృదయేశ్వరి గాగన్.

24. ఏను విరాధుఁడ దుర్జయ
దానవనాథుండ, నోపెదరయేనియు నా
తో ననిసేయుం డనుచున్
జానకి గైకొనె దటాలునన్ భుజపీఠిన్.

25. అనిలప్రచండవేగ
మ్మునకున్ లేయనటి వోలె ముష్కరదైత్యాం
గనిపీడితయై వడకెన్
జనకజ పరపురుషదేహసంస్పర్శమునన్.

26. ఆతురుఁడై రాము డనియె
గాతరదుఃఖస్వరమున గంటివె! సౌమి
త్రీ! తరుణి గొంచు బోయెడి
సీతాసాధ్వీన్ స్పృశించి చెనటి యొక డిటుల్.

27. ధరణీరాజ్యత్యాగమొ
నరించు నాడైన లక్ష్మణ! యెఱుగ నీ దు
ర్భరతాప మెట్టులో యీ
దురుపద్రవము గడచి పరితోషము గనుటల్.

28. అనినన్ లక్ష్మణు డిట్లనె
నినకులనాథుడవు కలగ నేటి కిటు జగ
ద్వినుతప్రభావ! సమరాం
గణదుర్జేయుడవు కనుము క్షణమాత్రమునన్.

29. యమపురి కంపెద నీవలు
వ మదీయ శితోగ్రబాణపాతంబున జూ
డు మటంచు బల్కె జ్యానా
దము దిక్తతి బర్వ జేసి దైత్యుని తోడన్.

30. దుర్మద వలల! విడువు మీ
నిర్మలగుణ లేదయేని నిన్ను భవద్దు
ష్కర్మఫలంబుగ నస్మ
ద్భర్మమయశరానలంబు పా లొనరింతున్.

31. అనినన్ విరాధు డిట్లని
యె నరుల్ మీరెవరు? మీదు వృత్తాంతంబున్
వినిపింపుడు ముందుగ నా
కనంగ శ్రీరాము డిట్టులనె నసురునకున్

32. మేము దశరథాత్మజులము
నీమంబున దండ్రి యాజ్ఞ నెరవేర్చుటకున్
గా మునివేషముల న్వన
సీమ జరింతుము నరాద! చెప్పు మెవడవో!

33. అనుడున్ బేరు విరాధుం
డని చెప్పితిగా శతహ్రదాహ్వయ నాత
ల్లి నిరవధికభూరితపం
బొనర్చి మెప్పించితి గమలోద్భవు నజునిన్.

34. చతురాస్యు డొసంగె వరం
బతికారుణ్యమున నాయుధావళి చేతన్
మృతిలేని జీవనము, న
క్కృతన నవధ్యుండ మీకు గ్రతుభుక్తతికిన్.

35. కావున మీ రీ చేడియ
నావశమున వీడి పొండు నాచేతులలో
జావు బొరయ కుండుగతిన్
వేవేగ ననియె విరాధ పిశితాశనుడున్.

36. క్రోధపరీతు డవనిజా
నాథుడు శ్రీరాము డంత నానాస్త్రహతిన్
వేధించె నమరగణదు
స్సాధు శితాయుధు విరాధు సాధువిరోధున్.

37. శితబాణక్షతతనువై
క్షితితనయన్ డించి యప్పిశితభోజనుడు
గ్రత రదనధ్వని సేయుచు
ద్రుతగతి బర్వెత్తి వచ్చి దుమికె నృపునిపై.

38. శ్రీరామలక్ష్మణుల దు
ర్వారోద్ధతి బట్టి యెత్తి వారణకుంభో
దారభుజస్కంధములన్
జేరిచి పరువెత్తసాగె క్షితితల మద్రువన్.

39. వలలాశి భుజస్కంధం
బుల గొని పోవ విలపించె భూమీసుత వి
హ్వాలయై హా! రామా! రా
మ! లక్ష్మణా రామ! యనుచు మానసమగలన్.

40. నడగొండ పోలిక విరా
ధు డేగుచుండ గనుసైగతో వ్రేల్మిడి న
య్యెడ రామలక్ష్మణులు గీ
టడగింప దొరకొని రంత న య్యమరారిన్.

41. నఱికిరి రాముడు లక్ష్మణు
డురువేగమ్ముగ శితాసి నొక్కుమ్మడి నా
సురవైరి భుజద్వయమున్
బిరుసుతనం బుడిగి వాడు పెడ బొబ్బలతో.

42. ధరణి బడె గొండ చాడ్పున
నరవరులున్ శోణితంబు నాళోద్గతమై
వరదలుగ జిమ్మగా బొడి
చిరి తద్దేహము వడివడి జిరుకత్తులతో.

43. అవిషహ్యావ్యధ చేతన్
భువి జేట్పడి యుండి దానవుడు మోహవిము
క్తి వడసి తత్త్వమెఱిగి రా
ఘవు బ్రస్తుతి సేసె దీనకంఠం డగుచున్.

44. నరుడవు గావు మహాత్మక!
సురనాథనిభప్రతాపశోభితుడవు శ్రీరా
ఘవుడవు శ్రీభూమిసుతా
వరుడవు లక్ష్మణు డితండు భద్రగుణనిధీ!

45. తొలిజన్మంబున రాఘవ!
యలకాపురి దుంబురుడనునాహ్వయమున వ
ర్తిలు గంధర్వుడ రంభా
లలనా సంగతి ప్రమత్తుడ గుబేరు నెడన్.

46. విను మా కుబేరు శాపం
బున దనుజుడ నైతి శాపమోక్షణమున్ దె
ల్పె నిధీశ్వరుండు రామశ
రనిహతి బడి నప్పుడంచు రాజీవాక్షా!.

47. ఇపు డెఱిగితి మి మ్మందఱ
గృపాపరుండవు దొసంగు లెంచక నాకీ
విపరీతవ్యథ బాపుము
సపర్య లొనరింతు మానసంబున నీకున్.

48. శరభంగమౌని యాశ్రమ
మరయ నిచటి కనతిదూరమగు బుణ్యులస
చ్చరితుండు దపోనిలయుం
డరుగుడు మీర య్యెడకు శుభావహు డతడున్.

49. నను బూడ్చివేయు డి వ్వన
మున నవటముసేసి ప్రాణము ల్వాయుచు నా
దు నిజస్వరూప మందెద
ననగా నట్ల యొనరించి రయ్యనఘాత్ముల్.

50. భయవివశయైన సీత బ్ర
ణయమున నక్కునకు దిగిచి నానామధుర
ప్రియవచనంబుల నాడి వె
లయించె సంతసము మదికి రాఘవు డంతన్.

శరభంగాశ్రమసందర్శనము

51. ఈ కాననంబు దుర్గమ
మై కాన్పించు సురశాత్రవావాసంబై
యీ కాన వీడుటయె సౌ
ఖ్యాకర మని రాఘవు డనె ననుగాములకున్.

52. ఆరీతి నిశ్చయించిన
వారై య మ్మువ్వురు శరభంగాశ్రమమున్
జేర బయనమై బహుకీ
కారణ్యములన్ గమించి రవహితమతులై.

53. ఆ మునితిలకాశ్రమపద
సామీప్యమునన్ విశుద్ధసత్త్వాశ్రయతే
జోమాహాత్మ్యముచేతన్
ధాముడు జిత్తప్రశాంతి దనరిరి వారల్.

54. పరమాద్భుతదృశ్య మొకడు
శరభంగాశ్రమపదంబు సవిధంబున గో
చరమై చేతఃప్రీతి యొ
నరింప రాఘవుడు తమ్మునకు నిట్లనియెన్.

55. హారిలసద్బహువర్ణో
దారదివిజకుసుమమాలికాలంకృతమున్
దారేశమండలధవళ
ధారాధరసన్నిభము సితచ్ఛత్రముతోన్.

56. ఒక తేజోమయదేహుం
డొక శశ్వద్దేమభూషితోజ్జ్వలమణిర
త్నకిరీటుడు హరిదశ్వ
ప్రకల్పితస్యందనుండు వచ్చె నచటికిన్.

57. ఇరుగడ లందున్ గనకా
భరణోద్భాసితలు చంద్రవదనలు వింజా
మరలన్ వీచుచు గొలువుం
డిరి దీప్తేక్షణసముజ్జ్వలితు డాతనికిన్.

58. తాదృశతేజులు నిర్వది
యైదేడుల వయసు వార లాయుధపాణుల్
దేదీప్యమానకంఠా
పాదితరత్న పతకముల వారును గొల్వన్.

59. అరదమ్మున్ డిగ్గి వసుం
ధర పాదము లంటకుండ నడచుచు మునిశే
ఖరు నాశ్రమాంతరము జె
చ్చెర సేరం జనియె దివిజసేవ్యుం డనుజా.

60. కనుగొని వత్తు నతం డెవ
డొ నిల్వు డియ్యెడన మీర లొయ్యన ననుచున్
జనియెన్ రాఘవు డుటజ
మ్మున కంతన్ దేవతావిభుడు కన్మొఱగెన్.

61. సురపతి తిరోహితుండై
యరుగగ రాఘవుడు వెన్క కరుదెంచి సహో
దరునిన్ సీతను దోడ్కొని
యరిగె బ్రియంబున మునీశ్వ రాశ్రమమునకున్.

62. శరభంగుం డెదురై యా
దరించి స్వాగతము నెఱపి తగునాతిథ్యం
బరుదార నొసగి యిట్లని
యె రామచంద్రునకు భక్తి యెసకంబెసగన్.

63. నీ వరుదెంతు వటంచున్
భావమ్మున దెలిసి కొంటి వచియించి చనెన్
దైవతవల్లభుడున్ సీ
తావల్లభ! రామచంద్రధరణీనాథా!.

64. నిను జూచు నదృష్టము గో
రి నిల్చి నాడను దిరస్కరించితి దివిజేం
ద్రుని యాహ్వానం బాశ్రిత
జనకల్పద్రుమ! యశోవిశాల! నృపాలా!

65. సుమనశ్శ్రేయస్కరది
వ్యమహస్సు త్వదాకృతి గనె నవనీస్థలి ద
థ్యము; చిరతపఃఫలార్జిత
సుమహల్లోకంబు లెల్ల శుద్ధాత్ముడనై.

66. పరమేశ్వరార్పణంబని
కరము ముదమ్మున నొసగుదు గారుణ్యరసా
బ్ధి! రమావరతుల్యుండవు
గరిమన్ గ్రహియించి రామ! కావుము నన్నున్.

67. అనినన్ రామ విభుం డి
ట్లనె బుణ్యజగంబు లవ్వి యార్జింతును నే
న నిలుపుకొను మీవ మహా
త్మ! నివాసంబున కనువగు తావు దెలుపుమా.

68. దానపరిగ్రహ మయ్యది
మౌనివరా! యనుచితంబు మముబోటులకున్
గాన గ్రహింప న్నేరను
మానితధర్మాచరణసమాహితనిష్ఠన్.

69. అనిన శరభంగు డనియెన్
జననాథాన్వయుడ వీవు సత్యము నీవ
ల్కినయది సుతీక్ష్ణమౌనీం
ద్రుని కడకేగుడు శుభప్రదు డతడు రామా.

70. చిరకాలవాంఛితము సే
కుఱె సురదుర్లభుడ వీవు కోరిన యంతన్
దరిసెన మిచ్చితి జీర్ణాం
బరంబు వోలెన్ ద్యజించి వైచెద దనువున్.

71. ప్రసవశరవిక్రమంబు ని
రసించి హృదయకుహరాంతరమునన్ బరమా
త్మ సతతము న్నిల్పిన తా
పసుండు శరభంగు డట్లు పల్కి క్షణమునన్.

72. హుతవహు జ్వలింప జేసి వి
హితహోమముదీర్చి రఘుకులేశ్వరరామ
స్తుతి నగ్నిహోత్రమున కా
హుతియై ప్రాణములు వీడె నుత్తమగతికిన్.

73. సుమవృష్టిన్ గురిసి రమరు
లమలహుతవహ ప్రతప్త మగు తాపసదే
హము నుండి వెల్వడుచు లీ
నమయ్యె దేజం బొకం డనంతజ్యోతిన్.

74. ఆ సమయమ్మున బరిసర
వాసతపోవిభవు లార్ద్రపటవాసులు ని
ష్ఠాసక్తులు బ్రాహ్మీతే
జోఽసము లేతెంచి రాము స్తుతియించి రిటుల్.

75. కామారినుతలసద్వ్రత!
రామ! రవికులప్రసూత! రాజశిరోర
త్నామేయధనుర్భంగో
ద్దామబలగృహీతభూసుతాప్రణయరతా!

76. నీవు ధరాపాలకుడవు
దేవేంద్రప్రాభవుడవు దివ్యన్నయధ
ర్మావేశుడవు యశస్వివి
భావితసత్యవ్రతుడవు భద్రగుణుడవున్.

77. నీ పితృవాక్పాలన దీ
క్షాపరతంత్రతయు సుప్రశస్తము రామా!
పాపౌఘదళననామా!
చేపట్టుము మాదు వినతి సీతారామా!

78. నిరతము శుచివ్రతులమై
పరగెడు పర్ణాంబువాయుభక్షకులము యో
గరతులము క్రోధరహితుల
ము రాగవర్జితులమున్ దపోనిలయులమున్.

79. గంగాభ్రనదీపంపా
సంగతదేశంబు లెల్ల జర్జరితము ల
య్యెం గుమత పాదఘట్టన
గ్రుంగెన్ ధర నడగి మౌనికోట్యాశ్రమముల్.

80. రాక్షసులు మమ్ము రౌద్రా
క్షిక్షేపముల వెఱపింత్రు చెడజూతురు య
జ్ఞక్షోణివేదికాతతి
భక్షింత్రు తఱి యరసి యన్నవహితుల మునులన్.

81. రాక్షసబాధానుభవము
నుక్షణము న్మా కెదు రగు నోచము సత్కా
లక్షేపంబునకున్ రా
మక్షితిపాల! నశియించె మా జపతపముల్.

82. జనసముపార్జితవిత్తం
బున నారవ పా ల్గ్రహించు బుడమిపతి తపో
ధన సన్మునికృతపుణ్యం
బున నాల్గవ పాలు సెందు భూమీశునకున్.

83. కావున గర్తవ్యమును
మ్మా వేవిధముల జనతతి నారసి ప్రోవం
గా విభునకు దద్ధర్మము
గావింపని వాడు పాతకవ్యథ సెందున్.

84. నీ యాశ్రయంబు సొచ్చిన
మా యెడల బ్రసన్న బుద్ధి మనుపుమికన్ రా
మా! యొడయండవు దిక్కు
వే యని ప్రార్థింప రామవిభు డిట్లనియెన్.

85. అహో! మునులు నిగ్రహాను
గ్రహదక్షులు మీర లిట్లు ప్రార్థింతురె! న
న్నహరహమున్ లోకశుభా
వహముగ నాజ్ఞల నిడుం డవశ్యము దీర్తున్.

86. వనవాసము సేయగ వ
చ్చినాడ నైనను దొరకొని శిక్షింతును దు
ర్జనులన్ రక్షింతును స
జ్జనతతి, నయ్యదియె నాకు సద్ధర్మంబౌ

87. అలజడి వడకుడు మీ రిక
నలఘు మదీయోగ్రవిక్రమాటోపమునన్
జ్వలితార్కాభానిభశరా
వలిచే నింకింతు దానవసరశ్చయమున్.

88 అనినన్ బరమర్షులు బో
రన గీర్తించిరి ప్రహర్షరాగోద్దామ
స్వనులై రాఘవు, దీవ్య
ద్ఘనదీర్ఘశరాసన సముదంచద్బాహున్.

సుతీక్ష్ణమునిసందర్శనము

89. అటుపై గంగాతీరం
పు టధ్వమున నేగి వారు మునితతితోడన్
బటుతరతపోనిధాను గ
నుటకున్ జేరిరి సుతీక్షణు శుభాశ్రమమున్.

90. ఫలకుసుమభరితతరువులు
బిలబిలరవముల బులుగులు, బిసరుహకలిత
మ్ములు విమలజలనిలయములు
లలితపదగతినటనము లలరెడు నెమళులున్.

91. చెలువారు శాద్వలస్థల
ములన్ మెసవుచున్ గురంగముల గములున్ వ
త్సలతాప్రపూర్ణధేనుత
తులు నుటజోద్భూత హోమ ధూమావళులున్.

92. రమణీయంబగు నయ్యా
శ్రమమున్ గని యలరి రామచంద్రుడు మునిసం
ఘముతో జనుచుండగ సం
యమి యెదురై స్వాగతించి యాదర మొప్పన్.

93. ఆతిథ్యవిధులు ధర్మో
పేతమ్ముగ దీర్చి రామవిభున కనియె వా
చాతీతము నీదు మహిమ
సీతావర! రామచంద్ర! సితకమలాక్షా!

94. నీ విట్లు దయాళువవై
నావంకకు వచ్చి దర్శనం బిచ్చితి కై
కోవె యొసంగుదు భవ్యత
పోవిభవాత్తాఖిలప్రపుణ్యజగంబుల్.

95. ఆలించితి మున్నె భవ
త్పాలితపితృవాక్య రాజ్యపదవీత్యాగా
భీలారణ్యగమనముల్
శైలోపమధీర! రామ! సద్గుణసాంద్రా!

96. అనవుడు రాఘవు డనియెన్
మనం బలర నాదరాభిమానంబులు రె
క్కొన మన్నించితి రివె వం
దనంబు లపరిగ్రహవ్రతాభిరతుండన్.

97. నిరపాయసుఖకరస్థల
మరసి కృప వచింపుడు సమయవ్రతనిష్ఠా
పరిపూరణంబు మాకు సు
కరంబు ననవద్యమై నెగడగ దపస్వీ.

98. శరభంగుండను తాపస
వరుండు గౌతముడు వినిచె భవదీయతపో
గరిమావిశేష మాత్మో
పరతుండనియు న్పరమశుభప్రదు డనియున్.

99. అనుడు సుతీక్ష్ణుండనె నీ
వనంబు సకలసదుపాయభరితంబును బా
వనమున్ రాఘవ! యిచ్చో
టన మీ రెల్లరు వసించుట ముదావహమౌ.

100. మృగముల బాధ యొకడు త
ప్పగ నొం డెయ్యదియు రామభద్ర! యిటన్ గా
నగరాదు మాకు సుమ్మన
గ గోసలేయు డనె నిట్లు గారవ మెసగన్.

101. మీతోడ నాదు నున్కి వి
ఘాతం బగు శాంతి మీకు గాన నరుగుదున్
బూతాత్మ! వాసయోగ్యం
బై తనరారు విజనస్థలాంతరమునకున్.

102. అనుచున్ జని సాయంసం
ధ్య నుపాసించి నిశి గడపి దాశరథి ప్రభా
తనియమముల్ కైరవగం
ధ నిభృత శీతాంబు పూరిత సరస్తటినిన్.

103. తీరిచి ముని సవిధంబున్
జేరి ప్రణతుడై వచించె సీతాపతి చే
కూరెన్ బ్రమోదము భవ ద
పారాదర సాన్నిహిత్య భావ ప్రాప్తిన్.

104. నడుమంత్రపుసిరి వచ్చిన
పుడమిపతిం బోలె దినవిభుడు నడిమింటన్
గడు జెలరేగక పూర్వమె
తడయక నేగుదు మనుజ్ఞ దయసేయు మికన్.

105. తొందఱ సేయుదు రీ ముని
లందఱు తాపసవర యన న య్యనఘాత్ముం
డందుల కియ్యకొని మహా
నందంబున బెక్కు దీవన లొసంగి యనెన్.

106. పరమాత్మజ్ఞానరతులు
సురుచిర తేజఃప్రభావ శోభితులు చిర
స్మరణీయులు తాపసు లెం
దఱొ గల రీ ప్రాంతపు వ్వనంబుల లోనన్.

107. అనుజుండు భార్యయున్నీ
వును దత్పుణ్యవనులు గనబోవుడు శుభద
ర్శనులు మునివర్యు లీ కా
ననమార్గము సుందరంబు నయతత్త్వనిధీ!

108. మఱి యొక్కసారి భార్యా
వరజత్రితీయుండ వగుచు వచ్చి మ దుటజాం
తరమున్ బావన మొనరిం
చి, రఘూత్తమ! యనుగృహీతు సేయుము నన్నున్.

109. అనుచు దృఢపరిష్వంగము
న నాదరించి యనుప రఘునాథుడు ధరణీ
తనయయు దమ్ముడు తాపసు
లనుగమనము సేయగాబయన మయ్యె వనిన్.

సీతారాముల రాక్షసవధావిషయిక సంవాదము

110. పయనమ్మునకున్ సిద్ధం
బయి నడువం బోవు రామభద్రుని తోడన్
నయము వినయంబు నొప్పగ
నయోనిజాత పలికె మధురార్థం బెలమిన్.

111. కామవ్యసనవిరోధివి
వ్యామోహివి గావు సత్యవచన రతుడవున్
సామాద్యుపాయనిధి వు
ద్దామ భుజ పరాక్రమ విదిత యశస్కుడవున్.

112. రూపము దాల్చిన ధర్మం
బై పరగుదు వెన్న దేని యణుమాత్రము ధ
ర్మాపేతవిషయముల్ జొఱ
వో పుణ్యాత్మక! భవ న్మహోన్నతబుద్ధిన్.

213. ఇపు డగపడు చుండె దలప
విపరీత విషయ మొకండు విదితమ్ముగ నా
థ! పరాక్రమ ప్రకటన య
త్న పరుడ వైతివి దనుజహననమూలముగన్.

114. సమిధల పెంపున జాజ్వ
ల్యమానుడగు వీతిహోత్రు నట్లె క్ష్మానా
థమ హేంద్ర! శస్త్రసాంగ
త్యమునన్ జ్వలియించు క్షత్రియస్వాంతంబుల్.

115. నిరతం బధిజ్య చాపో
ద్ధురులై కనవత్తు రీరు దుర్ధర్ష! నిశా
చరు లేమి యొనర్చిరి నీ
కరయ నకారణవిరోధ మది ధర్మంబే.

116. మునివేషధారులగుచున్
వనికిన్ వచ్చితిరి జనక వాక్పాలన ధ
ర్మనియతి తపం బొనర్చుట
యె నీతి కొననేల మీర లీ శస్త్రములన్.

117. వినుతక్షత్రియజీవన
మున కొప్పెడు గాక యస్త్రములు శస్త్రములున్
మునిజీవన మేడః మహా
శనితుల్యాయుధము లేడః జగదేకవిభూ!

118. తనపై నెత్తిన వానిన్
రణమున బోకార్చుట తగు నాథ! యదియు క్షా
త్ర నిసర్గ ధర్మమౌ గా
ని నిరపరాధుల వధ తగునే రాజులకున్.

119. మునులన్ గాచు నెపంబున
దనుజ వినిర్మూలనంబు ధర్మం బని యొ
ప్పని ప్రతినం జేసితి వీ
వు నాథ! న న్గలచు చుండె బో యది యసదై.

120. ఆయుధము కల్మి దుష్టం
బాయుధములు సాధు జీవనాసక్తులకున్
బాయని యంతశ్శత్రుని
కాయము విను మొక్క గాథ కలదు వచింతున్.

121. అనితరసాధ్యతపంబున్
బొనరించుచు నుండె నొక్క ముని భీతుండై
చనె వజ్రి కపటరూపం
బున మౌని తపంబు భంగ మొనరించుటకున్.

122. కపటంపు మాటలు పలికి
ఉపాయములు పన్ని ఖడ్గ మొక్కటి దివిజా
ధిపు డిచ్చె మునికి న్యాస మ
నుపేర గాపాడ జొచ్చెను మునియు దానిన్.

123. ఫలమూలాహరణార్థమొ
జలంబులకొః హవ్యవస్తు సంపచ్చయ సం
కలన నిమిత్తమొ చను వే
ళల నేనియు వీడడు ముని రౌద్రాయుధమున్.

124. అతిజాగరూకతన్ దృ
క్తతివలయంబున నిడికొని తాపసి తత్సం
గతు డయ్యె నెల్ల వేళల
మతిస్థిరత జెడె గ్రమక్రమంబున మునికిన్.

125. హుతభుక్కార్యాధ్యయన
వ్రత తత్పరతయు తపోభిరతియున్ బరదై
వతచింతనంబు నశియిం
చి తపసి హింసా పరీత చిత్తుండయ్యెన్.

126. నిరతంబు దదీయాయుధ
ధరు డగుచు వధింప సాగె దత్కాంతారాం
తర పశుపక్షి సమూహము
గరుణారహితాత్ముడున్ మృగప్రాయుడు నై.

127. పరమాత్మసంగచింతా
పరాయణుడు తాపసుండు పరమాయుధసం
గరుషాఘంబున హింసా
పరాయణుం డయ్యె వింటె! భద్రగుణాబ్ధీ!

128. మఱి యయోధ్యా పురమున
నరపాలన వైభవంబున నెసంగు తఱిన్
ధరియింతు గాని దోషా
కర మీ శస్త్రము విడువుము కానన వృత్తిన్.

129. హితము నహితం బెఱుగు ని
శ్చితాత్ముడవు నాథ! నీకు జెప్పం గల స
న్మతి గాక వోయియు వచిం
చితి నిట్టు లధర్మ భీతచిత్తము తోడన్.

130. యుక్తాయుక్తమ్ములు ధ
ర్మోక్తి విచారించి సముచితోరుపథము ధీ
యుక్తముగ నిర్ణయింపుము
శక్తిప్రాభవము లెసగ సజ్జనగణుతిన్.

131. సమకూరు నర్థములు ధ
ర్మము కలన దలప సుఖంబు లబ్ధంబగు ధ
ర్మమె కారణముగ దద్ధ
ర్మమూలములు జగము లెల్ల మహితయశస్వీ.

132. ఉపవాస వ్రత బహునియ
మ పరత్వంబున బరగుచు మహితాత్ములు పు
ణ్య పురుష లార్జింతురు సు
మ్మ పరమధర్మంబు లోకమున ధర్మాత్మా.

133. ఘోరక్షత్రియధర్మ వి
చారంబును మాని సాధు సన్ముని వినుతో
దార ప్రశాంత ధర్మ వి
చారము సేయుటయ నాకు సంతోషమగున్.

134. అనినన్ రాఘవు డిట్లనె
జనకాన్వయగౌరవంబు సన్మానవతీ
జనశీలము ధర్మంబున్
దనరారగ జెప్పితివి హితము ప్రియ మెసగన్.

135. ధరణీ జనరక్షణకై
ధరణీవరు లాయుధములు దాల్తు రటంచున్
ధరణిజ! వల్కితి వీ వను
సరణీయము ధర్మ మదియె క్షత్రజనునకున్.

136. కాననముల నున్న నయో
ధ్యానగరి వసించినను జనావన ధర్మం
బూనుట దప్ప దటంచున్
మౌనులు నాకు న్వచించినది వింటివిగా.

137. సురవైరుల పోకడ దె
ల్పరె! తాపసులప్డు నాకు పఌలరుధిరముల్
దొఱగించి సవనవేదుల్
చెఱచి మునీంద్రుల వధించి చెలగుదు రనుచున్.

138. నన్నే జనపతి గాగన్
మన్నించి దనుజుల బాధ మాన్పు మటంచున్
విన్నపముల్ సేయరె! యా
పన్నుల రక్షించి ప్రోవ వల్వదె నాకున్.

139. బాలిశరాక్షసవధకున్
జాలక కాదు మును లట్లు న న్గోరుట స
చ్ఛీలురు శపింప బాల్పడ
రోలలన! తపోవ్యయమున కోర్వమి చేతన్.

140. కాన శపథం బొనర్చితి
దానవనిర్మూలనంబు దవిలి యొనర్పన్
జానకి! సత్యవచనుడన్
బూని మునుల కిడిన మాట పొల్లో చనునే.

141. ఆడియు దప్పమి ధర్మము
వీడమి నాకున్ వ్రతంబు వింటివె ధరణిన్
వీడుదు వీడుదు నిన్నున్
బాడి దొలగు కంటె! జనకనందిని! సీతా!

142. నీవు మదాత్మేశ్వరివి స
దా వర్తింతువు మదర్పితప్రియబుద్ధిన్
నీ వేటికి గలతం బడ
నీవు మెలగు మస్మదీయ నీతి పథమునన్.

143. ఆ రీతి ననునయించుచు
ధీరవరుడు రాముడు మునిదేవులతో గాం
తారమున జొచ్చె నంతన్
భూరిధనుర్ధరు డగుచు ననుజలక్ష్మణుతో.

144. తా ముందుగ నా వెనుకన్
భూమీసుత సీత వరధనుర్ధరుడగుచున్
సౌమిత్రి యా వెనుకగా
రాముండు నడచె మనోహర తపోవనులన్.

పంచాప్సర స్తటాకోదంతము

145. విపులతరశాఖల న్న
భ్రపు టంచు లొరయు తరువులు పటుతరతరుకాం
డపు టొరపిడులన్ గండూ
య పరీహారంబు సేయు హస్తికలభముల్.

146. సెలయేరులు నేటిపులిన
తలముల విహరించు నున్మదమరాళచయం
బులు చక్రవాకములు బక
ములు న్వికచసారసముల బొలుచు కొలకులున్.

147. రమణీయపుష్ప వనములు
సమున్నత ధరాధరములు సానువులున్ గృ
ష్ణ మృగ పృథుశృంగ కలిత
ప్రమత్త సైరిభములు వనబర్హిచయములున్.

148. కనుగొంచుం జని సాయం
తనమున గాంచిరి వికచ లతాద్రుమ యుత ని
ర్జనదేశంబున రమ్యం
బు నిర్మలాంబు ప్రపూర్ణము తటాకంబున్.

149. వనకమలాకరమున్ గన
వినవచ్చెం జంత్రవాద్య విమలస్వనముల్
వనితా పదనూపుర ని
స్వనమ్ములున్ మధుర గాత్ర సంగీతములున్.

150. పరమాశ్చర్యకరం బగు
సరోవరంబు గని రామచంద్రుం డడుగన్
బరమర్షి ధర్మభృత్తు వి
వరించె ద ద్విషయ మిట్లు వాత్సల్యమునన్.

151. అరుదగు ఘోరతపంబు నా
నరించె నిట మాండకర్ణి నా జను ముని తా
నురునియమయుక్తి సలిలాం
తరమున బదివేల యేండ్లు దశరథతనయా.

152. అతిభయసంవిగ్నాత్ములు
హుతవాహ ప్రముఖ దివిజు లోర్వక కమనీ
యతటిద్విలాససంశో
భిత లచ్చర లేవుర ననిపిరి ముని కడకున్.

153. సదసద్వివేకయుతుడున్
విదితాత్ముం డగు మునీంద్రు నిర్మల తపమున్
జెదరంగ బాపి మోహపు
టుదధిం బడ ద్రోసిరి వికచోత్పలనయనల్.

154. వశియైన మాండకర్ణి వి
వశుడై లోబడె ద దమర వనితా రూపా
తిశయ ప్రాభవమున గుసు
మశరాహతి, భార్య లైరి మౌనికి రమణుల్.

155. పరమ తపశ్శక్తి విభా
సురు డగు న మ్మాండకర్ణి సురుచిరసౌధం
బు రచించె నీ తటాకాం
తరమ్మునన్ దాను నొక్క తరుణయువకుడై.

156. పంచాప్సరాంగనల తో
పంచాయుధకేళి దగిలె వరతాపసి, వి
న్పించు నిటన్ దత్క్రీడా
ఖ్యంచితగీతధ్వనులు శ్రవఃపేయములై.

157. అనుచు దటాకోదంతము
వినిపించెను ధర్మభృత్తు విస్మయవశుడై
విని రాఘవుండు నడచెన్
వనమున దచ్ఛక్తివైభవమున కలరుచున్.

158. తరువాత రామచంద్రుడు
ధరాసుతానుజుల తోడ దర్శింప జనెన్
వరమహిమాన్వితంబులు
పరమమునీంద్రాశ్రమములు బ్రమదావహముల్.

159. భూపతిసుతుండు నయవిదు
డై పర్యాటన మొనర్చె నటవి పదేడుల్
తాపసుల పూజ లందుచు
దాపసవరపూజసేసి తనియుచు వేడ్కన్.

160. కొందఱి యాశ్రమవనులన్
సందర్శించె ద్విగుణముగ శాస్త్రార్థప్రీ
తిం దవిలి చర్చ లొనరిం
చెం దనుజత్రాస ముడుగ జేసె మునులకున్.

161. అంత నొక నా డరిగె సు
స్వాంతుండు సుతీక్ష్ణ మౌని యాశ్రమమునకున్
గాంతాసోదరయుతుడై
యెంతయు వేడుక మునీంద్రు నిచ్చ ఫలింపన్.

శ్రీరాముడగస్త్యమునిని దర్శించుట.

162. అట గొన్ని నాళ్ళు ముని యా
దట న్సమర్పించు సత్కృతము లందిన పి
మ్మట జనె నగస్త్యు దర్శిం
చుటకై తత్కథితపథము చొప్పున నటవిన్.

163. నడచుచు మార్గమ్మున ద
మ్ముడు లక్ష్మణు సీత జూచి ముదితాత్ముడు రా
ముడు చెప్పె దా నిటు లగ
స్త్యుడు పూతచరిత్రుడు జగదుపకారియు నౌ.

164. వాతాపియు నిల్వలు డన
దైతేయాన్వయు లిరువురు తాపసవేషుల్
నీతిరహితులై దంభో
పేతముగ వధించుచుండ్రి పృథ్వీసురులన్.

165. పితృదేవకార్య మనుచున్
క్షితిసురులం బిల్చి పూజ సేయుచు మేషా
కృతు జేసి యనుజు వండి పి
శితంబు దృప్తి గుడువంగ జేసిన పిదపన్.

166. ఎలుగెత్తి చీరు నా యి
ల్వలుండు రమ్మనుచు దమ్ము బ్రాహ్మణదేహం
బులు వ్రచ్చుచున్ బయల్వడు
ఖలుండు వాతాపి దేహకలితుం డగుచున్.

167. భూసురమాంసాశనమున
నా సోదరులు పరితృప్తు లౌదురు గడచెన్
వాసరము లెన్నొ యెందఱొ
మోసంబున బారి వడిరి భూసురు లచటన్.

168. దివిజప్రార్థితుడై మా
నివరు డగస్త్యుడు తదీయనిలయమ్మున కే
గి వరించె శ్రాద్ధభోక్తృ
త్వవిధిన్ రాక్షసులు మోదభరితాత్ములు గాన్.

169. తమ్ము యథాపూర్వముగా
నిమ్మగు శాకంబు సేసి యిల్వలు డంతన్
రమ్మని వాతాపి బిలిచె
న మ్ముని శేఖరుని భోజనాంతమున వెసన్.

170. ఇక నెక్కడి తమ్ముడు నా
దు కడుపునం జీర్ణ మగుచు దుష్కర్ముడు నా
రకకూపగతుం డయ్యె ను
రక పిల్వకు మతని నిల్వల యనె న్మునియున్.

171. అనుజుండు తాపసోదర
మునన్ మృతుం డగుట నెఱిగి ముష్కరవలలా
శను డడరె న్మునిపై ఘో
ర నిశాతాయుధ ధరుడయి రౌద్రం బెసగన్.

172. మునియున్ బ్రదీప్తతేజుడు
కనదగ్ని సమారుణాంబకద్వయము తోడం
గనె నిల్వలు దగ్ధుం డ
య్యెను వాడు మునీంద్రుడు దివిజేడ్యుండయ్యెన్.

173. ఈ వన మెంతయు సుందర
మౌ వికసిత సిత కుశేశయ చయ భ్రమ ద
భ్రావాస మరాళ మధుప
రావంబు లెసంగు నిర్మల సరస్సతిచేన్.

174. ఫలభారానతభూరుహ
ములున్ గుసుమభారనమ్రముల్ ద్రుమనిచయ
మ్ము లవ్వె లూనాగ్రములు కు
శ లవియె వైడూర్యవర్చసములై యెసగున్.

175. ఆశ్రమమునిశాటీనిక
రాశ్రయములు తరువు లవియె అన్యోన్యసుఖ
ప్రశ్రయభావంబులతో
విశ్రమ మొందు వివిధమృగవితతులు నవియే.

176. పవనోత్థితపక్వమధూ
కవనస్పతిసంచయకటుగంధంబులు ఘ్రా
ణవివరముల్ జొబు గన్పడు
నవె కాష్ఠప్రచయము లటనట నధ్వమునన్.

177. వనమధ్యస్థాశ్రమహో
మనిర్గతం బైన ధూమమండల మదిగో
కనబడు చూడు మనుజః కృ
ష్ణ నగశిఖర మనగ నాకసమ్మున కెగయున్.

178. పూత వినిర్మల తీర్థ
స్నాతులు ధరణీనిలింపసంఘంబులు స్వా
నీత సుగంధ కుసుమ మా
లాతతి నర్పింతు రదె సురావళికి బలుల్.

179. విమలస్వాంతుండు సుతీ
క్ష్ణమౌని వచియించు న య్యగస్త్యానుజు నా
శ్రమ మి య్యదె యగు రవి ప
శ్చిమాద్రి న స్తంగతు డగు చెలువము తోచున్.

180. అనుచున్ రాఘవుడు మునీం
ద్రు నాశ్రమంబున్ జొఅగ నెదురు వచ్చి యతం
డనుపమగతి స్వాగత మిడి
యొనర్చె నాతిథ్యపూజ లుల్లాసమునన్.

181. వరువాత లేచి ప్రాతః
కరణీయములెల్ల దీర్చి కాకుత్స్థుడు సో
దరుడున్ గాంతయు దోడుగ
వరముని యామంత్రణంబు వడసి చనె వనిన్.

182. అరుగుచు నగ స్త్యనామ
స్ఫురణన్ బులకాంచితాంగమున రాముడు సు
స్వరమున వచించె ని ట్లను
చరసీతాలక్ష్మణులకు సానందముగన్.

183. మహిమోదారు డగస్త్యుడు
మహానుభావుడు మునిజనమాన్యుండును లో
కహితంకరచరితుడు ని
గ్రహించె దండధరు బటుతరతపశ్శక్తిన్.

184. పౌలోమీ సంగ సుఖే
చ్ఛా లౌల్య కృతాపరాధసంభృతపాపున్
దై ్రలోక్యరాజ్య పద గ
ర్వాలంకృత వేష నహుషు నజగరు జేసెన్.

185. మేరువుతో మత్సరమున
సౌరాధ్వము మీఱి వింధ్యశైలం బినసం
చారనిరోధ మొనర్చెం
దోరపు గర్వంబున భయదోగ్రాకృతితో

186. జగములు బెగ్గిలుచుండగ
నగస్త్యు డయ్యచలనాథు నారసి వినతుం
డగు నాతని ద్రోవ యొసం
గ గోరె దక్షిణదిశాముఖంబుగనేగన్.

187. మునిమాట దురవలంఘ్యం
బని గిరిరాజు తలయొగ్గి యవనీసముడ
య్యె నొదిగి, తాపసి చనె ద
క్షిణదిశ జిత్తమున సంతసించుచు ననుజా.

188. గిరివరున కిట్లనె న్మ్మని
వరుండు నాయెడల భక్తి బచరించితి వో
ధరణిధరమః యింకన్ నే
మఱలెడు నంత కిటు లుండుమ! వినమ్రుడవై.

189. పిదప నగస్త్యుడు పయనిం
చి దక్షిణమ్ముగ నరిగి వసించె నచట న
ట్లొదిగియ యుండెన్ గిరి స
మ్మదమ్మున జెలగె బ్రజాళి మౌనీంద్రుకృపన్.

190. అగగర్వం బడగించుట
నగస్త్యు డయ్యె ముని దక్షిణావనియు బలా
శగణవివర్జిత మయ్యెన్
నెగడె జపతపోధ్వరములు నిర్విఘ్నములై.

191. భాసురచరితు డగస్త్యుడు
వాసం బొనరించు కతన బరగె నది యగ
స్త్యాశ యనగ ద న్మునిసహ
వాసంబు శుభప్రదంబు భవ్యం బనుజా.

192. లోపాముద్రాసాధ్వియు
నా పావనమూర్తి గొలుచు నత్యధికప్రే
మోపేతభావమున సూ
ర్యోపాసన సల్పు ఛాయయో యన సతమున్.

193. శ్రవణప్రాప్తము లగుచు
న్న వగ్నికార్యోన్ముఖ మునినాథ స్వాహా
రవముల్ శుకపికగీతా
రవములు వేదపఠనమధురారావములున్.

194. అదె య మ్మహనీయాశ్రమ
పదంబు గాదోచు నార్ద్రపటసంచయముల్
గదలాడు గాలి తాకున
మృదుపల్లవ పుష్ప ఫల సమృద్ధ తరువులన్.

195. మృగపతు లేన్గులు నకులో
రగములు శార్దూల కాసర శరభ గో మే
ష గవయ మృగాదులు మెలగు
విగర్హితాన్యోన్య సహజ విద్వేషములన్.

196. సుర సిద్ధ సాధ్య విద్యా
ధర కిన్నర కింపురుషులు తాపసి సేవిం
తు రహరహం బెందఱొ కాం
చి రవ్యయపదంబు రాజ్యచిరవైభవమున్.

197. జీవింప నోవ రిచట మృ
షావాదులు గ్రూరులున్ నృశంసులు శఠులున్
భావజతంత్రరతులు క్రో
ధావిష్టాత్మ లవినీతు లసదాచారుల్.

198. నా రాక విన్నవింపుము
నీరేజభవసదృశుండు నిర్మలుడున్ దై
వారాధితుండు మహిమో
దారు డగస్త్యముని కీవు తమ్ముడ యనినన్.

199. వినయమున నట్ల యని ల
క్ష్మణుం డరిగి తాపసాశ్రమంబున దచ్ఛి
ష్యు నొకని కిట్లనె మునిద
ర్శనం బపేక్షించి రామచంద్రుడు వచ్చెన్.

200. దశరథరాణ్ణందనులము
వశీకృతాత్ముండు రామభద్రుండు దద
గ్రసుతు, డతడు పితృాజ్ఞా
వశమున రాజ్యంబు వీడి వచ్చె వనులకున్.

201. జనకాత్మజ సీతయు బతి
ననువర్తించి యరుదెంచె నడవికి శ్రీరా
మునికిం దమ్ముడ భక్తుడ
ననుకూలుడ హితుడ లక్ష్మణాఖ్యుడ నగుదున్.

202. ఆ రాము డాశ్రమముఖ
ద్వారంబున వేచి యుండె దర్శనవాంఛన్
జేరి నివేదింపుము దత్
శ్రీరామాగమనము తపసికి నీవు వెసన్ .

203. అని లక్ష్మణుండు తెల్పగ
మునిశిష్యు డరిగి యథోక్తముగ నెఱిగింపన్
విని హర్షంబున దాపసి
యనె రాఘవున కవరోధ మర్హమె యిచటన్.

204. కొనితెమ్ము జానకీల
క్ష్మణయుక్తున్ రామచంద్రు జయ్యన జని వే
గనుల బ్రతీక్షించెద న
య్యినవంశపయోధిసోము నీక్షింప ననన్.

205. వేవేగం జని శిష్యుం
డా వైనము దెల్ప రాము డరిగెన్ సీతా
దేవీసౌమిత్రులతో
నా విశ్వ వినుత శుభాశ్రమాంతరమునకున్.

206. రవి శశి ధర్మ బ్రహ్మేం
ద్ర విధాతృ భగానలానిలానంత కుబే
ర వరుణ గాయత్రీ స్కం
ద విష్ణు శేష వసు దైవతాస్థానములన్.

207. కనుచుం జనుచుండగ రా
ముని కెదురై వచ్చె తోడి మునిచయములతో
డ నగస్త్యుడు, రాముడు పా
ద నమస్కృతి సేసె భక్తితాత్పర్యమునన్.

208. జనకాత్మజాతయున్ ల
క్ష్మణుండు మ్రొక్కిరి తపస్వి చరణంబులకున్
వినమితగాత్రులగుచు మ
న్నన జేసె న్మునియు వారి నయవాక్యములన్.

209. పిమ్మట తాపసి యగ్నిగృ
హమ్మున విహితగతి వ్రేల్చి యాతిథ్య మొసం
గెమ్మోదమ్మున వారల
కిమ్ముగ నిడె దాపసజన హితభోజనమున్.

210. ఆతిథ్యానంతరమున
సీతావిభు జూచి ముని వచించె నపార
ప్రీతి నిట కీవు వచ్చుట
జేతంబున మెచ్చి సంతసించితి రామా!

211. మునిజనుడు వైశ్వదేవము
పౌనర్చి చేయవలె నతిథిపూజ యటుల్ సే
యని తాపసుడు స్వమాంసా
శనుడగు నరకమున గూటసాక్షియు బోలెన్.

212. అనుచు సురభిళ ప్రసవము
ల ననఘు శ్రీరామచంద్రు లలితాకృతు న
ర్చన సేసి మధురఫలముల్
వనమూలంబు లిడి తనిపి వచియించె నిటుల్.

213. లోకముల కెల్ల రాజువు
ప్రాకటధర్మానువర్తనై కాత్ముడవున్
నాకు ప్రియాతిథివై తివి
శ్రీకరుడవు మాన్యుడవు సుశీలుండవునున్.

214. ఇది యొక సుమహచ్చాపం
బు దివ్యము విధాతృదత్తము నమోఘము శ్రీ
ప్రద! హేమరత్నభూషిత
మిది వైష్ణవము సురశిల్పికృతము దృఢంబున్.

215. ఈ యక్షయ తూణీరము
లా యింద్రు డొసంగె నుజ్జ్వలాగ్నినిభంబుల్
సాయకములు హేమాంచిత
మీ యసియున్ గోశయుక్త మింద్రుడె యిచ్చెన్.

216. ఘోరాసురదానవసం
హారము గావించె నీ మహచ్చాపమునన్
శ్రీరామ! తొల్లి విష్ణువు
స్వారాజ్యశ్రీ దివౌకసాళికి గూర్పన్.

217. కాను మివ్వి నీవు వజ్రం
బును గొన్న నిలింపనాథు బోలె జయార్థం
బని యొసగన్ రాముడు వం
దన పూర్వకముగ గొనియె దదాయుధచయమున్.

218. మహనీయాయుధము లొసగి
మహానుభావుం డగస్త్యమౌని యనియె తు
ష్టహృదయు డైతి నృప! శుభా
వహమగు సౌమిత్రి! నీకు భ్రాత గొలుచుటల్.

219. జానకి చరితం బద్భుత
మౌ నీ యమ భర్తతోడి యనురాగమునన్
గానన వాసము సేసెడి
నే నారుల గాన మిట్టి దే కాలమునన్.

220. సహజశతహ్రదభావుల
గు హరిణనేత్రలు వరించి కొల్తురు పతులన్
సహచారిణు లగుచు సుఖా
వహకాలముల, ద్యజియింత్రు పరకాలములన్.

221. అసి నిశిత బుద్ధులై యీ
యసితేక్షణ లరయ గారుడానిల సమ వే
గ సహితముగ దీర్తురు గా
ర్యసరళి సదసద్విచార రాహిత్యమునన్.

222. ఈ గతి దుర్లక్షణముల్
సాగరకన్యా సమ ప్రసన్న కటాక్ష
ప్రాగల్భ్య పతివ్రత శ్రీ
రాగవ! సీత యెడ గాన రా వారయగన్.

223. సుమకోమలాంగి సుఖయో
గ్య మాననీయచరిత జనకాత్మజ యీ దు
ర్గమ కంటకాశ్మ మయ పథ
గమన శ్రాంతిం బడు ఖరకరతాపమునన్.

224\. కడు జాగరూకతన్ బ్రో
వు డీ యమన్ రామభద్ర! ప్రొద్దగు మీరున్
గడు బడలిక వడి నట్లగు
పడుదురు రవి యస్తమించు బడమటి కనుమన్.

225\. మీరు వసించెడి తా వది
శ్రీరుచిరాలంకృతముగ జెలగున్ సౌమ్యా
కారులు సద్గుణులు సదా
చారులు సత్త్వగుణశుద్ధసన్నియతాత్ముల్.

226\. అని సాయంసంధ్యావం
దన హోమ విధు లొనరింప దాపసి చన దా
ము దత్సమయవిహిత కృ
త్య నిరతు లగుచున్ బరగిరి దశరథసూనుల్.

227\. పరమసుఖప్రదమై నిశి
యరుగగ రాఘవులు సమ్యగాచరితప్రా
తరుపాసనాదు లై ప్రమొ
క్కిరి ముని చరణాబ్జయుగళికి న్వినయమునన్.

228\. రవికులతిలకుడు మునికనె
భవ దాదరగౌర వానుభావంబుల మా
కు విభావరి సుఖదంబ
య్యె వెలార్చితి మాయెడల బితృప్రేమంబున్.

229. విజనము పావనమున్ విమ
లజలాపూర్ణము కుసుమఫలభరితము న్ని
త్యజపతపోయోగ్యంబు స
హజప్రశాంతరమణీయ మగు దేశమునన్.

230. వసియింప నిచ్చయింతు గృ
ప సేసి తెల్పు డనగా తపసి కించిత్ ధ్యా
న సమాహితాత్మ ననె రా
మ! సర్వమున్ దెలిసె నీదు మానసవృత్తుల్.

231. నీవు వచించిన యట్టిది
పావన గోదావరీస్రవంతీ తట ర
మ్యావని పంచవటి యనం
గా వెలయున్ దరు హరిణ శుక పికాఢ్యంబై.

232. ఒక రెండు యోజనము లిచ
టి కయ్యది సొగసులు జిమ్మెడిన్ శైలసుగం
ధకుసుమ మయూర గజ కల
భ కదంబంబు లట రామభద్రః సతతమున్.

233. ఆ కనవచ్చెడి సాంద్రమ
ధూకవని న్దాటి చనిన తోడన్ గన నౌ
మీకు విటపి పంచవటియు
నా కౌబేరదిశ గాన నయ్యెడు నటుపై.

234. వసియింపుడు మీ రచటన్
వసుంధరాత్మజకు నేత్రపర్వంబగు నా
వసుమతి నిర్మింపు డొక య
వసథంబున్ రామ! మీకు భద్రం బగుతన్.

235. పంచవటీవాసమున సు
ఖించుచు బలలాశనతతి కీడ్వడ శౌర్యో
దంచితవృత్తిన్ గావుము
సంచితధర్ముల దపస్వి జనసత్తములన్.

236. వనవాసశేషకాలం
బు నచట జెల్లించి రాజ్యభోగప్రాప్తిన్
దనరుదువు తరించె భవ
జ్జనకుండు యయాతి రాజచంద్రుంబోలెన్.

237. అనుచు నగస్త్యుం డామం
త్రణంబు సేయ న్వెడలిరి రాఘవుడున్ ల
క్ష్మణుడు సముదగ్రబాణా
సనాసిధారులగుచు వని జానకి తోడన్.

శ్రీరాముదులుపంచవటికరుగుట

238. శలభముల కగ్నిహోత్రము
బలెన్ రిపుచమూవిదాహపటుబాహువు బా
హులసద్దీర్ఘశరాసో
జ్జ్వలతేజస్వి చనెరామభద్రుదు దనుజుతో.

239. వనచిత్రవిచిత్రములన్
గనుగొంచుం జని చని పెనుఖగపతి నొకడున్
గని రొక భూమీరుహశా
ఖ నిశిత నాసా నఖ ప్రకట గరుదాఢ్యున్.

240. కానంగ రావు మున్నీ
కాననమున ఘోరరూప కలిత విహగముల్
దీని తెఱంగున నిదియే
దానవ మాయాకృతియొ గదా సౌమిత్రీ!

241. అని రాఘవు డనుచుండన్
దనుజుడ గా నయ్య! నీదు తండ్రి దశరథా
వనిపతి కిష్టసఖుండన్
వినుము జటాయు వను పేర విదితుడ జగతిన్.

242. ఎఱిగితి గర్ణాకర్ణిగ
బురంబు వీడి వని కీవు వోవుటయు న్రా
ణ్మరణంబు గైకయీకృత
భరత ధరాపాలకపదవైభవతృష్ణన్

243. వినతాసుతు డరుణునకున్
జనియించితి శ్యేని యందు సంపాతి మద
గ్రగణి రామచంద్రః భీకర
వనముల దో డగుదు నీకు భవదిష్టగతిన్.

244. అనుచున్ జటాయువు వచిం
చిన దెల్లయు నాలకించి చేతోమోదం
బున గౌగిలించి యభివం
దన వాక్యము లాడి యరిగె దాశరథి వనిన్.

245. వివిధ వికచప్రసవగం
ధవాహములు గౌతమీ సుధారస కల్ప
ప్రసవ దంబుశీకర స్నా
త వాత పోతములు సౌఖ్యదములై యెసగన్.

246. ఎలదేటి పాటలు వినుచు
లలితకలాపిమృదుచరణలాస్యము గనుచున్
సెలయేటి నీటి నానుచు
లలిత మధుర పక్వఫలములు గొని తనియుచున్.

247. తరువుల నీడల శ్రమమున్
దొలగించుచు నాతిదూర ధూర్తమృగములన్
శరరవముల బెదరించుచు
గురంగమతతికి గుశ లొసగుచు జని యొకచో

248. ఇదె పంచవటి యనంగా
విదితం బగుచున్నది ముని వివరించిన య
ట్లు దివిజనందన వన ర
మ్యదర్శనం బగుచు లక్ష్మణా! చూచితివే.

249. సమతలము, సన్నిహిత సుమ
సమిత్కుశ ఫలోదకంబు, సదమలమున్ యో
గ్యము తావు నరసి నిర్మిం
పు మాశ్రమంబు సుఖవంతముగ దనరారన్.

250. అనె దమ్మునకున్ రాముడు,
ప్రణతుండై లక్ష్మణుండు రామవిభున కి
ట్లనె నన్న! నీకడ స్వతం
త్రనిర్ణయము నా కగునె శతాబ్దము లున్నన్.

251. నీవ వచింపు మరసి తగు
తా వెయ్యదొ నిర్ణయించి తద్దేశమునన్
గావింతు బర్ణశాల సు
ఖావహము దృఢంబు గాగ గమనీయగతిన్.

252. అనినన్ రాముడు సంతస
మున దమ్ముని మెచ్చి ప్రాంతము నిశితపరిశీ
లన మొనరించుచు నిట్లనె
ననుజా యుచితస్థల మొక డయ్యది కనుమా.

253. అది యొక విశాల విమల
ప్రదేశము సుగంధబంధురప్రసవ సుధా
మధురఫల భరిత తరు సం
పద బొల్చున్ గౌతమీస్రవంతియు దాపౌ.

254. ఆవికసితపద్మాకర
మై విమలాంబుప్రపూర్ణమై బకహంసీ
రావమధురమై చెలగు స
రోవరమిది గనుట చక్షురుత్సవ మనుజా!

255. ఈ పుణ్యస్థలమున సౌ
ఖ్యాపాదకముగ రచింపు మాశ్రమమున్ శా
స్త్రోపాదితవాస్తువిధా
నోపేతంబుగ ననిన సముత్సాహుండై.

256. అన్నకు నమస్కరించి స
మున్నత సాల తరుశాఖ లొకకొన్ని వెదు
ళ్ళున్నిల్పి శరశమీప
త్రోన్నయన మొనర్చి కట్టె నుటజ మొకండున్.

257. ద్వారములు గవాక్షములున్
దీరిచి యగ్నిగృహము నతిథిగృహంబును దై
వారాధనగృహమున్ వే
ర్వేరుగ విశదముగ నేర్పరిచె లక్ష్మణుడున్.

258. ఈ చక్కని యాశ్రమమున్
నా చిత్త మెఱింగి కూర్చినాడవు సౌమి
త్రీ! చూడు మింతకంటెన్
నా చేయ గలది కలదె! యనంతగుణాఢ్యా!

259. అనుచు దృఢబాహుబంధం
బున గౌగిటికిం గొని శిరమున్ మూర్కొనె న
య్యనుజున్ రాఘవుడు మనం
బున తద్ద యలరుచు నుటజముం గని నంతన్.

260. ఉటజప్రవేశము సలిపి
రటుపై జనకసుతతోడ రఘునందను లా
దట వాస్తుదైవ పూజా
పటుమంత్రపఠన మొనర్చి బలు లిచ్చి వెసన్.

261. ప్రత్యూషగౌతమీజల
నిత్యస్నానజపనియమనిష్ఠుడు పతికిన్
ప్రీత్యావహ బహువిధ స
త్కృత్యాసక్తాత్మ జానకి ప్రవర్తించెన్.

262. అన్నకు వదినకు ననుదిన
ము న్నతుడై పూజ సేసి పుష్పఫలాదుల్
మన్నన నొసగి నిశాసమ
యోన్నిద్రత గాచియు న్సహోదరు డుండెన్.

263. గిరికందరాగతఝురీ
తరంగమధురస్వనములు తత్సానుప్ర
స్తరనాట్యాలోల మయూ
రరావములు నాలకించి రంజితు లగుచున్.

264. ప్రకట వనవిహారంబుల
సుకముగ గాలంబు గడపుచుండి రమలధా
ర్మికమతి బంచవటిన్ జా
నకీరఘూద్వహులు లక్ష్మణని షేవితులై.

హేమంతర్తు వర్ణనము

265. రాజప్రకాశవర్ధన
యోజనమున వియుతమానసోన్మాదసమా
యోజనమున స్తుతినిందా
భాజన మగుచు శరదృతువు పాసిచనంగన్.

266. హేమంతంబున సీతా
రాము లరిగిరి నదికిన్ గలశధరు డగుచున్
సౌమిత్రి వెంట రా దొలి
జామున దోయావగాహసంకల్పమునన్.

267. అరుగుచు లక్ష్మణుడిట్లని
యె రామచంద్రునకు జూచితె కడచి చనియెన్
శరదృతు వరుదెంచినది ఋ
తురాజు హేమంతము హిమతోయస్రవమై.

268. జనులున్ నీహారవరుష
తనులైరి సమృద్ధ మయ్యె ధాత్రీస్థలి స
స్యనిరూఢి సుభగు డయ్యె జ్వ
లనుం డనుపభోగ్య మయ్యె, రామ! సలిలమున్.

269. మును లగ్రయణసవంబుల్
పౌనర్చి పితృదైవతప్రపూజనముల్ సే
సి నిరస్తదోష లౌదురు
వినూత్న ధాన్యోపయోగవిహితాత్ములరై.

270. జనపదము లెల్ల శోభిం
చు నఖిలసంపత్సమృద్ధి సురభితతులాసం
గును దుగ్ధంబులు మెండుగ
రణసన్నాహము లొనర్తు రవనీశ్వరులున్.

271. ప్రకటమ్ముగ భాస్కరు డం
తకపాలితదిఙ్ముఖగమనపరు డగుట రా
మ! కుబేరదిశ ప్రకాశిం
పకుండె దిలకరహితప్రమదయుం బోలెన్.

272. తరువుల నీడలు జలశీ
కరములు విప్రియము లయ్యె గానల, మధ్యా
హ్నరవి సుఖకరస్పర్శన్
జరించు సంక్రాంతచంద్రసౌభాగ్యమునన్.

273. హిమగిరి యథార్థనాముడు
సుమి రవి దూరమ్ముగ జనుచున్కి సహజశీ
తము పశ్చిమమారుత మి
ష్టు మఱియు శీతముగ వీచెడు బ్రభాతములన్.

274. పండి కనకప్రభలతో
దండులభారమున గించిదానమ్రశిరో
మండలములు శాలు లెసగు
చుండెన్ ఖర్జూరకుసుమశోభల తోడన్.

275. పెను దప్పిక గొని వచ్చిన
వనదంతి జలంబు ముట్టి పానవిరతమై
వెనుదిరిగి చనున్ శైత్యం
బును దాళగ లేక తుండము విదిల్చి వెసన్.

276. అవగాహనవాంఛారతి
స్రవంతి దఱి జేఱియు జలచరవిహగశ్రే
ణి వివశమై నిల్చెడు నా
హావాప్రగల్భాల్పసైనికావళియొ యనన్.

277. తమ మావరించిన కొలది
యు మిక్కుటమ్ము లగును జలియున్ గాలియు వ
న్యమృగాళి చరింపదు దీ
ర్ఘము లయ్యె నిశలు తలప జగ మగోచరమౌ.

278. ధరణిజములు శ్వేతప్రా
వరణము లయ్యెన్ దుషారపాతంబున బు
ష్పరహితము లగుట నిద్రా
పరవశములు నైనటు గన వచ్చెడి నవియున్.

279. పరువములు బాసె గమలా
కరంబులు విశీర్ణ కర్ణికారవ్రజ కే
సరసంతాన జరాజ
ర్జరితాబ్జయుతము లయి హిమసంపాతమునన్.

280. అన్నా! నీవిటు లుండగ
సన్నుతచరితుడు భరతుడు సౌఖ్యము లెల్లన్
ద్వన్నిష్ఠితాత్మ వీడి వ
ని న్నున్న యటులె తపించు నిరత మయోధ్యన్.

281. ఈ యపరరాత్రముల ధ
ర్మాయత్తస్వాంతు డతడు ప్రవిమలసరయూ
తోయావగాహనోద్యతు
డై యరుగు సతతము కతిపయాప్తజనులతో.

582. వితతసదాచారనియమ
రతుండు విపులాంసుడు కమలాక్షుండు సుఖో
చితుడు జితేంద్రియుడున్ మృదు
హితభాషి యరిందముడు నిరీహుం డరయన్.

283. జనియింతురు లోకమునన్
దనయులు మాతృగుణసంపద నటన్న నుడిన్
వినుతస్వభావు డాతం
డన్నృత మ్మొనరించె జూడు మగ్రజ! రామా.

284. అట్టి మహితదశరథస
త్ప్రాట్టు పతియు ధార్మికుడు భరతుడు సుతుండై
నట్టి సతి కైక తా నిపు
డిట్టి గతిన్ గ్రూరశీల యెటు లయ్యె ననన్.

285. కటకట పడుచున్ రాఘవు
డిటు లనె సౌమిత్రి! కైకయీసతి నిందిం
చు టనుచితంబు వచింపుము
పటుశీలి భరతుగుణవిభవం బెంతైనన్.

286. వనవాసకృతాత్ముడను దృ
ఢనియమనిష్ఠావ్రతరతుడన్ భరతస్నే
హనిషంగతప్తహృదయుం
డ ననారత మనుజ లక్ష్మణ! యెఱుంగ వాకో.

287. స్మరియించుచుంటి నిప్డున్
భరతు సుధామధుర భాషణంబుల, నాకై
కరము తపించు నయోధ్యా
పురిన్ బరిత్యక్తరాజ్యభోగవిభవుడై.

288. మహితాత్ముడు భరతున్ దు
స్సహప్రకటవిక్రమాబ్ధి శత్రుఘ్ను భవ
త్సహితముగ గూడి శోభా
వహముగ నెన్నడు సుఖించు వాడనొ యనుచున్.

289. విలపించుచు రాముడు తద
మలతీర్థస్నానసూర్యమంత్రజపతపం
బులు బితృదైవతతర్పణ
ము లొనర్చి యరిగె గుటీరమున కనుగులతో.

శ్రీరాముని శూర్పణఖ మోహించుట

290. కృతపౌర్వాహ్ణికబ్రహ్మ
క్రతువ్రతుడు రాఘవుడు ధరాతనయాసం
యుతుడై రాజిలె జిత్రా
యుతుండు విధుమూర్తి బోలె నుటజం బందున్.

291. ఆ తరుణమ్మున నచ్చటి
కేతెంచెన్ దరుణి యొకతె, యిందువదను న
బ్జాతాక్షు సింహవక్షు మ
హాతేజున్ దీర్ఘభుజు నవాంబుదగాత్రున్.

292. కుసుమశరాసనసుందర
లసద్రుచిరరూపు రాజలక్షణసముపే
తు సురేంద్రసన్నిభు ననం
తసత్త్వు ద్విరదగమను బ్రియదర్శను రామున్.

293. కని మదనార్దితయై యి
ట్లనె న య్యంగన వికటనయన భైరవని
స్వన దుష్టానన దుర్వ
ర్తన యప్రియదర్శన దశరథరామునకున్.

294. తాపసవేషములన్ శర
చాపంబులు దాల్చి యిట్లు చానయు దోడై
యీ పుణ్యజనావాసం
బే పని కొఱ కేగుదెంచి రీరలు సెపుడీ.

295. అనినన్ దమవృత్తాంతము
వినిపించి రఘువరు డనియె విశదమ్ముగ గా
మిని! నీ యట్టి మనోజ్ఞాం
గన దానవి గాగ నాకు గన్పడ కుండున్.

296. ఎవతెవు? నీ వెవ్వరిదా
నవు వచియింపుము నిజం బనగ నిట్లనె న
వ్వనిత వినుము సెప్పెద శూ
ర్పణఖ యటంద్రు నను దానవాంగన నగుదున్.

297. త్రైలోక్యవీరు రావణు
నాలించియె యుందు వాత డగ్రజు డగు నా
కా లేఖరర్షభరిపుజన
పాలకు డా వైశ్రవసుడు పరమోగ్రుడు సూ.

298. సతతప్రవృద్ధనిద్రా
రతుడు ఘటశ్రవుడు నాశరాన్వయకర్మ
వ్యతిరేకి విభీషణుడున్
నుతవిక్రములు ఖరదూషణులు మద్భ్రాతల్.

299. త దతిక్రాంతమతి సుఖిం
పుదు నిచ్ఛావనవిహారభోగాసక్తా
త్మ, దశరథాత్మజ! కామా
గ్నిదహ్యమానాంగి నైతి నిను గని నంతన్.

300. బలసంపన్నను హేలా
విలాసబంధురగతుల నభీష్టాకృతులన్
వెలసి సతము దేలింతున్
విలసత్ప్రణయసుఖవార్ధివీచీతతులన్.

301. సుకుమార! మారసుందర!
వికృతాకృతి సీత పొందు విడివడ కున్నన్
సుక మేమి? వీడు మా యమ
నిక శాశ్వతముగ బరిగ్రహింపుము నన్నున్.

302. నీ కేన తగుదు నట్టులె
నాకు దగుదు వీవ రమ్ము నానారమ్యా
జ్ఞాకర గిరి సాను ఝరీ
సైకత వనభూ విహార సౌఖ్యంబునకున్.

303. కుసుమశరపాశబద్ధ త
దసుర స్త్రీ భాషణంబు లాలించుచు గన్
గొని తెరు పెక్కియు మృదువా
క్యసరణి ని ట్లనియె రాము డయ్యాశరికిన్.

304. భవతి! వివాహోత్సవల
బ్ధవధూయుక్తుండ నేకపత్నీవ్రతధ
ర్మవశుండ నిట్టి నన్గో
రి వచ్చి తేమి సుఖము వివరింపుము నీకున్.

305. అడుగో! కనబడు నా త
మ్ముడు సౌమిత్రి యెలప్రాయపున్ సుందరరూ
పుడు కాంతాసుఖహీనుడు
గడు గోరందగిన వలపుకా డగు నీకున్.

306. వానిం జేపట్టంగల
వేని న్నిరతంబు సౌఖ్య హేలా డోలా
నూన వినోద స్ఫుట భా
వానంద మెసంగు నిస్సపత్నము గాగన్.

307. అనినన్ ముసిముసి నగవుల
జని శూర్పణఖ నిజవాంఛ సౌమిత్రి కెఱుం
గ నుడువ హసించుచు నతం
డనె నెంతటి వెఱ్ఱిదాన వైతా! తలపవే.

308. వరవర్ణిని! దాసుడ నే
నరయగ సోదరుడు రాఘవావనిపతికిన్
బరమ రమణీయమూర్తి వా
నరింప వలె దాస్య మీవు న న్గూడునెడన్.

309. నీ యట్టి యమానుషకాం
తా యౌవన రూప దేహ తారుణ్యములున్
సోయగముల్ వీక్షించిన
నే యట్టిడు నే న్గరంగ కెట్లుండు మదిన్.

310. రాముండె స్వీకరించెడు
నా మానవకాంత వీడి యరుగుము నాపై
వ్యామోహము వీడి యనిన
రాముని కడకేగి యాశరవనిత పలికెన్.

311. ఈ నిర్ణతోదరి యసతి
యీ నీరసగాత్రి వృద్ధ హృదయము నందున్
దానక మై యుండుట స
న్మానింపవు నన్ను చూడుమా! రామ ! యిదే.

312. మనకున్ సుఖావరోధం
బొనగూడక యుండు నట్టు లుద్యద్వృత్తిం
గొని మ్రింగివైతు నిప్డీ
వనిత న్నీ యెదుట నిక సవతిపోరుడుగున్.

313. అనుచు మహోద్ధురగతి శూ
ర్పణఖ దురుద్యమమునన్ గురంగాక్షి ధరా
తనయామణిన్ గవిసె రో
హిణి న్గవియు నుల్క వోలె నృపు కట్టెదుటన్.

314. కుపితుండై రాముడు చా
పపుగొన దానవి నదల్చి పాఱనడిచి పా
దపమూలసంస్థితున్ జూ
చివల్కె దమ్ముడ! విరూప జేయుము దీనిన్.

315. పరిహాసము లాడుట ము
ష్కరుల యెడన్ గడు ననర్థకంబగు జుమ్మీ
ధరణిజ యపాయమ్మున్
బొరయక యుండు గతి జూడుము నిశాచరిచే.

316. అనినన్ దీక్ష్ణతరాసిం
గొని యాసురి ముక్కుజెవులు గోసెన్ సౌమి
త్రి, నృశంసియు దారుణబా
ధ నెత్తురోడుచు బఱచె ద్రుతగతి వనమునన్.

శ్రీరాముడు ఖరదూషణాదుల వధించుట

317. జలధరఘోషార్భటులన్
బలు బొబ్బ లిడుచు ఖరసురవైరిపదాగ్రం
బుల బడె నభశ్చ్యుతంబై
యిల గూలు నశని యనగ నసృగ్ధారలతోన్.

318. భగినీదుస్థితికి మనం
బగల ఖరుం డడిగె నిట్లు లక్కా! నీకున్
వగ గూర్చిన వాడెవ్వం
డగు దెల్పుము కూల్తు వాని నరనిముసమునన్.

319. సురదుర్జయుండగు ఖరున
కరయగ సోదరివి నీకు వ్యథ గూర్చిన ము
ష్కరు డెవ్వ డేని మనునె? వి
వరింపు మూరక వగచిన ఫలమే మొదవున్.

320. అనినన్ శూర్పణఖ వచిం
చె నిట్టు లేడ్పుడిగి నారచీరలు దేహం
బున జడలు శిరంబున మూ
పున విలునమ్ములు ధరించి పురుషు లిరువురున్.

321. దండక వసించి యుందురు
దండం గల దొక్క కమలదళనేత్రయు ను
ద్దండపరాక్రములున్ వే
దండగమనవైభవాన్విత దృఢోరస్కుల్.

322. తరుణుల్ వీరులు రతిరా
జరూపసంపన్నులు జలజవిశాలాక్షుల్
వరసుకుమారులు దాంతులు
పురుషవరుల్ ధీరులు ఫలమూలాశనులున్.

323. సుచరితులు రాజలక్షణ
రుచిరాంగులు, తాపసులు నరులా సురలా యనన్
విచికిత్సాహేత్వాస్పద
శుచిప్రభావు లతిలోకశూరులు భ్రాతల్.

324. వారు దశరథతనయు లట
ఆరయ శ్రీరామలక్ష్మణాహ్వయులట న
న్వారక పరాభవించిరి
వారు ప్రతీకారము సలుపంగ దివురుమా.

325. అనినన్ ఖరుండు క్రోధో
గ్రనయనుడై పదియు నల్వు రసురాగ్రణులన్
బనిచె నరుల గూలిచి రం
డనుచున్ శూర్పణఖతోడ నవమతి వాయన్.

326. ఘనవాతప్రేరితమౌ
ఘనవ్రజంబట్లసురనికాయము చని రా
ముని కాంచి నిల్చె దావద
హనమున్ గాంచిన మదద్విపావళి వోలెన్.

327. అరుదెంచు దైత్య సైన్యని
కరమున్ గాంచి ధరణిజకు గాపుండగ సో
దరు నిల్పి రాము డుటజాం
తరంబు వెల్వడి వచించె దానవతతికిన్.

328. జనకుని యాజ్ఞం దీర్పగ
వని కరుదెంచి మునివృత్తి బచరించుచు జీ
వన మొనరించు మమున్ మీ
రనయము వేధింతు రేటి కన్యాయముగన్.

329. జీవించు నిచ్ఛ యుండిన
చో వచ్చిన చోటి కేగి సుఖియింపుడు లే
దా వీరులవో లెన్ సమ
రావని బడు డస్మదుజ్జ్వలాశుగనిహతిన్.

330. అనుచున్ హేమోద్భాసిత
ధనువున్ సజ్యంబు సేసి దాశరథియు ని
ల్చిన, గ్రోధపరీతాత్ములు
దనుజు లనిరి కరగతాయుధావళి మెఱయన్.

331. నరుడవు నీ వల్పబలుడ
వరయగ ద్రిభువనవిజేత యగు మాదు ఖరా
సురనాథ క్రోధాగ్నిన్
దరికొల్పితి దారుణమరణంబ ఫలంబౌ.

332. ఒక్కండ వీవు మేమో
పెక్కుర ముగ్రరణతత్త్వవేత్తలము నినున్
గ్రక్కున గూల్తుము మది పెం
పెక్కన్ శూర్పణఖ భవదసృక్పానరతిన్.

333. అనుచున్ వా రొక్కుమ్మడి
సునిశిత శూలములు విసరుచున్ భో యను చా
ర్చిన రాఘవు డవ్వాని బ
దునాలుగు శరంబు లేసి ద్రుంచియు నవలన్.

334\. ధనువాకర్ణాంతము గా
నొనర్చి హేమప్రభాసితోద్యన్నిశితా
స్త్రనికాయము బఱగించెన్
దనుజోరఃస్థలవిపాటనపటుత్వమునన్.

335\. దనుజోరఃస్థలపాటన
మొనర్చి శ్రీరామసాయకౌఘము రక్తా
రుణకాంతుల నశని సమ
స్వనంబున బడె దనుకుడ్యజాలముల మహిన్.

336\. ఖరదైత్యభటులు రాఘవ
శరనిహతిన్ ద్రెళ్ళిరి ధర, శాద్వలకమనీ
యరమాస్పదంబు తద్ధా
త్రి రక్తపు మడుంగు లయ్యె దృగ్విప్రియమై.

337\. ఖరసోదరి యదరిపడి బె
దరి మానసము చెదరి వితథదృగావళులన్
బఱపి నిలిచి కొండొకవడి
కెఱిగి యరచుచున్ బరువిడె నిరవు దరియగన్.

338\. గిరిగహ్వరాంబరంబుల్
మొఱయగ రోదించుచు భువి బొరలాడెడి సో
దరి గని ఖరుండు విస్మయ
పరుడై యనియె మఱి యేమి వచ్చె న్నీకున్.

339\. ని న్నవమతి బా జ్ఞేసిన
య న్నీచాత్ముల బొరిగొన నంపితి గద మ
త్సన్నిభవిక్రమధుర్యుల
ద న్నిధనోత్సవము గాక దై న్యం బేలా.

340\. అన దమ్మున కిట్లనె శూ
ర్పణఖ వినుము సోదర! నరబాలిశు లుద్య
ద్ఘనబాహువిక్రము లసమ
రణకోవిదు లరిభయంకర ధనుశ్శరులున్.

341\. కనుదెఱచి చూచు మాత్రం
బున నీ వనుపు నసురభటపుంగవు లయొ! యే
మని చెప్పుదు రామశరా
సనోద్గతశరాగ్ని బడిరి శలభంబు లటుల్.

342\. అది యేమి ధనుశ్చలనమొ
పదునాలుగు శూలములు ప్రభగ్నము లయ్యెన్
అదియేమి లక్ష్యశుద్ధియొ
పదునల్వురు వడి రొక బలుపగు నేటునకున్.

343\. ఆ రాముండు జనస్థా
నారణ్యసకలసురద్విడన్వయమునకున్
దీరని కంటక మయ్యెన్
ధీరవిచార! తొలగింప దివురుము దానిన్.

344 నిక్కముగ నీవు సన్నుతి
కెక్కిన వీరుండ వేని యెదిరించి వెసన్
జక్కడపు మరిన్ గాదేన్
జక్కగ వని వీడి పొమ్మెచటి కేని వడిన్.

345. అలతుల బోవం డాతం
డలఘుడు దీర్ఘహవప్రయత్నమె సేయన్
వలె నిశ్చయింపు జీవం
బులు నిల్పగ రణమొ పాఱిపోవుటొ! యనుజా.

346. ఇరుమానిసు లొనరించిన
పరాభవంబు మది నేర్చ ప్రాణోత్సర్గం
బ రుచించు నాకు కాకా
చరణీయము కలదె భీరుజనసోదరికిన్.

347. అనుచు న్వికటమ్ముగ ద
మ్మని దిట్టుచు వితత ముదరమున్ గరయుగ్మం
బున మోదుకొనుచు గడు రో
దన మొనరింపగ ఖరుండు దా నిట్లనియెన్.

348. లయకాలమహోవారిధి
యొ యనగ, మన్మానసమున నుద్ధృత మగుచు
న్నయది క్రుధావేశము త్వ
ద్భయావహపరాభవజనితం బగ్గలమై.

349. నీ కపకృతి యొనరించిన
యా కుటిలాత్ముడు తెగుట యథార్థము సుమ్మీ
శోకింప బోకు క్రోలెద
వా కూళ కవోష్ణరుధిర మాకంఠముగన్.

350. నరమాత్రుడల్పుడు సహో
దరయుక్తంబుగ మడియు నతం డీక్షణ మే
నరిగెద గణింపకుము త
త్పరాక్రమం బనుచు సైన్యపతి కిట్లనియెన్.

351. రథమున్ బూన్పుము సర్వా
యుధసన్నద్ధమ్ము గాగ నుగ్రాహవక
ర్మధురీణవారణాశ్విక
రథికభటశ్రేణుల న్బరపు మఖిలంబున్.

352. ఖరు డి ట్లనగన్ సిద్ధమొ
నరించె దూషణు డరదము నానావిధతో
మర ముద్గ రాసి పరిఘా
పరశ్వథ శరాస నాది బహ్వాయుధమున్.

353. లోకోపద్రవకరకా
ర్యైకరతము క్రూరమున్ మహాతేజంబున్
భీకరము నీలజీమూ
తాకారము వ్యాఘ్రదర్ప మాసురచమువున్.

354. సమదేభేంద్రంబు హరీం
ద్రము న్గవియ నేగు నవ్విధంబున జనియెన్
సముదగ్రంబుగ ఖరసై
న్యము ఖరరాక్షసమనోరథానుగమనమై.

355. విమల మణికూబరంబును
సుమ తరు శైల ద్విజార్క సోమోడు ఝష
ప్రముఖ హిరణ్య ప్రతిమా
సముపేతము హేమచక్రసంపన్నంబున్.

356. మేరుశిఖరోపమంబును
హైరణ్యాభరణభూషితాతిప్రభమున్
హారి హరిద్రాసిత పీ
తారుణ ధవళ తురగ ధ్వజాన్వితంబున్.

357. ఖరు డారోహించి చనె ది
నరాజసన్నిభము స్యందనంబు సమధికో
ద్ధురవేగంబున రిపుని
ర్ధారణార్థం బంతక భ్రమాస్పదవృత్తిన్.

358. ఖరదైత్యసైన్యనివహం
బరిగె నిలాతల మ్రదువ హయఖురోద్ధిత భూ
రి రజచ్ఛన్నాశాగ
హ్వరముగ ధావన్మృగవిహగారావముగన్.

359. ఎదురయ్యె దుశ్శకునముల్
పదింబది శివారుతుల్ సెలగె గృధ్రము వ్రా
లె దితిజ రథధ్వజంబునఁ
గదముల్ గుమికూడెను దివి ఖరవర్ణములన్.

360. దిననాథప్రభ మాసెన్
వనస్పతికుసుమఫలము లవని డుల్లిపడెన్
మొనసి నభము నెత్రు గురిసె
ననూహ్యముగ మొగ్గ బడె రథాశ్వము లవనిన్.

361. గమననిరోధకముగ వీ
చె మహామారుతము లలమె జీకటు లత్యు
గ్రము లశను ల్వడియె నసాం
ధ్యమయ్యు బశ్చిమము దోచె నసృగరుణంబై.

362. అవి యేమియు లెక్కగొనక
దివిజరిపుం డరిగె ఖరుడు ధీరుడయి చమూ
నివహోత్సాహజనకవా
క్ప్రవృత్తి దనరారి రాఘవాశ్రమవనికిన్.

363. శ్రీరాము డాశ్రమంబున
దారసహోదరుల గూడి ధార్మిక మధురో
దార కథాలాప సుధా
ధారల జొక్కుచు బ్రశాంతి దనరారు నెడన్.

364. వివిధోత్పాతంబుల గని
యవరజు సౌమిత్రి జూచియనె బ్రకృతివిరు
ద్ధవిషయముల్ గానంబడు
నవె చూడు మరిష్టసూచకార్థము లగుచున్.

365. ఖరవర్ణాభ్రచయము లం
బరంబున న్మారుతహతి బర్వెత్తుచు నె
త్తురు లుమియున్ దారుణసం
గరం బగున్ జనవినాశకారక మనుజా.

366. అవిగో వినబడు చున్నవి
శ్రవణపరుష సైన్య సంచలన సంభూతా
రవములు శంఖధ్వానము
లవిరతగజఘీంకృతులు హయవ్రజహేషల్.

367. ఖరసోదరి శూర్పణఖా
సురవనితాప్రేరితం బసురసైన్యంబే
యరుదెంచెడినో తమ్ముడ !
దుర మగు బహురాక్షసతతితో ని య్యెడలన్.

368. పూదీవియలున్ దరుశా
ఖాదులు దట్టముగ గ్రమ్మ యాలోకనదు
స్సాధముగిరికందర మం
దీ దేవిం గావ నేగు మీవు వడివడిన్

369. ఏ నొక్కండన దునుమం
గా నెంచెద నీ సురారిగణమున్ సౌమి
త్రీ! నీ వరుగు మని ధను
స్తూణీర కవచ సముద్యుతుం డయ్యె వెసన్.

370. అంతకున కంతకుడ నై
యింతు న్నరు లెంత నఅనిమిషమాత్రమునన్
బంతున్ గృతాంతు చెంతకు
సుంతయు వంత బడ కీరు సూడుం డనుచున్.

371. పోడిమి ప్రగల్భవచనము
లాడి ఖరుడు ప్రోత్సహింప నసుర బలంబుల్
వాడిమగంటిమితో నే
ట్లాడగ నురికురికి వచ్చె నాశ్రమవనికిన్.

372. ఖరుడున్ సైన్యము తలకడ
చి రాఘవున కెదురుగ నిలిచి నిరంతముగా
గురిపించె బాణవర్షమ
మరర్షితతులు దివి సంభ్రమమ్మున జూడన్.

373. ఖరుడపు డెన్ని శరము లే
సె, రాము డన్నియును ద్రుంచె శితశరపంక్తిన్
బరగించి నడుమనె, రయమ
దరగ భటుల్ మూగి రంతటన్ రాము దెసన్.

374. వలయీకృతరామధను
శ్చలితాశీవిషసమోగ్రశరసంహతులన్
బలలాశివీరులు గతా
సులైరి గుములుగుములుగ వసుమతి న్బడుచున్.

375. ఒక బాణం బేనియు సై
నిక మస్తక హృదయ బాహు నిర్దళన మొన
ర్పక యుడుగ లే దెదిరి చా
వకే మగుడ లేదు వచ్చి ప్రతిభటు డెవడున్.

376. ఒక్కొక్కరి కొక్కొకటుగ
నుక్కుమిగిలి తోచి రాము డుగ్రాకృతులన్
జక్కడచె దానవుల దా
నొక్కడు రుధిరంపు టేరు లుర్విం బర్వన్.

377. కరికుంభంబులు డుల్లెన్
ధర నశ్వశిరంబులు దివి దాకెన్ రథకూ
బరచక్రమ్ములు నుఱు మ
య్యె రామబాణాసనోద్గతేషుక్షతులన్.

378. దూషణు డేతెంచి కడున్
రోషారుణనేత్రుడై యురుజవంబున దీ
వ్రేషుక్షతి జేసె సుర
ద్వేషిగణము లార్వ రామవిభు నెన్నుదుటన్.

379. అరెరే! ఎంతటి వాడీ
ఖరసేనాధిపు డటన్న కనలొదవ లలా
టరుధిరరాగము సితనే
త్రరుచిక్రమ మాహరింప రాఘవు డంతన్.

380. లీల ధనుర్జ్యారవము ది
శాలోలంబుగ నొనర్చి శాతశరంబుల్
గీలించి యేసె నురవడి
సాలోత్తాల రిపు తనువు సంభగ్నముగన్.

381. సారథి తలద్రుంచి తురం
గారభటి న్మాన్చి కార్ముకంబు దునియలై
పారగ జేసి సిడంబున్
ధారుణి బడనేసి చించె దనువర్మంబున్.

382. మఱియొక్క వాడి తూపున్
బరగించి శిరంబు ద్రుంచె వరదలుగా నె
త్తురు పాఱ ననుచరనిశా
చరవర్గము పాఱెను భయసంవిగ్నాత్మన్.

383. పరిఘం గొని స్థూలాక్షుడు
వరశూలముతో మహాకపాలుండు నెది
ర్చిరి భూరిపరశ్వథమున్
ధరించి తోడై 'ప్రమాథి' తార్కొనె రామున్.

384. పలలాశిసైన్యపతుల
ట్టులు ముప్వురు నేకమై కడున్ భీకరగ
ర్జలు సేయుచు నడర శిరం
బు లెగసిపడె రామబాణముక్తములు త్రుటిన్.

385. మఱి పన్నిద్దరు పఱతెం
చి రాసురచమూపతులు విశేషాయుధముల్
వరగించుచు రాముడు స
త్కరించె శితసాయకప్రతతి నవ్వారిన్.

386. పంచసహస్రాధికదళ
మంచద్దావదహన మటు లడరంగా నీ
క్షించి శరాసారమునన్
ముంచి యుడిపె రామమేఘము లయోగ్రంబై

387. కనుగ్రుడ్లు బయల్వడి చ
చ్చినవారును బాహు పాద శిరముల్ వేత్రై
తునిసిన వారును వక్షో
వినిస్సృతాస్ర మెగయంగ ప్రీలిన వారున్.

388. ఖరుడున్ ద్రిశిరుడు దక్కగ
బెరసైన్యసమూహ మెల్ల బృథివి గఱచె ది
క్కఱి యహా! ప్రచండఖగరా
డ్గరుదనిలోద్ధూత తరు నికాయము వోలెన్.

389. అరదంబు లేదు తోడె
వ్వరు లేరు శరాసమాత్రపరిమితమౌ సం
గరసాధనంబు లరయ, న
సురులన్ బదునాల్గువేల స్రుక్కించె దృఢిన్.

390. కీలాలమాంసపంకా
వాలము కదనోర్వి గాంచి పలలుడు ఖరుడు
ద్వేలక్రుధావివశుడై
తోలించెన్ దాశరథి నెదుర్కొన రథమున్.

391. త్రిశిరుం డడ్డువడి వచిం
చె ఖరుడ నమేయ సమర శిక్షా కలితో
గ్ర శరాసనుండ దలవ ద్రి
దశ సంఘ భయావహుండ ద్వత్సేవకుడన్.

392. నే నుండగ ని న్ననికిన్
బోనిత్తునె శూరమాని పురుషాధము డ
వ్వానిం దెగటార్ప సకల
దానవనాథుండ వీవ తరలగ వలెనే.

393. ఏ నేగి వధించెద నా
మానవు విజయోత్సవప్రమదమత్తుడవై
పూని నిలయముం జేరెదొ;
యేను న్వడినన్ దురమున కేగెదొ! కనుమా!

394. అనుచున్ ఖరునకు మున్నుగ
జనియెన్ త్రిశిరుండు ధనువు సారించుచు భీ
షణశంఖధ్వని సేయుచు
త్రినేత్రు పయి కేగు యామ్య దిగ్వరు బోలెన్.

395. శీర్షత్రితయవిలాసో
త్కర్షము శైలం బన జని దానవుడు మహా
మర్షంబున రాము పయిన్
వర్షించె శిలానిభశరవారంబు వెసన్.

396. దనుజప్రయుక్త నారా
చనిచయ ఘటితాంగతాపసంజనితాక్షు
ద్ర నితాంత క్రోధోత్థితు
డనఘుడు రాఘవుడు రేగి యరుణాస్యుండై.

397. ఒక వాలమ్మున రథచో
దకశిరము న్దునిమి తురగతతి నాలుగుసా
యకముల ధరిత్రి గూల్చి మ
యొక బలునారసమున సిడ ముర్వికి దాపెన్.

398. వేఱొక మార్గణమున న
వ్వీరు ధనువు దునియనేసి, విరథుం డగుచున్
ధారుణికిం డిగ్గు తఱిన్
దోరపు టురమవియ నేసి తునిమె శిరంబుల్.

399. కులిశాహతశిఖరంబై
యిల గూలు ధరాధరమన నే పుడిగి శిరం
బులు మూడున్ దెగి నేలం
గలిసె త్రిశిరుదేహ మప్డు ఘనరావమునన్.

400. త్రిశిరుం డారీతి బడగ
బిశితాశులు వాఱిరి పెనుభీతిన్ ఖరరా
ట్డిశ ద్వీపిదర్శనమున మృ
గశాబకము లట్లు రాము గాంచిన యంతన్.

401. పదునాల్గువేల రాక్షసు
లు దూషణప్రముఖవీరులున్ దెగి పడిరీ
కదనమ్మున నొక మానవు
నుదగ్రశరవృత్తి నోర్వ నోప కటంచున్.

402. భయవిహ్వలు డయ్యె రణ
క్రియాఽవశుం డయ్యె బోర గెల్పు వదయు టె
ట్లో యటన్న సందియంబు హృ
దయంబున మెదలె ఖరునకు దత్సమయమునన్.

403. నరు డల్పబలు డసంఖ్యా
కరాక్షసప్రతతి తోడ గదనం బొనరిం
చె రణపరిశ్రాంతిం బొలు
వటి యుండడె యేమి కష్టమట్టిదు గెల్వన్.

404. అని తనకుం దా ధైర్య
మ్మును జెప్పుకొనుచు నెదిర్ప బోయెన్ వేగం
బున రామచంద్రు, జంద్రు ప
యి నేగు రాహువు గతి ఖరు డేడ్తెర మెఱయన్.

405. నారాచవితతి గప్పెన్
ధారాపాతంబు గాగ దాశరథి పయిన్
ఘోరాకారుండు ఖరుడు
వారిదవృష్టి యచలంబు పైకొనిన గతిన్.

406. రాముడు తచ్ఛరవృష్టి న
భోమార్గము నంద యుడిపి భాస్వత్కిరణౌ
ఘామోఘశరోష్మమునన్
భీమంబుగ నేసె ఖరు డవిసి బెగడు వడన్.

407. మదకరి పై బరికోలల
సదృశంబుగ బఱపె రామచంద్రున్ లక్షిం
చి దితిజుడున్ దీక్ష్ణాగ్ర
ప్రదరంబు లయఃకృతంబులన్ రౌద్రముగన్.

408. ఆకాశ మనవకాశం
బై కాన్పింపదు రవిప్రభావళి యసుర
శ్రీకాకుత్స్థాన్యోన్యవ
థాకాంక్షాము క్తమార్గణాసారమునన్.

409. సరథుండై పఱతెంచు న
సురు జూచె న్రాఘవుండు క్షుద్రమృగమ్మున్
హరిపతి చూచు తెఱంగున
నురవడి మాన్చె సునిశితశరౌఘవ్యాప్తిన్.

410. ఖరు డల్గి యొక్క పదనగు
శరంబు ధృఢముష్టి దిగిచి చయ్యన నేయం
గ రఘూద్వహహస్తాంచిత
శరాసనజ్యాలత తెగె శకలంబులు గాన్.

411. దినరాజనిభస్యందన
మున బూర్వామరుడు దోచె భూరిశరాసం
బును జేతం దాల్చి జగ
ద్ధననసమయపాశహస్తు డంతకు బోలెన్.

412. మునినాథు డగస్త్యు డొసం
గిన చాపము వైష్ణవంబు గేలం గొని యా
క్షణమున రాముడు సజ్యం
బొనర్చి ఖరదైత్యు నేసె నుద్ధతి యడగన్.

413. అసురుండు బీరు వోక ర
థసమ్మున న్నిల్చి రామభద్రు బొదివె శా
తసహస్రశరావళి, భూ
తసంఘ ముద్వేగసంభృతాక్షుల జూడన్.

414. ఒండొరు విల్లులు ద్రుంచుచు
నొండొరు గాత్రక్షతంబు లొనరించుచు ను
ద్దండగతిన్ బోరిరి రా
ముండు ఖరుండున్ హరిద్విపోపమబలులై

415. రథరథ్యసారథిస్వాం
గధనుస్తతి గాచుకొనుచు ఖరుడు కడంకన్
బ్రథన మొనర్పగ దాశర
థి ధనుఃఖేలనము వోలె దీర్చె సమరమున్.

416. బలునారసమున రాముడు
బలలాశి శరాసనంబు భగ్న మొనర్పన్
బలియుండు వాడు వేఱొక
విలుగొని రాముకవచంబు భేదించె వెసన్.

417. ఖరసాయకక్షతస్రవ
దురురక్తప్లావితాంగు డుద్యత్క్రోధో
ద్ధురుడై శ్రీరాముడు ప్ర
జ్వరిల్లె ధూమరహితుండు జ్వలనుం డనగన్.

418. అరిదర్పభంజకవిశిఖ
వరంపరన్ బరపె రామభద్రుండు వడిన్
దురగములు గూలి సారథి
శిరంబు దెగివడి రథంబు శీర్ణం బయ్యెన్.

419. విలుగూడ దునిసి పడ సం
చలించి గదగొని ఖరుండు చయ్యన ధరణీ
స్థలికిన్ డిగ్గి వడిన్ బ
ర్వ్యులెత్తె దాశరథి గవియ రోషోద్భటుడై.

420. విరథుండై గదచేతన్
ధరించి యరుదెంచు దుష్టదానవు నీక్షిం
చి రఘూద్వహు డిట్లనె మృదు
పరుషోక్తుల నై జదర్పవై భవమెసగన్.

421. చతురంగసైన్యబలగ
ర్వితుండ వై సకలలోక విప్రియకర్మల్
సతమున్ బొనరింతువు దు
ర్మతి యేమిఫల మొనగూడె రాక్షస! నీకున్.

422. లోకత్రయపాలకపద
వీకలితుండయ్యును జనవితతులకున్ బా
ధాకరుడు క్రూరుడై నన్
జాకుండడు కడగి జనులె చంపుదు రతనిన్.

423. కూలుదురు పాపులున్ దు
శ్శీలురు హింసానివిష్టచిత్తులు దుష్క
ర్మాలోలు రచిరమె శిథిల
మూలంబులు భూమిజముల బోలెన్ దనుజా.

424. తాపసవరు లెందఱినో
నీ పొట్టను బెట్టుకొంటి నిర్హేతువుగా
నా పాపఫలం బందెద
వోపాపి యిపుడ విషాన్నభుక్తిం బోలెన్.

425. అనుభోక్తవ్య మవశ్యము
జనతతికిన్ దుష్టకర్మసంచితఫలమో
దనుజాధమ! ఋతుకాలం
బున భూజప్రతతికుసుమముల్ వొడము గతిన్.

426. తబిసుల రక్షింపగ ధ
ర్మబద్ధజీవనతపస్విమండలరిపుదై
త్యబలంబున్ గూల్పగ వ
చ్చి బాలిశ! విడుతునె నిన్ను జీవంబులతో.

427. మును నీ భక్షించిన స
న్ముని ప్రతతి వ్యోమయానముల దిలకింపన్
బనుపుదు నిన్నంతకు జే
ర నీక్షణమె కాచుకొమ్ము ప్రాణంబు లికన్

428. తాళఫలంబున్ బలె న
భ్రాలయవీథిన్ బరపెద నస్మన్నిశితా
స్త్రాళి భవన్మస్తకమున్
గూళ! వని నిరాసురం బగుత మునిహితమై

429. అనినన్ ఖరుం డనియె వీ
రనామధేయము వహించి ప్రాకృతరక్షో
జనమున్ గూర్చి దశరథసు
త! నిన్ను నీవె పొగడుకొన దలపడుదు విసీ.

430 అనిమొన నిల్చిన వీరుడు
రణపాండిత్యగరిమంబు ప్రకటించును గా
ని నినుం బోలెన్ బాల్పడు
నె! నిజపరాక్రమము వొగడి యేపు వహింపన్.

431. నీ యల్పత్వమె తెల్లం
బాయె ద్వదాత్మస్తుతిన్ నరార్భక! కనక
చ్ఛాయాప్రతిరూపకుశా
గ్నేయశిఖల్ శాంతి బొందవే! శీఘ్రముగన్.

432. కనుచుంటివే గదాధరు
ననున్ జ్వలద్గైరికాదినానావిధధా
తునిచయదీప్తాచలనిభు
రణసంరంభున్ మహోద్ధురావష్టంభున్.

433. భువనత్రయలయకారి దు
రవలోకమహోగ్రపాశహస్తుండు కృతాం
తు విధంబున నిను బోకా
ర్చి వారితర్పణము లిత్తు మృతవీరులకున్.

434. అనుచు విజృంభించి క్రుధో
గ్రనేత్రు డై కేల ద్రిప్పి రామునిపై వై
చె నుదగ్రగదాయుధమున్
దనుజుడు దీప్తాశనిగమనపటుత్వమునన్.

435. ఖరబాహుముక్తమై యం
బరమార్గమునన్ ప్రభగ్నబహుతరుగుల్మో
త్కర మగుచున్ బఱతెంచగ
శరభిన్నము సేసె రామచంద్రుడు దానిన్.

436. గద వితథం బై పోవ ఖ
రదానవుడు త త్తరమున రాము మొగంబున్
బెదరుగనుల జూచుచు జే
ష్ట దక్కి నిలుచుండ రామచంద్రుం డనియెన్

437. ఏమాయె రాక్షసాధమ!
నీ మహనీయాయుధంబు! నిశ్చేష్టుడవై
తే మొదలు దెలియ కాడితి
వా మెయి బీరము లెవియొ దురభిమానమునన్.

438. చము వంతరించినది భ
గ్న మైనది రథంబు చేతి నగ బోలిన చా
పము విధ్వస్తం బై నది
కుమతీ! వంచించి గదయు గూలినది తుదిన్.

439. నను మృత్యువు పా లొనరిం
చి నిహతసైన్యప్రతతికి జేయుదు జలత
ర్పణ మంచున్ బలువతనం
బున నీ వాడినది రిత్త వోవుం దులువా!

440. ఇకధాత్రి మన్నిశితసా
యకౌఘ విచ్ఛిన్న తావకాహీన గళా
త్త కవోష్ణ ఫేన బుద్బుద
నికరాంచిత రక్తపాన నిరతి బరగెడిన్.

441. పరభామినీభయంకర
చరితంబున బరగు నీదు సతులింకన్ ద్వ
న్మరణభయవ్యధితాత్మన్
బరిభ్రమింతురు సుఖాపవర్జితతనులై.

442. పిశితాశన! నయవర్జిత
విశృంఖలోద్యత్ప్రవృత్తి విహరించిన నీ
వు శమను జేరగ విఘ్న
ప్రశమనమున దావసాధ్వరంబులు వెలయున్.

443. అనినన్ ఖరాసురుండు మ
రణోన్ముఖుండై వివేకరాహిత్యం బం
దిన వాని గతిం బల్కుదు
కను మిదె చచ్చితి వటంచు గన లెసగంగన్.

444. నికటస్థితభూరుహముం
బెకల్చి పడవైచె నశని నిర్ఘోష మొన
ర్చి, కలుకుటమ్ముల దానిన్
శకలమ్ము లొనర్చె రామచంద్రుండు వెసన్.

445. అంతట వీడక కుపిత
స్వాంతుండై రాఘవుండు వర్షించె సము
ద్దాంతసహస్రాధికశర
సంతతి గిరిసదృశరాక్షసశరీరమునన్.

446. తనువెల్ల దూట్లువడి యె
ఱ్ఱని నెత్తురు గారుచుండ స్రవదవనిధరం
బనగ బరువెత్తి శ్రీరా
మునిపై బడవచ్చె వేగముగ ఖరు డంతన్.

447. నూలుకొని వెన్క కొదిగి ని
రాలస్యంబుగ గులిశసమాభీలముగన్
గీలించి రాము డసురవి
శాలోరము గాడ నేసె శాతశరంబున్.

448. వలలాశి కూలె ధరణిన్
గులిశాహతి నద్రివోలె, గురియించిరి ది
వ్యులు రామచంద్రుపై నవి
రళమ్ముగా విరులవాన ప్రస్తుతు లెసగన్.

449\. శ్రీరామ! ఖరాసురసం
హారార్థమె నిన్ను మునిచయంబు లిచటికిన్
నేరుపు మై రప్పించిరి
వారలకున్ గోర్కె తీరె ద్వన్ద్వమ్ములమునన్.

450\. ఒక లోకాద్భుతకర్మము
ప్రకటంబుగ సల్పి తీవు రాఘవ! యర్ధా
ధికమగు ముహూర్త మందున్
వికటాసురవితతి గూల్చు విష్ణువ యనగన్.

451\. అనుచున్ సుర లరిగిరి ల
క్ష్మణుండు సీతయు గుహాముఖము వెల్వడి రా
ము నెదుటకున్ వచ్చిరి మో
దనిర్భర స్వాంతులగుచు దత్సమయమునన్.

452\. పదునాల్గువేల రాక్షస
విదళన మొనరించి కూడ వెతజెందక హా
యి దలిర్చు విభున్ మఱిమఱి
ముదితాత్మం గౌగిలించె భూమీసుతయున్.

అకంపనుడు ఖరదూషణ వధమును రావణునకెఱిగించుట

453\. ఖరదూషణనిధనంబున్
ద్వర నేగి యకంపనుండు దశకంఠునకున్
మొఱవెట్టె రామలక్ష్మణ
పరాక్రమవిశిష్టగుణవిభవసంపదతోన్.

454. రాము డజేయుండు ప్రభూ!
సౌమిత్రి యొకండు భూరిసంగ్రామకళో
ద్దాముండు మహాబాహువు
సామజగమనుండు రామచంద్రుం డరయన్.

455. వా రిర్వు రన్నదమ్ములు
శూరులు పంక్తిరథరాజసుతు లవ్వారిన్
వారిజభవేంద్రరుద్రుల్
పోరాడి జయించు టరిది పూరుషసింహుల్.

456. అరదంబు లేదు తోడె
వ్వరు లేరు ధనుశ్శరములె భద్రాయుధముల్
దురమున గూల్చెన్ రాముడొ
కరుండ పదునాల్గువేల ఖరసైన్యంబున్.

457. ఎదిరిన వా డెవ్వడు మఱి
బ్రదికి మగుడ లేదు రాఘవధనుర్ముక్త
ప్రదర మొకండున్ రిత్త జ
నదు లక్ష్యవిభేదనం బొనర్పక య ప్రభూ.

458. అనినన్ రావణు డిట్లని
యె న న్నెదుర గల్గు వార లెవ్వరు? కోపం
బున విక్రమించి దాసుల
బొనర్పనె పురందరప్రముఖదేవతలన్.

459. నా కహిత మ్మొనరింపగ
నా కనుఁబ్రామి ఖరదూషణాసురచమువున్
బోకార్చిన దుర్మతు లవి
వేకులు జీవింప గలరెః పృథివిన్ సుఖులై.

460. ఈ క్షణ మేగి వధింతున్
రాక్షసవంశాపచారరతులన్ మద్రూ
క్షాక్షయశరజాలక్షతి
నాత్మఁద్రాత్ములు సురలు భయాక్రాంతులుగాన్.

461. అనిన నకంపను డిట్లనె
దనుజేశ్వర! విన్నవింతు దద్రాముడు పూ
నిన దగు జగత్రయవినా
శన పునరుజ్జీవన విలసనము లొనర్పన్.

462. ఎదిరిన వారల కెల్లర
కెదుటన్ దా నగుచు దోచి యే పడగించెన్
బదునాల్గువేల నూహిం
ప దరమె తద్రాఘవప్రభావంబు ప్రభూః

463. తారాసందోహంబున్
ధారుణి డుల్లిపడ నేయ, దర్పమున మహా
వారిధి విజృంభణంబు ని
వారింపగ రాము డోపు బాణచయమునన్.

474. సకలసురారిజగచ్ఛ్రం
గకల్పుడవు నిన్ను గూల్పగా బన్నె నెవం
డౌ కపట మియ్యది హితరూ
పకాహితుడు వాడు నిక్కువం బరయంగన్.

475. విమలాభిజాత్య మను శుం
డమున్ మహాబాహుయుగము నా దంతములు
గ్రగమగు ప్రతాప మనుమదజ
లము కల్మి మదకరి పోలె రాము డెసంగున్.

476. రామమృగేంద్రముతో సం
గ్రామంబు జయావహంబు గా దిపుడు మహా
భీమబడబానలజ్వా
లాముఖము న్దరియ నేల? లంకాధీశా!

477. హాయిగ బురికిం జని స్వా
బ్జాయతనేత్రాభిరామవనితాజనసా
ఖ్యాయత్తచిత్తుడ వగుము
హేయపరస్త్రీనిరోధ మేల! దశాస్యా!

478. ఆగ్రహము వల్వదు ప్రభు! అ
నుగ్రహముం జూపు మనుచు నుడువ దశాస్యం
డుగ్రత ద్యజియించి హిత
ప్రగ్రహమున మఱలె నిజపురాభిముఖుండై

శూర్పణఖ రావణునితో సీతను గొనుమనుట

479. ఖరదూషణుల్ నిహతులై
ధరిత్రి కొదిగిన తదుపరి త్రాతల గోల్పో
యి రయమ్మున బాఱె లంకా
పురికిన్ శూర్పణఖ ఘోరు ఘోరు మటంచున్.

480. కొలువుండె బుష్పకవిమా
నలసద్ధేమాసనంబున సచివతతితో
విలసత్కాంచనవేది
జ్వలితాగ్నిశిఖాప్రభావిభాసితు డగుచున్.

481. శిరమున వెలుంగు లడరున్
దరుణార్కద్యుతివిభాసితకిరీటము ర
త్నరుచిరకాంతులతోడన్
విరాజిలు గరికరదీర్ఘవింశద్భుజముల్.

482. సురదానవసంగ్రామాం
తరచక్రకులిశముఖాయుధక్షతతనుడున్
సురకరివిషాణకషణ
స్ఫురితోద్యత్కిణమహోరుభుజవక్షుండున్.

483. అతడు పులస్త్యాన్వయు డూ
ర్జితతేజుడు నిర్జరారి జితశత్రుడు భూ
రితపఃప్రీతాబ్జభవుడు
తతసమరప్రతిభటీకృతాబ్జోదరుడున్.

484. గిరిశిఖరాకారుడు స
ర్వరాజలక్షణుడు సాగరక్షోభంబున్
ఖరకరశీతాంశూదయ
నిరోధమున్ జేయ నోపు నిజభుజశక్తిన్.

485. దివిజుల స్రుక్కించి కుబే
రవిమానముదెచ్చి చైత్రరథనందనపు
ష్పవనవినాశ మొనర్చి య
హివిభున్ వాసుకి జయించి యే పడగించెన్.

486. పరదారాభిరతుండై
మరులు గొని బలాత్కరించె మానవతులనెం
దఱినో తక్షక సతి నప
హరించి కైకొనియె దా మహౌద్ధత్యమునన్.

487. వైకుంఠు కథల్ చెవి సోఁక
నీక కడు న్మత్సరమున నిష్ఠల్ మాన్చున్
నాకప్రియయాగరతుల
బోకార్చు నడంచు జపతపోధర్మములన్.

488. జలరుహసముద్భవునకున్
దలలు పదియు గోసి వెట్టి నైవేద్యముగా
బలలాశనయక్షోరగ
నిలింపనికరాద్యవధ్యునిగ గొనె వరమున్.

489. బృందారకాంబుజముఖీ
సందోహము నూడిగంబు సల్పం గొనె ద
న్మందిరమున మధుపాత్రీ
బృందవ్యజనాతపత్రధృతి సేవనలన్.

490. ఆ రావణునకు వికృతా
కారస్వశ్రవణనాసికల్ జూపుచు ఘో
రారవమున నిట్లనె వా
క్పారుష్యము ప్రస్ఫుటంబు గా నాశరియున్.

491. కామోపభోగమత్తుడ
వై మాన్యవిషయపరాఙ్ముఖాత్మన్ దశకం
ఠా! మే నెఱుంగ కుంటివి
నీ ముంగిటి ఘోరమున్ గణింపవు కుమతీ!

492. నరపతి గ్రామ్యవిషయసుఖ
పరతంత్రుడు లుబ్ధుడైన వానిన్ ద్యజియిం
తురు విముఖస్వాంతమునన్
బరేతభూమ్యగ్నిబోలె బ్రజలు దశాస్యా.

493. వనితాసుఖలోలుడు ద
ర్శనదుర్లభు డగుచు, జారచక్షువు గా న
ట్టి నృపున్ దొలగి చనుదురు ప్ర
జ నదీపంకము గనిన గజంబులు వోలెన్.

494. సురగంధర్వాదులతో
విరోధమున్ బెట్టుకొంటివి విమూఢుడ! వే
గరయ వికె ట్లొనరింతువు
పరిపాలనమున్ శిశుస్వభావ! ధరిత్రిన్.

495. దూరగతార్థజ్ఞానము
చారముఖంబున గనుట విశాంపతివిహితా
చారంబు చారచక్షువు
లైరి నృపతు లక్కతన జయాస్పదచరితుల్.

496. ఖరదూషణాద్యసురవధ
మెఱుంగ వీ వరయఁ జారహీనత దా నొ
క్కరుడ సమయించె సీతా
వరుడు చతుర్దశసహస్రపలలాశితతిన్.

497. అభయం బొసంగె నారా
మభద్రుడు సకలమునీంద్రమండలికి బలా
శిభయ ముడిగించి కావగ
బ్రభుడ వవిదితుండ వి వ్వివద్దశ జపలా!

498. సమయోచితకార్యజ్ఞా
నము లేక బ్రమత్తుడు వ్యసన పరుండై లో
భము క్రౌర్యము పైకొను భూ
రమణునకున్ దోడు రారు ప్రజ లాపదలన్.

499. దీనుం డగు మఱియు దృణస
మానుం డగు క్ష్మాపతిత్వమహిమచ్యుతుడా
నేని నరుడు శుష్కతృణం
బైనను మేలగు బదచ్యుతాధిపు కంటెన్.

500. నీ కా గతి కానున్నది
కాకీ విషయోపభోగకలుషాత్ముడవై
లోకము కాలంబున్ గన
రా కుండుదె బుద్ధిహీన! రావణ! యనినన్.

501. ధనబలమదమత్తుడు రా
వణుండు శూర్పణఖ యట్లు వచియించిన దె
ల్లను నాలకించి చింతిం
చె నాత్మదోషంబు లెల్ల జిరముగ మదిలో.

502. తుది దశకంఠుం డిట్లని
యె దలోదరి! రాము డెవ్వ డెచ్చటి వాడే
ల దనుజుల తోడి పగ బూ
నె! దండకావనము జొచ్చు టేమి కతముగన్.

503. ఏపాటి వీరు డతడే
రూపము వాడాయుధంబులున్ బలసంప
త్ప్రాపకవిభవోన్నతులే
యే వగిదివా, సెప్పు మనగ నింతి వచించెన్.

504. దశరథ సుతుండు రాముడు
విశాలదీప్తాంబకుండు విపులాంసుడు పు
ష్పశరోపమసుందరనీ
లశరీరుం డజినవల్కలజటాధరుడున్.

505. జనకుని యాజ్ఞావశమున
వని కేతెంచె నట రామభద్రుడు సతితో
ననుజన్మునితో మునివృ
త్తి నెఱపుచు విహితసమయవిధిం దీర్చి చనన్.

506. సురపతిధనుస్సముజ్జ్వల
శరాసనమున విషసర్పసన్నిభశరముల్
వరగించె రాము డొక్కడు
దురమున నే పడగిరి ఖరదూషణు లెల్లన్.

507. శరసంధాన సమున్నత
శరాసనాకర్షణ శరసంపాతము లే
తెఱగున నయ్యెనో దృగ్గో
చరంబు కా దసురచయము సమయుటె కంటిన్.

508. ఏమని చెప్పుదు రాఘవ
భూమీశ్వరబాణపాతమున బడి రసురుల్
భూమీస్థలి శక్రకృతో
ద్దామశిలావర్షనిహతధాన్యంబు లటుల్.

509. వనితాహననము దోషం
బను శంక విడిచె నను విదితాత్ముడు వీరుం
డనఘుడు రాముడు దానన్
జనుదెంచితి బ్రతికి యెట్లొ శరవేగమునన్.

510. ఆ రామునకుం దమ్ముడు
వీరుడు లక్ష్మణు డనంగ వేయివిధములం
దారాముం బోలిన సుగు
ణారాముడు దుర్జయుడు మహాతేజుండున్.

511. నిరతక్రోధుడు రిపుభీ
కరుండు దక్షిణభుజంబు గా రామునకున్
బరగుచు రక్తియు భక్తియు
వరల బహిఃప్రాణమొ యన వర్తించు సదా.

512. ఆ రామునకుం బత్ని మ
నోరమరూపాభిరామ నుతగుణభరితో
దారచరిత భర్తృప్రియ
ధారుణిసుత సీత పద్మదళలోచనయున్.

513. ఆ నారి పూర్ణచంద్రని
భాననయు సుమధ్య సమవిభక్తాంగియు సు
శ్రోణియు బల్లవపాణియు
బీనస్తని దీర్ఘ నీలవేణీభరయున్.

514. వనదేవత భాతి రమా
వనితామణి చెల్వ్వాన గడు భాసించుచు నా
జనకజ వసించు నుటజ
మ్మున, భర్తృప్రియహితరతబుద్ధిన్ సతమున్.

515. ఆ రామ భార్యయై ప్రియ
మార నెవని గౌగిలించు నాతండ త్రిలో
కారాధ్యపదప్రాప్తుం
డై రాజిల్లున్ బురందరాధికసుఖియై.

516. నరసురపన్నగ కిన్నర
తరుణులు విద్యాధరవరతరుణుల లో న
త్తరుణికి నెనయగు తరుణిం
బరికింప జగత్త్రియంబున న్మ్మ న్నెచటన్.

517. ఆ యనవద్యాంగికి నీ
వే యోగ్యుం డగు బతి వసురేశ్వర! తగు నీ
కాయమయు న ట్లగుట నీ
కాయమ గూర్పంగ నర్హ యత్నము సేయన్.

518. చనితిన్ వడి రామాశ్రమ
వనికిన్ రాక్షసవిరోధభావను లయ్యి
ర్వ్వరు న న్నుల్లస మాడిరి
పరిహాసము సేసి రకట! త్వత్రాభవమున్.

519. రాము వచనంబున ననున్
సౌమిత్రి కుపితుడు నిర్ఘృణస్వాంతుడు నై
యీ మెయి విరూప జేసెన్
దామసమున లెక్క గొనడు దానవనాథున్.

520. కుసుమశరోపహతిం బడి
వసదూలెదు మే ల్పసిండి వన్నెలు చిన్నెల్
మిసమిసలు హొయ లొలుకు నా
యసితేక్షణ జూచి తేని యన్న! దశాస్యా.

521. ఆ కన్నియ సోయగ మా
లోకింప నిరువది కన్నులుం జాలవు నీ
కా కామిని పొందు వడయ
నీకొందువ యేని వినుమ హితము వచింతున్.

522. సకలాస్త్రశస్త్రతతితో
సకలాసుర వీర సైన్యసంతతితో నే
గి కలన వధింపుము దశర
థకుమారయుగంబు సీత దక్కును దానన్.

523. ఖరదూషణాదిదైత్యుని
కరసంహారమునకు బ్రతి గావించు టగున్
బరమోత్తమాంగకాంతా
పరిరంభణసౌఖ్యమై భవం బొనగూడున్.

రావణుడు మఱల మారీచుని కడకేగుట

524. క్షణదాచరేశ్వరుడు శూ
ర్పణఖోదితవిషయ మాత్మ బరికించి విచ
క్షణ సేసి నిశ్చితమతిన్
జనె మారీచు నుటజంబునకు సరథుండై.

525. మారీచు డెదురు సని స
త్కారంబు లొనర్చి వేడగా దశకంఠుం
డీ రీతి స్వపునరాగమ
కారణము వచించె స్వాధికారగళమునన్.

526. ఖరదూషణు లస్మత్సో
దరు లుగ్రపరాక్రములు సుదారుణకర్మా
భిరతుల్ యజ్ఞధ్వంసన
నిరతులు వడి రొక్క నరుని నిశితాస్త్రములన్.

527. మారీచ! తదుగ్రాసుర
దారుణసంహారము మది దహియించున్ గాం
తారాగ్నిశిఖల్ వోలె ని
వారణ మొనరింప గాదు ప్రతిక్రియ లేమిన్.

528. కుపితపితృనిరస్తుడు క్ష
త్రపాంసనుడు కర్కశుండు ధర్మరహితుడున్
గపటియు లుబ్ధుడు మూర్ఖుడు
కృపావిరహితాత్మకు డజితేంద్రియవశుడున్.

529. ఆ రాముడు దుశ్శీలుడు
ఘోరపరాభవము నాదు కూర్మిభగినికిన్
గూరిచె నిర్వైరంబుగ
మారీచా! నిజపరాక్రమసమాశ్రయుడై.

530. ఇదియును నాకున్ గడుతా
పద మగుచున్నయది నీదు ప్రాపున గొని తె
చ్చెద దత్సర్వజనాహితు
సుదతి ప్రతిక్రియ నొనర్చి చూపెద నేపున్.

531. బలదర్పవీర్యశౌర్య
మ్ముల భీకరరణముల నసముండవు బహుమా
యలు రిపువిజయోపాయ
మ్ములు నేర్చిన వాడ వసురపూజ్యుడ వరయన్.

532. నీ మంత్రసహాయమునన్
రామున్ సాధింతు రమ్ము నాకున్ దోడై
రామాశ్రమవనికిం జన
గా మారీచా! యనంగ గటకట పడుచున్.

మారీచుడు సీతాపహరణము వలదనుట

533. మారీచుం డనియె నిశా
చారేశ్వర! యేను మున్నె సత్యము హితమున్
గూరిమి వచించితి న్నీ
కారాముని గూర్చి తత్త్వ మాలింపవయో!

534. అవిరళమౌదురు దలప బ్రి
యవాదులున్ శ్రోతలు బలలాశనరాజేం
ద్ర! వినుము దుర్లభులు సుమి హి
తవాదులున్ శ్రోతలు భువి తథ్యము కాగన్.

535. చెవికి రుచింపవు నాదు హి
తవచనము ల్నీకు రోగతప్తునకున్ బు
ష్టి వివర్ధకపథ్యాన్నం
బు వోలె, నెవడొ నిను మోసపుచ్చె దురుక్తిన్.

536. పరవిషయసంగ్రహంబున్
జరుపవు చారప్రయుక్తి జపలుడ వసురే
శ్వర! అల్పుని గా నెంతువు
వరుణేంద్రోపము మహానుభావున్ రామున్.

537. దనుజాన్వవాయనాశన
మొనరింపగ నుద్భవింప బోలున్ సీతా
వనజేక్షణ నాకున్ జీ
వనసంకట హేతు వయ్యెబల కా దోచున్.

538. నిను బోలిన దుశ్శీలుడు
వనితాజనకామసంగవశుడు, దురాచా
రనిరతుడు స్వావ్రజన రా
ష్ట్రనాశకుండగు దశాస్య! సత్యము దలపన్.

539. జనకపరిత్యక్తు డస
త్యనిరతుడున్ లుబ్ధుడున్ దయారహితాత్ముం
డును ధర్మహీనుడున్ భూ
జనాహితుడు గాడు రామచంద్రుం డరయన్.

540. కైకేయీపరివంచిత
సాకేతపురాధిపపితృసత్యవ్రతర
క్షాకృతమతియై రాజ్య
స్వీకృతి వీడి వని కేగె స్వేచ్ఛాపరుడై.

541. రాముడు కౌసల్యానం
దామృత వర్ధనుడు రూపు దాల్చిన ధర్మం
బౌ, మహితక్ష్మాలోక
స్వామి సురజగత్ప్రభుండు శక్రుం బోలెన్.

542. విజితేంద్రియుండు రాఘవు
డజేయుడు మృదుస్వభావు డరిలోకభయ
ప్రజననచాపుడు ధర్మర
తజనప్రకరాభిరామదర్శనుడు ప్రభూ.

543. రాముండు సాధుశీలుడు
భూమిజనక్షేమకరుడు పూతాత్ముడు సు
త్రామయశఃకలితుడు నీ
వీ మెయి దుర్భాష లాడు టేమి హితంబా.

544. పరికింప రామ కార్ముక
పరిరక్షిత యైన సీత పత్యనురక్తన్
దరి జేర వచ్చునే దిన
కరప్రభామండలంబు గతి నీకు ప్రభూ!

545. వేనుడు లేటికి యెన్నటి
కేనియు నా రాఘవున్ జయించుట నీచే
గాని దిటు లూరకేల ద
వానలమున్ జొచ్చుట శలభంబు గతి ప్రభూ!

546. కరగతమై యున్నది నర
సురదుర్లోకసువిశాలశోభామయరా
జ్యరమ సుఖంబుగ నేలక
పరసతికై యొడ్డె దేల పణముగ నసువుల్.

547. రామునితో విగ్రహ మన
సామాన్యము గాదు మృత్యుజనకంబ యగున్
వేమాఱు వచించెద నే
నీ మాటన్ బురికి మఱలు మిప్పటి కేనిన్.

548. పురి మంతనంబు సేయు మ
సురవరులు విభీషణాది సూరిచయముతో
నెఱుగుము నీదు బలము న
య్యరి బలమున్ గార్యనిశ్చయ మొనర్చు తఱిన్.

549. మఱియున్ జెప్పెద రాఘవ
శరమాహాత్మ్యంబు రాక్షసకులేశ్వర! య
ధ్వరవిధ్వంసన వేళన్
బరమభయావహము స్వానుభవమున్ వినుమా.

550. కౌశికు డొనర్చు యాగము
నాశము సేయంగ జనితి నాడు మహాభీ
మాశర సైన్యయుతుడనై
దాశరథియు నేగుదెంచె ద ద్రక్షణకై.

551. పదియారేడుల బాలు డ
విదితాస్త్రుడు నాడు రాఘవేశుడు నేనో
కదనవిధిజ్ఞుడ వరగ
ర్వదర్పితుడ గిరిశిఖరనిభాకారుండన్.

552. కాంచనకిరీటకుండల
సంచితదివ్యప్రభల్ దిశ లలమ జని హో
మాంచితసవవేదిన్ గురి
యించితి మాంసరుధిరంబు లేకార్ఛటిగన్.

553. బాలుండె యన్న భ్రమ నా
భీలముగ గవిసితి ర క్తపిశితమ్ములతో
నాలో రాముడు తాలో
త్తాలశరాసనమున భయదధ్వని నిగుడన్.

554\. శరమెక్కువెట్టి కొట్టెన్
సరభసమున నన్ దదీయశరఘాతముచే
నురవడి లవణాబ్ధి బడితి
మరుదుద్ధూతము రజస్సమానుడ నగుచున్.

555\. ఒడలు దెలియ కుండితి న
జ్జడనిధి గొంతవడి పిదప సంద్రంబు బయ
ల్వడి యెట్లో యిలు సేరితి
గడప్రాణమున బ్రతికిన సుఖము గలదంచున్.

556\. ఆవల దండక కేగితి
నీవల నావల బలాశు లిద్వురు గొల్వన్
బావకశిఖాజ్వలజ్జి
హ్వావదనరదనములన్ మృగాకారుడనై.

557\. తావసుల వధించుచు ద
త్తావసదేహరుధిరంబు ద్రావుచు బిశితం
బేపున భుజించుచున్ ద
ర్పోపహతాత్మన్ జరించుచుంటి వనమునన్.

558\. ఒక నా డరిగితి యాదృ
చ్ఛికముగ రామాశ్రమంబు చెంతకు జడలున్
వికటాజినవల్కములున్
బ్రకటము గాగ మునియైన రాముం గంటిన్

559. చిరకాలవైరము మదిన్
స్ఫురింప దావసుడు నియతభోజనుడున్ శౌ
ర్యరహితుడు రాము డేమి యొ
నరింప గల డన్న యూహ నామది మెదలన్.

560. ఉరికితి నుద్ధతి మెఱయగ
కఱకువిషాణద్వయప్రఘాతమునన్ ద
త్పరిపంథి రాము గూల్పగ
దఱియిది పగదీర్తు నంచు దలచి దశాస్యా.

561. అంతన్ విల్లందుకొని ని
రంతక్రోధారుణాక్షుడై రాముడు తీ
క్ష్ణాంతశరత్రయమున్ విల
యాంతకపాశసదృశముగ నడరించె వెసన్.

562. రామకరధనుర్ముక్తశి
లీముఖమాహాత్మ్యమున్ దెలిసి యుండుట ను
ద్దామజవంబున బాఱి ప్ర
భూ! మృతి దప్పించుకొంటి బొలిసి రనుచరుల్

563. ఆనాటి నుండి క్రౌర్యము
బోనాడితి దాపసవధమున్ వీడితి నే
నీనాటికిన్ బ్రశాంతు వి
ధానన్ బొనరించుచుంటి దపము న్మునినై.

564. అరుణాంబకోజ్జ్వలుండై
శరకీలితదివ్యచాపసన్నద్ధుడు గో
చరుడగు రాఘవుడు తరువు
తరువున నీనాటికి భయదాకృతి నాకున్.

565. జగ మెల్లయు రామమయం
బగు నిద్రాజాగరణములం దనవరతం
బుగ దోచు రాముడె భయం
బగు 'రా' దిగ శబ్దమేది యాలించిననున్.

566. రాముని గుణమాహాత్మ్యం
బామూలాగ్రము వచింప నసమర్థుడఁ జూ!
నా మానసమున దోచిన
యీ మాత్రము దెలియ జెప్పితీ వెఱుగంగన్.

567. అవివేకుడవై శ్రీరా
మవిభుని తోడన్ సమరసమాయత్తుడవై
న విగతజీవుండ వగుదు
ధ్రువంబు నశియించు జనతతులు సంపదలున్.

568. చావైన నీ వొకండవె
చావవు, చచ్చు బలలాశిసంచయ మెల్లన్
రావణ! దనుజస్త్రీలు క
కావికలై పొఱుదురు మగల గోల్పడగన్.

569\. అపరాధము నీ దైనన్
విపద్దశల పొలగుదురు వీతాఘులు ధ
ర్మపరు లహి హ్రదమున మ
త్స్యపటలముం బోలె నీకు సహచరులగుటన్.

570\. నను మోహరింపకుము రా
మనృపు నెదుట నీదు దుష్టమంత్రంబున బా
ల్గొన నిచ్చగింప నీ మె
చ్చిన క్రోవం జనుము మంచిచెడ్డలు నీకా.

571\. హితమును బథ్యము గా స
న్మతి గార్యము దెల్పె నట్టు మారీచుడు త
ద్ధితమున్ గొనండు రావణు
డతిరోగాసన్న మరణు డౌషధము గతిన్.

రావణుడు మారీచుని బెదిరించుట.

572\. రావణు డనె మారీచ! వృ
థావాదము సేసితి వుచితానుచితంబుల్
భావింపక వ్యర్థంబులు
నీ వచనము లూషరావనిగతాంకురముల్.

573\. ఒక మూర్ఖచిత్తవాక్యము
న కులికి పితృమాతృహితజనంబున్ భూపా
లకపదమున్ ద్యజియించి వ
నికి బాఱిన మానవు ఘనునిగ గల్పింతే.

574. ఖరదూషణహంతకుడై
న రాఘవు సతిన్ గొనుటది నా నిశ్చయమౌ
సురనాథుం డాదిగ నె
వ్వరు న్నిరోధింప లేరు పరికింపుమదిన్.

575. ఈ కార్యం బొనరింపగ
నాకు సహాయుడవు గమ్మనగ వదఱితి వెం
తో కోరలేదు నిను గా
ర్యాకార్యంబులు హితాఽహితాదులు దెలువన్.

576. హితమైనన్ సచివుండు నృ
పతిచిత్త మెఱిగియ పల్కవలె వినయముతో
చుతెఱంగున స్వాభీప్సిత
గతి బల్కన్ రాదు సుమ్ము క్ష్మావిభు మ్రోలన్.

577. హరివిక్రముండు వైశ్వా
నరతేజుడు యామ్యదిగధినాయకశిక్షా
కరణుండు రాజు జనసౌ
ఖ్యరంజనంబుల వరుణసుధాంశుసముండ

578. నరపతి యింద్రానలయమ
వరుణసుధాంశుప్రభావవైభవముల దే
జరిలున్ మాన్యుం డద్దా
న రాజు మారీచ! సర్వనరతతి కెపుడున్

579. వైరము లేకయె కూల్చెన్
మారీచా! నీదు జనని మత్సోదరికిన్
వైరూప్యము గూర్చె గుటిలు
డా రాముడు మారుసేయు టావశ్యకమా.

580. బలదర్పధైర్యసంపద
నిలాతనూజ గొని తెత్తు నేగతి నైనన్
గలహ మనావశ్యకమా
వలలాశి! సహాయ మీవు పచరించినచో.

581. కావున మఱి మాటాడక
నావెంటన్ రమ్ము కాంచనమృగాకృతితో
నీ వా రాముకుటీరము
త్రేవన్ జరియింప జానకి కనన్వలయున్.

582. సౌవర్ణచిత్రబిందుస
మావృతము భవన్మనోహరాంగము గని చే
తోవిభ్రమచాపల్యము
లావేశింప దమి బట్టనంపున్ విభు నిన్.

583. అందియు నందక పరువిడు
చుం దఱిజేరంగ వచ్చుచున్ బోవుచు రా
ముం దికమకలన్ మఱి మఱి
యుం దూరము గొంచు బోవు ముటజంబునకున్,

584\. హా సీతా! హా లక్ష్మణ!
హా సీతా! యనుచు గంపితారావమునన్
గాసివడినట్టు లఱచుము
కౌసల్యాసుతు గళానుకరణం బెసగన్.

585\. ఆ యార్తధ్వనులు విని స
హాయము సేయ నవనితనయాజ్ఞావివశుం
డై యేగు లక్ష్మణుండున్
మాయాకృతి గొందు నంత క్ష్మాసుత సీతన్.

586\. నా పను పొనరించినచో
జేపడ జేసెద నపారచిత్తానంద
వ్యాపృతి మదర్ధరాజ్యము
ప్రాపంచికసౌఖ్యవైభవంబులతోడన్.

587\. కాదందు వేని యిపుడ
యౌదల ఖండింతు జూడు మా రాఘవుచే
నీదు మృతి సంశయాస్పద
మౌ దండన మది ధ్రువంబ యగు నాచేతన్

మారీచుడు రావణుని వెంట నరుగుట.

588\. యోచించుకొ మ్మనగ మా
రీచుడు తత్పరుషవచనరీతి మనమునన్
దోచు కినుక నెల్ల నడచి
వైచికొని ధశాస్య జూచి బదులాడె నిటుల్.

589. హీనపరాక్రము డెవ్వడొ
దానవుడు భవద్రిపుండు త్వన్నాశనవాం
ఛానిరతుండై యీగతి
బూనెన్ బగదీర్చుకొనగ మోసము కలిమిన్

590. తామై పగసాధింపగ
లేమిన్ బడద్రోయుచుండి రెవ్వరొ నిన్నా
రామశరాగ్నింధనముగ
నామాట వినవు వినాశనాభిముఖుడవై.

591. సచివులు నరపతికిన్ ధ
ర్మచిత్త మూని సలుపవలె మంత్రోద్బోధం
బుచితానుచితవిచక్షణ
బచరించుచు జనహితంబ వాంఛింపవలెన్.

592. అగణితధర్మస్థితికిన్
విగతభయార్తులగుచు బ్రజ విలసిల్లుటకున్
జగతీధవుండె మూలం
బు గాన సర్వవిధముల నృపున్ గావవలెన్.

593. దుర్మంత్రబోధనంబున్
ధర్మవిరహితప్రవర్తనంబు సలుపుచున్
మర్మాఘాత మొనర్చెదు
దుర్మంత్రుల శిక్షసేయ దొరకొన వయయో!

594. క్రూరు డవినీతిపథసం
చారుండు ప్రజావిరుద్ధచపలాత్ము డస
త్యారంభుడు రా జగుచో
నా రాజ్యస్థితి యశక్య మగు జూవె ప్రభూ!

595. నరవిభుడు మందబుద్ధియు
శరతీక్ష్ణోపాయపరులు సచివాగ్రణులై
పరగిన నశింత్రు జను లచ
తురసారథియుక్తరథగతుల వోలె ప్రభూ!

596. పరదారం జెఱగొన దా
పురించు నాసురవినాశమునకున్ ప్రభు! నే
నరయ నిమిత్త మగుట దు
స్తరవ్యథావహము గాకతాళీయంబున్.

597. రాము నెదిరి నడచుటయె మ
హామృత్యుబిలంబు సొచ్చునట్టి దగు దశా
స్యా! మూర్ఖచిత్తుడవు నీ
వే మెయి గ్రహియింపకుంటి వీ సత్యంబున్.

598. మరణము తప్పనిదేనిన్
బురుషోత్తమరామబాణమున నయ్యెడు నా
మరణమె పుణ్యప్రదమగు
బురుషాధమ! త్వత్కరాసి బొలియుట కంటెన్.

598. ఇక దర్శించిన ఫలమే
మికలుగు? తోడగుచు నేను మిత్రం బడగా
నకలుషపతివ్రతాహర
ణకలుషమున దెగుము రావణ! సమూలముగన్.

600. చనువారము గాక యనన్
మనమున మెచ్చుచు దశాననాసురుడు రథం
బున దోడ్కొని చనె మారీ
చు నతిరయంబున దశరథసుతు డున్నెడకున్.

601. దశవదనుడు మారీచుడు
బిశాచముఖభీకరఖరవిలసద్దేమా
ఢ్యశతాంగముపై నేగిరి
దశరథసుతు నాశ్రమంబు దరియగ నంతన్.

సీతమాయలేడిని దెమ్మని రాముని గోరుట.

602. మారీచుడు చిత్రమృగా
కారము తోడన్ భ్రమింపగ గడగె దద్ర
మ్యారామపరిసరములన్
ధారుణితనయాసమీక్షణగతోద్యముడై.

603. ఉరుకు లిడు జెంగుచెంగున
బరువులువారు నొకచోట బదములు నాల్గున్
ధరనిల్పక బెదరుగనుల
మెఱయు దళత్తళలు కదిసి మెసవున్ జివురుల్.

604. ఉటజద్వారము ముంగిట
నటునిటు దిరుగు మృగసంచయము గూడుచు
తట మఱలుచు గ్రీడించు ని
కటస్థితావనిరుహప్రకరమూలములన్.

605. పరిసరచరన్మృగావళు
లరుదెంచి విచిత్రదై హికౌజసమున క
బ్బురపడి మూ చూచి వడిన్
బరువెత్తు భయంబు సెంది నల్వంకలకున్.

606. మారీచుడు తన్మృగసం
హారము సేయడు నిజకపటాకృతియుబయ
ల్గా రావణకార్యవిఘా
తోరుభయంబున సహజదురుద్ధతు డయ్యెన్.

607. ఆసమయంబున వచ్చెన్
భూసుత పుష్పావచయసముద్యతయై యా
వాసము వెల్వడి కుసుమల
తాసంశ్రితకర్ణికారతరువాటికకున్.

608. మణిరత్నబిందుయుతకాం
చనవర్ణాంచితము మధురసంచారము ద
ర్శనసుభగంబును గాంచెన్
జనకజ యుత్ఫుల్లలోచనయగుచు మృగమున్.

609\. కని విస్మయవశయై నా
ధుని బిల్చి పలికె మదిన్ గుతుక మెసగంగా
గననగు నదృష్టపూర్వం
బనన్య రూపాశ్రయంబు హరిణం బదియే.

610\. వదనమరుణాంబుజోత్పల
సదృశము శృంగాగ్రమున్ లసన్మణిదీప్తం
బు దలపగ నింద్రనీలకు
ముదాభముల్ జెవులు వదనము సితాసితమున్.

611\. కను మింద్రనీలదళశో
భ నెసగు నధరంబు నాథ! పార్శ్వము లావ్వం
గనెడు మధూకసుమచయము
గ నూర్ధ్వపుచ్ఛంబు శక్రకార్ముకసమమున్

612\. అవలోకింపుము కుందేం
దువజ్రజభాస్వదుదరంబు దోచున్ వైడూ
ర్యవిలాసవిభ్రమమున ఖు
రవితతి యన్యాంగములు జలజకేసరముల్.

613\. ఇది కడు మనోహరం బగు
గద! నాథ! యటంచు దన్మృగసమానయ వాం
ఛ దలిర్పగ జానకి వ
ల్కె దరియ జని యన్నతోడ లక్ష్మణు డనియెన్.

614. ఇట్టి విచిత్రమృగము గన్
పట్టదు జగతిన్ ధరాధవ! యసురమాయల్
పుట్టుట కానంబడు ని
ప్పట్టుల గంధర్వపురము వంటిదె యిదియున్.

615. జనసమ్మోహనకరముగ
దనుజుడు మారీచు డిట్టి దంభాకృతులన్
మునిసంతతి గూల్చుట మున్
వినమె! యిదియు నట్టి మాయ నిశ్శంకముగన్.

616. అనుచున్న సుమిత్రాసుతు
జనకజ వారించి రామచంద్రున కనియెన్
జననయనాహ్లాదకరం
బనుమానింపంగ నేటి కవనీనాథా!

617. నాకున్ క్రీడామృగ మగు
నీ కాననవాసపు దటి నింపుగ బిదపన్
సాకేతాంతఃపురి నా
లోకనసుఖు లౌదు ర త్తలున్ భరతుండున్

618 నానావర్ణవిచిత్రాం
గానూనము చిత్రబిందుకలితం బగుచున్
గాననమున భాస్వంతం
బౌనిది యత్రభస్థలిన్ శశాంకుడు వోలెన్,

619. నా మనమున్ హరియించిన
యీ మృగరాజంబు బట్టి యిమ్ము సజీవం
బో మఱి నిర్జీవంబో
యేమైనను గాని యిప్డనిన లక్ష్మణుడున్.

620. వలదన్న! రాక్షసాధమ
ఛలప్రయోగ మిది సర్వజగతీధవ! నీ
తెలియని దున్నదె వసుధా
తలంబున ననంగ సస్మితాస్యుం డగుచున్.

శ్రీరాముడు లేడిని బట్టనరుగుట.

621. రాము డనియె నింతకు ము
న్నీ మైథిలి కోరనేర దెయ్యదియున్ నే
డీ మెయి ననుజః కురంగము
పై ముచ్చటపడగ దీర్పవల్వదె నాకున్.

622. నిక్కంపు మృగం బైనన్
జక్కగ గొనితెచ్చి యిత్తు జనకాత్మజకున్
ముక్కడి రక్కసు డైనన్
జక్కడగింతును బటుతరశరఘాతమునన్.

623. శరచాపంబులు దె మ్మిటు
ధరణీసుత జాగరూకతన్ గావుము నే
మఱలి చనుదెంచు దనుకన్
హరిణముతో నంచు రాము డరిగె వనమునన్.

624. చిక్కియు జిక్కక దూరపు
చక్కిన్ బరువిడి మఱునిముసంబున దాపై
ప్రక్కనె చరించి యుఱుకుచు
నక్కైతవమృగము రాము నలయించె గడున్.

625. బహుదూరంబుగ నేగెన్
గహనంబున దానివెంట గార్ముకధరుడై
సహనంబున, దుది బాణ
ప్రహార మొనరించె విసివి రాముడు కినుకన్.

626. ఆ శితశరంబు మారీ
చాశరమర్మచ్ఛిదంబు సల్పగ గూలెన్
హా సీతా! హా లక్ష్మణ!
హా సీతా! యనుచు నఱచి యసురుం డవనిన్.

సీత రామునకు సహాయముగా లక్ష్మణు నంపుట.

627. హా సీతా! హా లక్ష్మణ
హా సీతా యన్న యఱపు లాశ్రమవాటిన్
భూసుత శ్రవణద్వయి బడె
కౌసల్యాసుతుగళానుకరణము లగుచున్.

628. కలవరపడుచున్ సుమపే
శలాంగి సీత వచియించె సౌమిత్రికి వి
హ్వాల మగు నా మానసము వి
నలేదా! సోదరకృతార్తనాదంబు లటుల్.

629. నా పతి కపాయ మెయ్యదొ
దాపుర మై నట్లుతోచు ద్వరపడి చనుమా
చాపము శరంబులుం గొని
యే పలలాశను లెదిరిరొ యీ ఘోరవనిన్.

630. నిలుచుంటి వింక బోవే
మి లక్ష్మణా! మెదలవేమి? మే లగునే యి
ట్టులు నిష్క్రియుండ వగుట క
దలు మ య్యగ్రజున కాపద నివారింపన్.

631. అని తొందరింప లక్ష్మణు
డనె మది శంక గొనబోకు మమ్మా! నీభ
ర్త నెదిర్చి నిల్వగల వా
ని నెవ్వనిం గాన నేర నిఖిలజగములన్.

632. అది రాముని కంఠధ్వని
గ దలంపకు మాయవన్నె గ్రవ్యాదు డెవం
డొ దురాత్ముడు రాముని కా
పద వొరయుని దివిజు లెత్తి వచ్చిన యేనిన్.

633. ఖరదూషణాదిరాత్రిం
చరులన్ బదునాల్గువేల జక్కడపడె యొ
క్కరు డయ్యు రాఘవుడు నా
దరయవొ! తల్లి! భయము చనదట్టి విభునెడన్.

634. ఒక మాయావిం దనుముట
యొక లెక్కయె రామున కిటు లూరక వ్యథ జెం
దకు మమ్మ! రామతీవ్రాం
బకఖండితదానవారవం బద్ధియగున్.

635. కాంచనమృగం బనుచు నీ
వెంచిన యది దనుజమాయ యే యగు సుమి! త
ద్వంచకు డా మారీచుడె
యంచు దలతు మూడె వాని కాయు వరయగన్.

636. పలలాశిన్ వధియించి మ
అలి వచ్చుచు నుండనోపు రాఘవు డా శ్రీ
లలనేశతుల్యవిక్రము
డలఘుడు సుమి! భీతి దక్కి స్వాస్థ్యము గనుమీ.

637. నిను గాపాడుచు నుండు మ
నె న న్నిచట రాము డమ్మ! యెప్పట్టున నై
న నతిక్రమింప జాల ద
దనఘస్వాంతు వచనంబు దాల్మి గొను మికన్.

638. అనినన్ గ్రోధోద్ధురయై
జనకాత్మజ యిట్టులనె నృశంసా! కులపాం
సన! నీవు మిత్రరూపము
న నున్న శత్రుండ వగుదు నాదు విభునకున్.

639\. ఘోరవనాంతరమున గం
తీరవసంచయము బాల్పడిన వృషభ మనం
గా రాముడు రాక్షసతతి
బారివడి శరణము గోరు భయపీడితుడై.

640\. ఐనను గదలక యేమే
మో నీరసపుబలు కాడుచుంటివి సౌమి
త్రీ! నీయన్న విపద్దశ
గానగ నీకు సుఖమగునె? కలుషస్వాంతా!

641\. నీ కుటిలబుద్ధి తెల్లం
బై కనవచ్చె నను బొంద నాశించి యిటుల్
పోకుంటి వగ్రజన్మున్
సాక భరతు ప్రేరణంబా! స్వాభీష్టంబో!

642\. నీ దుష్టవాంఛసాగం
బోదు జగన్నాథుడు సుమనోరంజకుడున్
నా దైవము రామవిభున్
గాదని యన్యుం దలంప గలలో నైనన్.

643\. అనపాయమ్ముగ నుటజ
మ్మునకున్ రాడేని మద్విభుడు మరణింతున్
గనదగ్నివిషాచలశ్రృం
గనిపాతమ్ముల బ్రతుక నికన్ సౌమిత్రీ !

644. అనుచున్ ధరణీసుత తూ
లనాడ దుఃఖంబు నొంది లక్ష్మణు డనె, వం
దన మొనరించుచు దల్లీ!
నను ని ట్లాడందగునె మనఃఖేదముగన్.

645. జగదేకవిక్రమాన్వితు
డగు నన్న ప్రభావ మెఱిగి య మ్మహితస్వాం
తు గురువచన ముల్లంఘిం
పగ నేరక వీడ కుంటి వని ని న్నొంటిన్.

646. నీ వలన మాతృగౌరవ
భావం బెసగన్ జరించి భక్తి సలుపుచున్
సేవించి హితవు వల్కఁగ
దేవీ! పరుషోక్తులాడితి వధర్మముగన్.

647. అనుచిత మాడుట వనితా
జనస్వభావంబు పరగు జగతీస్థలి నె
ల్ల నిదియ నధర్మరత లం
గనలున్ గ్రూరులు విరోధకల్పను లెందున్.

648. రామాజ్ఞాధిక్కారము
నీ మూలంబున నొనర్చి నీ వచనమునన్
రాముని కడ కేగుదు ని
న్నోముం గాత వనదైవతౌఘం బెల్లన్.

649. చనుచుంటి నమ్మ! యియ్యదె
కనుగొందునా లేదొ భ్రాతృకలితుండనుగా
చనుదెంచి నిన్న టంచున్
బ్రణమిల్లి యరిగె ద దాత్మవంతు డురవడిన్.

రావణుడు బ్రాహ్మణవేషమున వచ్చుట.

650. భవతీ! భిక్షాం దేహి య
న వాక్యము పునఃపునర్వాచ్యం బౌ
చు వినంబడగ దొఱగు న
శ్రువుల్ దుడుచుకొనుచు సీత చూచె బయటికిన్.

651. నుదుట దెలిబూదిరేక లు
దధినుర్వులవోని జడలు తలపైన, మెడన్
రుదురాకలపేరులు జే
త దండము కమండలంబు దాల్చిన విప్రున్.

652. భవతీ! భిక్షాందేహి య
ను వాక్యమున బిల్చు వాని నొకనిం గని రా
ఘవపత్ని యాశ్రమబహిః
కవాటము న్వెల్వడి వడి ఘటితాంజలిగాన్.

653. ధరణిసురపరివ్రాజక
వరవేషధరుం డగు దశవదనుడు సీతా
తరుణిన్ వీక్షించె మదన
శరాహతస్వాంతు డనిమిషనయను డగుచున్.

654. ముదివగ్గు శూర్పణఖ దీ
ని దివ్యసౌందర్య మే మని వచింపం గ
ల్గె దుహినకరుసోదరి గూ
డదిగదుడుపు దీని ముఖవిలాసము ముందున్.

655. అనుచున్ దలంచి యిట్లనె
జనకజతో రావణుండు సదమలసౌంద
ర్యనిధివి శుభదర్శన వె
వ్వని దానవు శచివొ రతివొ! పద్మదళాక్షీ!

656. అరుణాబ్జదళవిశాలము
లరయగ నీకనులు సౌష్ఠవాతిస్నిగ్ధా
గ్రరదనముల్ కుందంబుల
సరణిన్ మెఱయు వదనంబు శశిబింబంబో.

657. పీనోన్నతకుచముల్ జం
ద్రానన! యొండొంటి నొరసి తాళఫలసమా
నూనాకృతి మెఱయున్ ము
క్తానికృతగళోపహారతరళస్ఫూర్తిన్.

658. అలినీలకుంతలములున్
బలిష్ఠకరితుండసన్నిభము లూరువులున్
పులినతలవిశాలజఘన
ములు, జ్యోత్స్నాభదరహాసము మనోజ్ఞములౌ.

659. పీతాంబరంబు గుసుమ
వ్రాతసుగంధంబు లాభరణముల్ పడతీ!
నీ తాల్చుటన్ బరమశో
భాతుందిలములగు నీదు పతియున్ వరుడే!

660. సకలజగత్సౌందర్యము
ప్రకటంబగు నీదు రూపవైభవమున జం
పకపుష్పనాస! నినుబో
లు కాంత కనరాదు నిఖిలలోకంబులలో.

661. భీకరరాక్షసనిలయం
బీ కాననమున వసింతు వి ట్లొంటరివై
నీకు వెఱలేదొ మత్తా
నేకపశార్దూలముఖవనేచరతతులన్

662. విమలమణిగణోన్నతసౌ
ధములం జరియింప దగుదు దాసీజనబృం
దము బలసి కొల్వ నట్టి య
సమలక్ష్మివైభవము విసర్జింతేలా!

663. పిడికిట నడంగ నగు నె
న్నడుమున్ నీ రూపయౌవనంబులు బడద్రో
సెడు నామది కూలంబున్
బడద్రోయు నదీజలప్రవాహము కరణిన్,

664\. లలనామణి! హ్రీశ్రీకీ
ర్తుల నెవ్వతెవో మనుష్యరూపంబున ని
య్యిల కే లరుదెంచితివో
పలుకుము, వివశుండ నీదు వర్తనమునకున్.

సీత రావణునకు దన్నెఱిగించుట

665\. తన నీగతి బ్రస్తుతి సే
య నిక్కపున్ బ్రాహ్మణయతి యంచు దలంచెన్
జనకజ పర్ణచ్ఛన్నా
వనిగర్త మరయని కరిణి వడువున వానిన్.

666\. యతి నర్చించెడు గతి భూ
మితనయ యర్ఘ్యంబు బాద్య మిచ్చి బృసి యొసం
గి తరుఫలమూలముల స
త్కృతుజేసి వచించె నీ గతి, గృతకయతికిన్.

667\. జనకమహీవరుతనయన్
నను సీత యటండ్రు బ్రాహ్మణవర! దశరథా
వనినాథతనూజుడు ధ
ర్మనిరతుడున్ సత్యవాది రామునకు సతిన్.

668\. ద్వాదశవర్షంబులు నే
నా దయితుండున్ మహాసుఖాబ్ధితరంగ
స్వాదువిహారాయత్తుల
మై దివ్యముగా గడపితి మన్యోన్యముగన్.

669\. పదుమూడగు నేడున మం
త్రిదండనాథగురుజనపరివృతుండై భూ
మిధవుఁడు రాము యువరా
ట్పదవి బ్రతిష్ఠింప బూనె బరమప్రీతిన్.

670\. నరపతి మును దన కిచ్చిన
వరద్వయము దీర్ప గోరి పంతము పట్టెన్
ధరణిపు ప్రియసతి కైకయి
భరతధరాభరణ-రామవనగమనంబుల్.

671\. ముట్టను జలమోగిరమున్
ముట్టను రామాభిషేకముం గనజాలన్
గట్టా ప్రాణాంతక మి
ప్పట్టని కైకేయి క్రూరవాక్యము లాడన్.

672\. ఇచ్చెద నని మున్నాడిన
యిచ్చకపుం బల్కులు దన కెదురై గళసీ
మోచ్ఛలితకాలపాశము
మచ్చున నుండంగ వగచె క్ష్మావతి, యంతన్

673\. జనకున్ సత్యవచనుగా
నొనరింపగ బయన మయ్యె నుల్లాసముతో
వనసీమలకున్ రాముడు
మునివేషమునన్ విహారభూమికి బోలెన్,

674. ఇరువదియై దేడుల వయ
సు రాఘవున కపుడు నేను జూడగ బదియున్
మఱియెన్మి దేండ్లదానన్
ధరణీసురసత్తమః చిరుతప్రాయమునన్

675. జనహితతత్పరు డనియున్
ఘనవిక్రమశోభితుండు గరుణాస్వాంతుం
డును సత్యవాదియున్ ధ
ర్మనిరతు డనగా బ్రశస్తి రాముడ కొదవెన్.

676. రామునకు సవతితమ్ముడు
సౌమిత్రి పరాక్రమనిధి సత్యరతుండున్
రాము నెడబాసి యుండని
ధీమంతుడు లక్ష్మణుడు జితేంద్రియచయుడుం.

677. రాముడు లేని పురంబున
సౌమిత్రియు నేను నిల్వ జాలక దత్సే
వామృతరససిద్ధి గనన్
రామునితో వచ్చితిమి వనావాసమతిన్.

678. అరుదెంచు నింతలో సో
దరుతోడన్ మద్విభుండు తాపసః తా మె
వ్వరో యేటికి వనమునన్
జరియింతురో తెల్పరె యని జానకి పలికెన్.

రావణుడు సీతను దన్ను వరింపుమనుట

679. కపటం బేమియు లే న
ట్టిపగిది ధరణిజ పల్కె డెందము ప్రియభ
ర్తృపరాయణంబుగా, దై
త్యపతి హరింపం దలంచె దా నయ్యతివన్.

680. మఱణింప బోవు టెఱుగక
సురద్విషుడు పల్కె సీత జూచి శుభాంగీ!
సురభోగానుభవార్హవు
నరమాత్రుండు పతి గాగ నవయుట తగునే.

681. సురపన్నగాసురభయం
కరుండు రావణు డనగ సకల రక్షోధీ
శ్వరు పేరు వింటివి గదా!
ధరణీతనయ! విను మేన త ద్రావణుడన్.

682. లవణాంబుధిమధ్యంబున
నివసింతు సమున్నతధరణీధరశృంగా
గ్రవినిర్మితలంకాపురి
నవనిజ! యమరావతి దివిజాధిపు బోలెన్.

683. దనుజసతీసంగవిముఖు
డ నైతి సీత! నిను గాంచుటాదిగ నిక జే
కొనుము భవన్నాథుంగా
ననవద్యాంగి! నను గామితార్థము లెసగున్.

684. పంచసహస్రాధికముగ
గాంచనభూషితవరమృదుగాత్రలు దాసీ
సంచయములు సేవింత్రు స
మంచితగతి నాదుపట్టమహిషి వగు నెడన్.

685. మఱువుము రామున్ నన్నున్
బరిగ్రహింపు మను రావణవచనమున్దా
సరకుగొనక ఛీ ఛీ యని
నిరసనభావమ్మున ధరణీసుత పలికెన్.

సీత రావణు నిరాకరించుట.

686. పతిదటి లే నెడ కుహనా
యతివై యాతిథ్య మొసగ నాయ త్తంబౌ
సతి నిట్టాడెదు! దశవద
నః తులువ వై పాల్పడితివి నైచ్యంబునకున్.

687. అంతర మెఱుగక వదరుదు
వింతియ గాక సరిపోలు దే రాముని దు
శ్చింత యొకడు దక్కగ నా
వంతయు గానవు వివేక మన్నది పలువాః

688. మృగపతి రాముడు నీవో
సృగాలమవు విమలసురసరిన్నిభుడౌ నా
మగ డీవు మురికికాల్వవు
ఖగనాథుడు రాఘవుండు కాకివి నీవున్.

689. బంగారము రాఘవు డై
నం గుమతీ! నీసమీవు నా రాముడు మా
తంగము బిడాల మీ వర
యంగా ప్లవ మీవు బర్హి యగు రాముండున్.

690. మేరుగిరీంద్రము వోలెన్
ధీరుం డక్షోభ్యుడు జలధింబోలె మహా
వీరుడు మహేంద్రసన్నిభు
డా రాఘవరాము నిత్య మనువర్తింతున్.

691. సకలశుభలక్షణాన్వితు
డకలంకుడు శశినిభాస్యు డబ్జాక్షుడు శ
త్రుకరిమదభంజనహరి
ప్రకటపరాక్రముడు దాశరథి సేవింతున్.

692. అనవరతధర్మవర్తను
డు నిర్జితేంద్రియుడు శ్లాఘ్యుడు మహోరస్కుం
డును దీర్ఘభుజు డమలస
త్యనిరతు డా రాము సతత మనువర్తింతున్.

693. నరసింహుడు రాముడు భా
స్కరప్రభ గతిన్ దదీయ సతి దుర్లభయౌ
వరియింతు వేటి కానను
నరయ సృగాలంబు సింహి నాసించుగతిన్.

694. దురనుప్రాప్యంబులు గో
చరంబులగు నీకు సులభసంపదవోలెన్
ధర మరణాసన్నునకున్
దరువులు హేమప్రభల గనంబడు రీతిన్.

695. గిరివరమున్ హస్తద్వయి
హరించి కైకొన క్షుధితమృగాధిపదంష్ట్రిల్
పెరుకంగ ఘోరవిషమా
హరించుకొన జూచుట నను నాసించుటనన్.

696. శిలమెడకుం గట్టుకొనుచు
జలధిన్ దరియింప జూచు చందము శశిసూ
ర్యుల నిర్వురన్ గరంబుల
గలంప జూచుట యగు నను గామించుటయున్.

697. శితశూలాగ్రగమనమున్,
హుతవాహజ్వాల నొడిసి యొడి గట్టంగా
జతనంబు సేయుటయు నౌ
సతతశుభాచార రాము సతి గోరుటనన్.

698. నను బల్మి గైకొనుచు నే
గిన నేని సుఖింపలేవు ఘృతపానము సే
సిన మక్షికంబు గతి వ
జ్రనిభశరహతుం డవగుదు రాఘవుచేతన్.

699. తలపడ బోకుము రావణ
వలల! సహస్రాక్షసన్నిభప్రాభవసం
కలితుండు రాము తోడన్
వలపున్ గొనకుము పరాంగనలపై నింకన్.

700. అనుచున్ ధీరస్వాంతం
బున బల్కియు భీతి నెంది భూసుత మనుజా
శనసాన్నిధ్యంబు కతన
ననిలోద్ధూతంబు కదళి యన గంపించెన్.

రావణుడు సీత నపహరించుట

701. ఆ రీతి దశగ్రీవుడు
ధారుణితనయానిరాకృతస్వాభీష్టం
డై రూక్షేక్షణజాలా
సారంబున బల్కె సతికి సాధ్వస మెచ్చన్.

702. సురగణముతో సహస్రా
క్షు రణపరాఙ్ముఖు నొనర్చుచు జెలగి ఫాలా
క్షు రజతగిరి నెత్తితి సతి!
యరిదమనుండ నఖిలభువనాధీశుండన్.

703. పవనాగ్ని సూర్యశశిముఖ
దివిజస్తోమంబు లస్మదిచ్ఛాచారుల్
భువి బెకలింపంగల భూ
రివార్ధి సంక్షోభము నొనరింప గలండన్.

705. పవనుండు వీచు మెల్లగ
నవనీజంబులు చలింప వాతపము న్మా
ను వికర్తనుండు సీతా !
ప్రవహింపవు నాయెదుట స్రవంతీతతియున్.

705. నా యగ్రజుండు పాఱె మ
దీయోద్ధతి నోర్వలేక హిమగిరికిన్ దా
నాయోధనంబు వీడి త
దీయము పుష్పక విమాన మేను గ్రహింపన్.

706. మదనశరవ్యథితాత్మన్
మదవతి! ని న్నభిలషించినాడ మహీరా
ట్పదరిక్తుడు రాముడు మ
త్పదనఖముం బోల డాహవక్షేత్రమునన్.

707. జానకి! లంకారమ్యో
ద్యానవనంబులు హిరణ్మయాంతఃపురసౌ
ధానీకంబులు సురక
న్యానిభదాసీతతియు మహాసౌఖ్యదముల్.

708. ఋతుచక్రము మదధీనము
క్షితిరుహముల్ సర్వకాలసిద్ధఫలవిరా
జితములు మన్నగరి, లభిం
చితి ద్వ ద్భాగ్యవశమున భజింపుము నన్నున్.

709\. అనినన్ జానకి యిట్లనె
వినవు హితంబు దశకంఠ! నిలయంబగు స
ర్వనరాదసంతతులకున్
నిను బోలిన దుష్టమూర్ఖనృపమూలముగన్.

710\. బ్రదుకం గలవేమొ శచీ
సుదతిన్ జెఱవట్టి యైన సుస్పష్టము ద
ప్పదు మృతి యమృతమ్మున్ ద్రా
వుదేని న న్మట్టిన యెడ బుద్ధివిహీనా!

711\. అనినన్ మృత్యువునకె మృ
త్యునిభుడ న న్నేమి సేయు దుర్బలు డల్పుం
డు నరుండు పితృనిరస్తుడు
వనచారి గతాయువున్ భవత్పతి యనుచున్.

712\. ధరణీసురపరివ్రాజక
వరరూపము వీడి దానవాధిపు డంతన్
ధరియించె దుస్సహనిజ
స్వరూప మరుణాక్షులున్ దశముఖంబులతోన్.

713\. కనవచ్చె నీలభూమీ
ధ్రనిభమహాంగంబు దృగ్వితానక్షయకా
రణరక్తారుణవస్త్రము
ధనుశ్శరాద్యాయుధకలితాంచద్భుజముల్.

714. కనులకు మిఱుమిట్లు గొలుపు
చు నరుణరాగప్రసారశోభామయకాం
చనకుండలమండితు డా
దనుజాధీశుండు దరిసె ధరణీతనయన్.

715. ఒకచేత కేశరాశి మ
ఱొకచే నూరుద్వయంబు నుద్ధతుడై ప
ట్టికొనుచు నెత్తి రథంబు క
డకేగె బంక్తివదనుడు పుడమి యద్రువంగన్.

716. కొనిపోవుచుండె నయ్యయొ
నను బట్టి దశాననుండు నక్తంచరుడం
చును రామః రామః లక్ష్మణ!
యనుచున్ సీత విలపించి యడలుచు నుండన్.

717. సకలాయుధసన్నద్ధము
వికృతపిశాచముఖఖరనిభృత మరదమునన్
వికటాకృతి నిడుకొనె జా
నకి నంకతలమ్మున గఠినాత్ముం డగుచున్.

718. కరముల్ విదుల్చు కొనుచున్
ధరణీసుత రావణాంకతలము విసర్జిం
చి రథోపరిస్థలిన్ బడి
యురంబు మోదుకొను చేడ్చుచుండె వివశయై.

719. అరదంబు కదలె వికటో
ద్ధురహాసకటువచనములతో దశవదనా
సురుడు బెదరించు చుండన్
ధరణిజ విలపించె నశ్రుధార గురియుచున్.

720. గిరితరువులార! గోదా
వరీస్రవంతీలలామ! వనదేవతలా
ర! రభసమున రావణు డప
హరించె సీత నని తెల్పు డా రామునకున్.

721. హరిణానయతత్పరుడై
యరిగిన నా విభు డెఱుంగ డయ్యయొ రాత్రిం
చరపతికృతావమానము
కురవకమ! వచింపుము రఘుకులనాథునకున్.

722. జనకాత్మజ నను బలిమిన్
గొనిపోయెడు రావణుండు క్రూరు డటంచున్
వనదేవతలారా! రా
మునకున్ వడి దెల్పరె! యిదె మ్రొక్కెద మీకున్.

723. యతివేషంబున వచ్చి పి
శితాశనుడు రావణుండు సీతాతరుణిన్
ద్రుతగతి గొనిచనె నని నా
పతికిం జెప్పవె నుతింతు ప్రస్రవణగిరీ!

724. వనచరమృగంబులార! ఖ
గనాథులార! పరుగెత్తి కరుణామతులై
యినవంశస్వామికి రా
వణకృతసీతాపహరణవార్త దెలుపరే.

725. ఓయి విహంగమరాజ! జ
టాయువ! దశకంఠు గెల్చుట యసాధ్యము వై
హాయసగతి బఱచి తెలుపు
మీ యవమానంబు నాదు హృదయేశునకున్.

జటాయువు రావణు నెదిర్చి మడియుట

726. రామా! లక్ష్మణ! రామా!
సౌమిత్రీ! యని గిరి వ్రజంబులు మ్రోయన్
వామాక్షి యేడ్చుట ఖగ
స్వామి విని జటాయు వంత బఱచెన్ దివికిన్.

727. ఓరీ! రావణ! యెంతటి
ధీరుండవు రాఘవుని సతిన్ జెఱగొని దు
ర్వారుండ నటన్న భ్రమన్
బాఱెదు! పోనిత్తునె నిను బ్రాణంబులతో.

728. వదలుము సీతాదేవిన్
వదలవ యేని దెగటార్తు వజ్రనిభాస్మ
త్పదనఖనాసాదారిత
వదనతనుం జేసి యిపుడ పలలా! తులువా!

729. సకలజగన్నాథుండు హి
తకరుండు దశరథరాజతనయుడు రాముం
డు కృపానిధియున్ వరుణేం
ద్రకల్పుడు హరింతె యట్టి రాముని భార్యన్.

730. ఏ యపకృతి నొనరించెన్
నీయెడ రాముడు? నిజరమణీరక్షణధ
ర్మాయత్తస్వాంతమునన్
దాయల బరిమార్చె నదియు తద్దోషంబే.

731. నరపాలుండవు దశముఖ!
పరదార స్పృశించుట నరపతికిం దగునే?
యరయంగ సతీజనశీ
లరక్షణంబు విహితం బిలాపతి కెపుడున్.

ఈ తులువతనంబున కే
రీతిన్ బాల్పడితి మెచ్చ రీ చౌర్యంబున్
నీతివిదులు గర్హింతురు
దైతేయా! శూరతానిధానులు జగతిన్.

733. జనపతి యధర్మపరుడ
య్యేనేని జనతతియు నట్టులె యగుట తథ్యం
బునిశాచర! కాన ప్రభుం
డనయము ధర్మమె యొనర్చు టావశ్యకమౌ.

734\. లోకమున శుభాశుభముల
కాకరము విభుండు ప్రభుసదాచారమునన్
లోకులకున్ శాస్త్రినవ
లోకితధర్మార్థరీతులున్ దెల్లమగున్.

735\. తనకున్ సాధ్యంబును సుఖ
జనకంబును నై తనర్చు సత్కృతియే సే
యు నరుం డనిశంబు దశా
స్య! నీవు పూనితి వసాధ్య మసుఖకరంబున్.

736\. తొలగవలె నధర్మకృతికి
దొలంగవలె నపయశంబు దుఃఖము గూర్పం
గల దుష్కృతి కెపుడు, రుజా
కలితం బన్నంబు వీడు గతి నరతతికిన్.

737\. యువకుండ వీవు దశవద
న! వృద్ధుడ న్నేను, జనకనందిని గొని పో
వ వశంబె నీకు? గుశలుం
డ వగుచు నే జూచుచుండ నయహీనాత్మా!

738\. అనుచున్ గృధ్రపతి వచిం
చిన హిత వాలింపక దశశీర్షుడు దర్పం
బున మార్కొనె వింశల్లో
చనముల నిప్పుకలు రాల సక్రోధుండై.

739\. ఖగపతియుం బో రొనరిం
ప గడగె, సముద్రగరోషభయదాకృతులన్
గగనమున దోచి రిర్వురు
సగరున్నీలాభ్రయుగ్మసారూప్యమునన్.

740\. దనుజేంద్రుడు పటునారా
చనిచయ మడరింపగా విశాలగరుచ్చా
లనతీవ్రవేగసంభవ
దనిలోద్ధాతము లొనర్చె నభ్రగవిభుడున్.

741\. కులిశోద్యన్నఖతాడన
ములన్ జటాయు వతివేగమున రావణహ
స్తలసత్కార్ముకమున్ బఱి
య లొనర్చి శిరంబు దన్నె నవహాసమునన్.

742\. దనుజుం డెత్తిన బాణా
సనతతి ఖండించి యగ్నిసదృశంబగుత
త్తనువర్మము స్దునిమి స్యం
దనసూతధ్వజఖరవ్రతతి గూల్చె వెసన్.

743\. అలఘుక్రోధము పూని ప
టులాఘవంబున, ఖగవిభుడు, తనువున నఖా
వళిగ్రుచ్చి రేగ పుష్పిత
పలాశముం బోలి మెఱసె బలలాశనుడున్.

744. విరథుడు భగ్నశరాసను
డు, రుధిరసిక్తాంగుడై కడు న్నొచ్చిన యా
శరపతి శాతతరాసిం
గరమున గీలించి కవిసె ఖగపతి నంతన్.

745. వదనముల గోళ్ళ గీఱుచు
బదింబదిగ దాడి సేయు పతగశ్రేష్ఠున్
బదపక్షంబులు ఖండిం
చి దశగ్రీవుండు నిహతు జేసె శితాసిన్.

746. నిహతుండై పుడమి బడిన
విహంగమ పతిం గని విలపించెన్ భూపు
త్రి హృదయ మగలంగ స్వబం
ధుహతిన్ బోలె న్దశవదను డురిమిచూడన్.

రావణుడు సీత నశోకవనమున నుంచుట

747. రక్షింపుము రామ! ననున్
రక్షింపుడు రామ! లక్ష్మణా యనుచేడ్వన్
రాక్షసనాథుడు రావణు
డా క్షితిసుత కొప్పువట్టి యతిరౌద్రమునన్.

748. చంక నిడికొని వఱచె ని
శ్శంకముగ దివికి వనమృగసంచయములు మి
న్వంకన్ జూచుచు బరువిడె
లంకాపతి యేగు దిశ విలాపధ్వనులన్.

749. ఎక్కడ ధర్మము? న్యాయం
బెక్కడ? సత్యంబు గృపయు నెక్కడ? సీతన్
రక్కసుడు కొంచు బోయెడి
నక్కట! యని భూతగణము లాక్రోశించెన్.

750. అనిలుండు నిశ్చలుండ
య్యె నిష్ప్రభుండయ్యె రవి గిరీంద్రంబులు దో
చె నతిక్రుధోగ్రదృష్టిన్
గనుగతి శిఖరద్రుమారుణసుమాక్షితతిన్.

751. దనుజదృఢబాహుబంధ
మ్మున జిక్కి యడలుచు గాంచె భూధరశిఖర
మ్మున జానకి కపు లైదుగు
ర నున్నతకిరీటధారుల మహాబలులన్.

752. తనకున్ సహాయపడ గల
రనుచుం దలచి తనుభూషణావళి నిజకాం
చనచేలాంచలబద్ధ
మ్మొనర్చి పడవైచె సీత యుర్వీధరమునన్.

753. మరణము కోరి యధర్మమొ
నరించుచుంటివి దశానన! నృశంస! వివే
కరహిత! దుర్మద! యనుచున్
ధరణిజ నిందించుచుండ దర్పాంధుండై.

754. తరుణిన్ గొనిచని లంకా
పురమణిసౌధాగ్రభాగమున డించి భయం
కరవికృతాకృతిరాక్షస
తరుణీతతి గాపువెట్టి దశముఖు డనియెన్.

755. ఏమఱుపాటొందక మీ
రీ మానిని గాచుచుండు డెక్కాలము రా
జ్ఞీమాననీయభోగము
లేమేమిప్రియంబగు నవి యెల్లయు నిడుడీ.

756. అనుచున్ ముదల నిడి మహా
రణధూర్వహుల నెనమంద్ర రాక్షసులన్ భీ
జనకోగ్రకాయులన్ బి
ల్చి నితాంతక్రోధసంజ్వలితనేత్రుండై.

757. నరు డొక్కండు జనస్థా
నరాక్షసతతి ఖరదూషణాదుల నస్మ
త్పరమప్రియంకరుల జం
పె రణంబున ఘోరచాపవిద్యాగరిమన్.

758. ఆ నరుని తోడి వైరము
మానస మెరియించుచుండె మానని వ్రణమై
వానిన్ గూల్పన్ వలె నె
ట్లైనను నాకు సుఖనిద్ర యగు నా మీదన్.

759. ధనలబ్ధి సుఖంపడు ని
ర్ధనుండు వోలెన్ సుఖింతు రామున్ వధియిం
చిన పిమ్మట మీ రెల్లరు
చనుడు జనస్థానమునకు శస్త్రకలితులై

760. దానవశూన్యంబగు నా
కాననసీమన్ వసించి కడు జాగృతి నా
మానవు బరికించుచు సం
ధానము సేయుండు త ద్వధ కుపాయంబున్.

761. అనుచు ముదల యొసగె దశా
ననుండు దనుజులు ప్రియంబునన్ బహుశస్త్రా
స్త్రనిచయధారు లగుచు నే
పుననేగిరి శీఘ్రపవయనముల దండకకున్.

762. అతిలోకరూపసంపద
నతిశయ మొందు సతి లభ్య మయ్యె నికన్ దు
ర్మతి రాము గూల్ప జేసితి
జతనం బని రావణుండు సంతసవడియెన్.

763. పిమ్మట కామశరనిహతి
న మ్మనుజాశనపతి జనకాత్మజ కడ కే
గె మ్మదసంభరితస్వాం
తమ్మున విభవప్రదర్శనాసక్తుండై.

764. భీకర మృగమధ్యంబున
నేకాకిగ జిక్కి నట్టి యేణియు బోలెన్
శోకించుచు దీనాకృతి
రాకాసులమధ్య నున్న రాఘవపత్నిన్.

765. వాతహతి మహార్ణవవీ
చీతతి గంపించుచు నవసిన నౌక గతిన్
దైతేయభయవికంపిత
యా తరుణీమణి జనకనృపాత్మజ బల్మిన్.

766. కొనుచేగి రావణుడు కాం
చనోజ్జ్వలమణిప్రభాలసత్సౌధములన్
అనవద్యోద్యానంబుల
మనోహరకుసుమలతాద్రుమాన్వితములన్.

767. తనరారు భవన మెల్లయు
గనగ గలయ ద్రిప్పి వికచకల్హారాబ్జా
తనిచయపరిమళోదా
రనిర్మలోదకసరోవరంబుల జూపెన్.

768. పురవైభవంబు ధారా
ధరస్పృశద్దంతనిర్మితప్రాసాదాం
తరహేమగవాక్షములన్
ధరణీజకు జూపి దశవదను డిట్లనియెన్.

769. ఇంతటి వైభవసంపద
కంతటికి న్నీ వధీశ వౌదువు దశకం
ఠాంతః పురంబు త్వచ్చర
ణాంతికమున సేయు దాస్య మవనిజ! యింకన్.

770. పదికోట్ల రాక్షస వరులు
మ దహాంగాలోకనేచ్ఛ మసలుదు రీ లం
కఁ దరుణి! నా కా పై ని
ర్వదికోటు లఖిలజగన్నివాసు లధీనుల్.

771. రాముడె కా డరయగ సు
త్రాముండును న న్నెదిర్చి ధరణీసుత! ని
న్నోమం జాలండు ననున్
గామించి యథేచ్ఛ సుఖము గాంచుము లంకన్.

772. సరిరాడు నాకు రాముడు
పరాక్రమాదిగుణవైభవంబున సుదతీ!
నరుడు తృణప్రాయుడు రా
జ్యరహితు డేమి సుఖపెట్టు నాతడు నిన్నున్.

773. అనుమానింపంబోకుము
వనజేక్షణ! ధర్మలోపభయమందకు గా
మిను లసమర్థు దొఱగి య
న్యు నొక్కని సమర్థు గొనుటయున్ ధర్మమగున్.

774. నా దశశిరమ్ములు భవ
త్పాదంబులు సోక మ్రొక్కువాడ నిదేః దే
వీః దీనుడ గామార్తుడ
నాదట గైకొనుము తీర్పు మభిలాషంబున్.

775. ఇదివఱ కెన్నండును దీ
నదశన్ దలవంచను భువనత్రయమున నె
ట్టి దురాసదులకు నేనియు
ముదితాః ప్రేమంబు కల్మి మ్రొక్కితి నీకున్.

776. అనుచున్ సుఖప్రవలోభ
మ్మునన్ వరించు నను నాశ పూని యసురుడ
ట్లనగా జానకి యిట్లనె
తృణమంతరితం బొనర్చి దృఢకంఠమునన్.

777. అమరాపగాజలవిహా
రము సేయుచు రాజహంసప్రణయమునన్ సౌ
ఖ్యము సెందు హంసి కన్నె
త్తి మద్గువుం జూచునె కుమతీః యసురపతీః

778. ధర్మం బెప్పుడు దప్పని
నిర్మలచరితుడు దశరథనృపతి సుయశు డా
ధర్మోదాత్తప్రభువున
కర్మిలితనయుండు రాఘవాధిపు డన్నన్.

779. ఒక బాణము తోడన్ దా
టకాసురి వధించె నే పడగ జేసెన్ గౌ
శిక యజ్ఞధ్వంసనకా
రకున్ సుబాహు జలధిన్ బడఁ బెఁ మారీచున్.

780. సురగణదుర్లోకము శం
కరుచాపము చేతనెత్తి ఖండించె మహో
ద్ధరవిక్రముండు రాముడు
పురుషప్రవరుండు నా విభుడు దుర్జయుడున్.

781. తునిమె ఖరదూషణాదుల
రణంబునం దా నొకండె రాఘవుడు శరా
సనమాత్రసహాయుడుగా
వినుము పలాశ! పదునాల్గువేలు త్వదసురుల్.

782. అట్టి మహావీరున్ జగ
జెట్టిన్ శ్రీరాము సరకు సేయవు తులువా!
పుట్టె జెడుబుద్ధి నీకున్
మిట్టిపడె దరయవు కీడు మే శ్చెట్టివియో.

783. అనవరతధర్మతత్పరు
జనహితకార్యరతు నిత్యసత్యవ్రతు శాం
తు నుదారచరితు నాపతి
ఘనవిక్రము రాము బోలగలవె! దురాత్మా!

784. పతి చెంత లేని యెడ నా
గతి జెఱవట్టితివి నన్ను గపటాకృతి దొం
గతనము సేసియు వీరుని
గతి నాడెదు సిగ్గులేదా! కాపురుష! ఖలా!

785. ఖరసహవాసంబునకున్
ద్వర జనియుండు దరిభంజనపరాక్రమభా
సురుడౌ నావతి యాశ్రమ
ధరనుండినయేని నాడు ధైర్యవిహీనా!

786. నీ కాయువు మూడినదియ
కా కీ నీచపు బని కొడిగట్టుదువే! లో
కైకప్రభుండు రాముడు
రాకన్మానండు నీ శిరంబులు ద్రుంపన్.

787. కేవలత్వగస్థిమాంసా
స్రావాలశరీరరక్షణార్థము గాగన్
నే వగవ శీలరక్షణ
కే వగచెద దిందువా! తెగనేసెదవా ననున్

788. అనినన్ గనలున రావణు
డనె బలవంతంబు సేయ నాసింప యథే
చ్ఛ ననున్ వరించి నీవై
నను జేరంగా వలె శయనసుఖమ్మునకున్.

789. విను మిక తుదిమాట వచిం
తును మైథిలిః గడు వౌసంగుదున్ బదియున్ రెం
డు నెలలకాలము నను జే
రనిచో ఖండింత్రు ప్రాతరశనార్థముగన్.

790. అనుచున్ మహిన్ విదారణ
మొనరింపం జూచు పగిది నుగ్రచరణతా
డన మొనరించి దశాస్యుం
డనె నికటస్థితనిశాచరాంగనల కిటుల్.

791. ఈ కమలదళాక్షి గొని య
శోకవనాంతరమునన్ గుసుమిత తరుచ్ఛా
యాకలితహిరణ్మయవే
దీకమనీయస్థలికి బదిలముగ జనుడీ.

792. వరు లెవ్వరి కంటం బడ
క రహస్యము గాగ మీరు కాపుండుడు నా
దటి జేర్చుటకున్ యత్నమొ
నరింపుడు ప్రియోక్తితర్జనంబుల చేతన్.

793. అన నట్లు సేసి రయ్యం
గనలు మహీతనయయున్ సుఖంబున్ గన లే
క నితాంతదుఃఖవశయై
యనారతంబున్ దలంచు నాత్మేశు మదిన్.

శ్రీరాముడు సీతను గానక విలపించుట

794. మారీచకృతాలాపము
లా రాఘవు డాలకించి యాశ్రమ వనికిం
జేరంగ వె న్దిరిగె శం
కారూఢమనస్కు డగుచు నతిశీఘ్రముగన్.

795. ఇది రాక్షసమాయ చనవ
ల దంచు వాక్రుచ్చె నాకు లక్ష్మణుడు పదిం
బదిగ విననైతి, నే యా
పద వాటిల్లినదొ! దానవావళిమాయన్.

796. హా సీతా హా లక్ష్మణ
హా సీతా యన్న రాక్షసాలాపములన్
గాసిలితి నేమొ నే నం
చా సౌమిత్రిన్ ద్వరపడి యంపిన దేమో.

797. చూతునా లేదొ! యుటజమున
శీతాంశుముఖిన్ జనకజ సేమముమై యా
నాతి మృదుమందహాస
స్ఫితాధర యగుచు గానుపించునా లేదో!

798 అని శంకించుచు వడివడి
గ నడుగులిడి మఱలుచుండగ నెదుట గాన్పిం
చె నధిజ్యచాపమున ల
క్ష్మణుండు భయసంభ్రమాత్తచండగమనుడై.

799. తమ్ముడ! యేటికి వచ్చితి
విమ్మెయి నాపలుకు ధిక్కరించి జనస్థా
న మ్మతి ఘోరాశరనిల
య మ్మగు నొంటరిగ వీడ నగునె? జనకజన్.

800. రక్కసు లే మొనరించిరొ!
య క్కమలదళాయతాక్షి యాశ్రమమున దా
నొక్కతె యే యిడుమల బడి
స్రుక్కెడినొ! హృదయము చెదఱుచున్నది నాకున్.

801. ఎన్నిగతుల దర్కించిన
న న్నవోత్పలదళాక్షి యాశ్రమపద మం
దున్నట్లుగ దోపదు నా
కన్నియు దుశ్శకునము లెదురౌ సౌమిత్రీ!

802. ఎడమభుజ మదరుచున్నది
వడిగ నెడమకంటితోడ వాయెత్తుచు జూ
చెడు భాస్కరువంక బరువు
లిడుచున్ బశుపక్షిచయము లివె దీనములై.

803. భక్షించెనొ దనుజావళి
భక్షించినవో మృగములె పాటలగంధిన్
నీక్షాత్రంబును నమ్మి మృ
గాక్షిం గోల్పోతి నిట్టు లనురాగవతిన్.

804. వనముల దో డగుదు నటం
చ న న్ననుగమించి వచ్చె సుచరిత్ర మహీ
తనయన్ గాచుకొనగ జా
లనైతి, ద ద్విరహమోర్చి బ్రదుకంగలనే.

805. కైకేయి వాంఛ తీరున్
సాకల్యము కోసలాత్మజాత యికన్ దీ
నాకృతి దాస్య మొనర్చున్
గైకేయికి నేకపుత్రకవినాశారిన్.

806. ఎంతటి విప్రియ మొదవెన్
జింత దురంత మగుచుండె సీతాకాంతా
కాంతాననంబు గాంతున్
సంతసమున నన్న యాశ సమసె హతవిధీ!

807. అనుచున్ విలాప మొనరిం
ప నగ్రజుం గాంచి దీనవదనుండై ల
క్ష్మణు డిట్లనె నుచితజ్ఞుడ
వు నయవిదు డవఖిలవేత్తవు జగత్పతివిన్.

808. నీ వెఱుగ నట్టి యర్థం
బావంతయు లేదు రాక్షసాలాపము భీ
త్యావహమై వినబడ నిన్
గావం బొమ్మనియె భూతనయ నన్ను వడిన్.

809\. వివరించితి నెంతయొ నీ
దు విక్రమోదారమహిమ ధూర్తనిశాట
ప్రవికల్పితమాయ యటం
చు వినిచి మారీచు డంటి సుస్పష్టముగన్.

810\. భవదాజ్ఞావ్యతిరేక
ప్రవర్తనము సల్ప నంటి వనమున దన్నాం
టి విడిచి పో నంటిన్ గా
ని వినదు వైదేహి నాదు నిర్మలహితమున్.

811\. దారుణవచనము లెన్నొ క్రు
ధారుణనేత్రముల బల్కి తనపై వాంఛా
కారణముగ జన నంచున్
నేరారోపణ మొనర్చె నిర్దయురాలై.

812\. తనపతితో మిత్రాకృతి
వనికిన్ వచ్చిన రిపుండ వన్నది నను రా
ముని మృతి కోరుదు వన్నది
సునిశితవాక్యమ్ముల నెద సూడినది కడున్.

813\. ఆ పలుకులు వినజాలక
కోపము దుఃఖంబు నాపుకొనజాలక సం
తాపమ్ము జెంది వచ్చితి
నీ పగిది భవన్నిమిత్త మే నవశుడనై.

814. అనినన్ రాఘవు డిట్లనె
ననుజ! యనాలోచితముగ ననుచితకోపం
బును బూని యకృత్యము సే
సినాడవు తలకగజన్నె! స్త్రీవచనములన్.

815. చెంతన్ దొరకియు దొరకక
యెంతో దూరము చని యలయించె మృగము తీ
క్ష్ణాంతశరం బేసితి నే
నంతన్ గూలె నది యసురుడై యఱచి మహిన్.

816. దనుజు నఱపుల్ వినిన యం
తన శంక జనించె నాపద ఘటిల్లు నటం
చును ధ్రువపడె నా కయ్యది
నిను గాంచినతోడ ననుజ! నెమ్మది కలగెన్.

817. మనతోడి పగం బూనిన
దనుజావళికిన్ లభించె దరుణము పగ దీ
ర్ప ననువుగ నీ వొనర్చిన
యనుచితకార్యంబు కతన ననుచు వడివడిన్.

818. దరిసె నుటజంబు సీతా
విరహితమై యుండె నద్ది విధ్వస్తాబ్జా
కరమట్లు జీవవిరహిత
శరీరముం బోలె శిథిలచైత్యం బనగన్.

819. తరువుల్ విస్రస్తప్రస
వరాజి వికలమ్ము లయ్యె వనదేవత లె
ల్ల రదృశ్యలైరి దర్భా
స్తరణమృగాసనములున్ జెదరె నల్గడలన్.

820. భీరువు ధరణీసుత రం
భోరువు సీత మనుజాశనోత్కరమున కా
హారం బయ్యెనొ చనెనో
నారీ ప్రియకరసుమహరణార్థ మెచటికేన్.

821. అనుచున్ గలవరపడుచున్
జని రాముడు లక్ష్మణుండు జానకి జాడన్
గన సంశోధించిరి త
ద్వన తరు గిరికందర స్రవంతీ స్థలులన్.

822. వెదకినదే మఱలమఱల
వెదకుచు చూచినదె మఱల విసుగందక చూ
చి, దరుల సానువులన్ బూ
పొదరిండ్లన్ వెదకిరి చలమున భూమిసుతన్.

823. పుడమితనయ కన రా దె
య్యెడ నేనియు ధృతిసడలగ నేడ్వ దొడగె రా
ముడు విరహోత్కంఠుండై
యడలుచు దరుమృగవిహగగణాలోకమునన్.

824. ఓసి కదంబావనిజమ!
నీ సుమము లటన్న నాదు నెచ్చెలి యా భూ
మీసుత కెక్కువ మక్కువ
ఆ సుందరి గంటివ! యెటకరిగె? తెలుపుమా!

825. ధరణీసుత నాహృదయే
శ్వరియగు ద్వ్రాత్కాండసన్నిభము లామె తొడల్
ఎఱుగుదు వా మగువ కకుభ
తరురాజమ! తెల్పు మామె దాగిన చోటున్.

826. పీతాంబరంబు తాల్చెన్
సీత కుసుమకోమలాంగి నీ కగపడెనే
యా తన్వి బిల్వమ! తెలుపు
మా? తావకఫలసదృశము లామె కుచంబుల్.

827. అలికులకలగానము మం
జులమగు నీచెంత నిన్ను జూడంగా నా
యలివేణి సీత వచ్చెన!
తిలకతరువ! ఆమె జాడ తెలుపుమ? నాకున్.

828. శోకించుచుంటి నా సీ
తాకాంతన్ గానలేక తత్స్రుతి జాడన్
నాకున్ దెల్పి యశోకమ!
శ్రీకరముగ సార్థకాఖ్య జెలగుమ! జగతిన్.

829. ఓతాళవృక్షమా! నా
సీతం జూచితివ! సంతసింతు నెద న్నీ
వా తరుణి జాడ దెల్పిన
గాతరమతి దిరుగుచుంటి గానన మందున్.

830. సతతము కుసుమవ్యామో
హితయై నీకడ బరిభ్రమించున్ భూమీ
సుత కర్ణికారమా! సువి
దిత యాయమ నీకు, జాడ దెలుపు మెఱిగినన్.

831. జంబూభూజమ! నీదుఫ
లంబుల్ బలె భూమిజాత లలితస్నిగ్ధాం
గంబు లెసగు దా నెట వో
యెం బల్కు మెఱుంగుదేని హితమగు నాకున్.

832. మాకందార్జుననీవమ
ధూకపనసతరువులార! తోయజనేత్రిన్
గైకొని యెవడైన పఱచె
నా! కాన్పింప దుటజమ్మున ద్వర దెలుపుడీ.

833. జాతీ! మాధవి! మల్లీ!
కేతకి! చంపక! లతాంగి గిసలయపాణిన్
సీతన్ గనినారలె మీ
రే తెరువున బోయెనా వచియింపుడు ప్రీతిన్.

834 ఎన గమనమ్మున నీకున్
జనకాత్మజ గానవా? గజవరేణ్యా! ననున్
గనుమొఱగి పోయె నెటకో
కనరాదు వనమున నెంతగా వేసరినన్.

835. ఖచరవరములార! విరహ
విచలితమానసుడ నశ్రుపిహితేక్షణుడన్
సుచరిత సీత కనంబడ
దెచటన్, మీరైన నిశితదృష్టిం గనరే.

836. ఈ తరుగజద్విజలతా
వ్రాతంబులు సీత జాడ బల్కవు హరిణం
బా! తెలుపు మా మృగాక్షియు
మీతోడి మృగతతి గూడి మెలగెడి నేమో.

837. పరిహాసము సేయుటకున్
ధరణిజ! పరుగెత్తి పోయి దాగుకొనెదవా?
తరుగుల్మద్రుమములయు పొ
దరిండ్ల మాటున నిలునిలు తరళాబ్జాక్షీ!

838. ఎదుటకు వచ్చి నిలంబడ
క దూర దూరంబుగ దొలగం గతమేమో
సుదతీ! నీవు ధరించిన
దదిగో పీతాంబరం బహహ! కాననగున్.

839 ఇంతటి యుపేక్ష సేయుదె!
కాంతా! ఎటు సైపనేర్తు గనర మ్మిక నీ
స్వాంతంబున దయతప్పెనా!
యింతీ! నామీద ప్రేమమే వీడితివో!

840. నిను గనజాలక నీదు వ
దనోదితమధురవచస్సుధాపానమునం
దనియక జీవింపంగల
నె! నామనోహరి! ధ్రువంబు మృత్యువు నాకున్.

841. అయ్యయొ లక్ష్మణ! జానకి
నెయ్యెడలం గానకుంటి నే మొనరింతున్
దయ్యపు రక్కసు డెవ్వడొ
య య్యవనిజ గొంచు జనెన! యసువుల్ గొనెనా.

842. వనవాసాంతము సేయక
యె నేను దివికింజనిన బితృవరుడు నిందిం
చు నసత్యభాషణుడ వొ
మ్మని తమ్ముడ! యే మొనర్తు మైథిలి గనగన్.

843. జనకుని యింటనొ! నాదు జ
నని కోసలతనయ రక్షణంబుననో యుం
డిన జీవించెడి దానవు
వని కరుదెంచినది వలలువాత వడుటకా.

844. అనుచున్ బరిపరి విధముల
మనోవ్యథాపీడనమున మహితాత్ముం డ
య్యును నేడ్చె రాము డున్మ
త్తుని బోలెన్ జానకీ! విధుముఖీ యనుచున్.

845. అంతన్ లక్ష్మణు డిట్లనె
జెంతన్ జేరి కరయుగము జేబూని, యిటుల్
వంతం జెందెద వేటి క
నంతమ్ముగ బ్రాకృతనరు నట్లుగ రామా!

846. అచలస్థిరమూ ర్తివి నీ
వు చరాచరభువననేతవు సమ స్తరిపు
ఘ్నుచణుండవు సర్వసమ
త్వచిరయశస్వివి కలంత బడ ధర్మంబే.

847. గిరిసానువిహారార్థం
బరిగెనొ! తోయావగాహనార్థము నదికే
యరిగెనొ! విహారకా వాంఛన్
ధరణిజ క్రీడార్థ మెచటదాగుకొనియెనో.

848. వనపర్వతసానుదరీ
వనజాకర గౌతమీస్రవంతీపులి నౌ
ఘ నయన మనోజ్ఞ బహుకుసు
మ నికుంజవ్రతతి నప్రమత్తుల మగుచున్.

849. వెదకిన గానబడక పో
వ దవనిజ ప్రయత్నలోపవర్తనమున నే
మొదవగలదు? సర్వాన
ర్థదాత్మనిర్వేదమేల? ధైర్యము గొనుమీ!

850. నిజముగ రక్కసు డా జన
కజన్ హరించి చనెనేని కార్ముకదీవ్య
ద్భుజుడవు ని న్నెదురం గల
దె జగత్త్రియము విడిపించి తెత్త మురవడిన్.

851. అనుజుం డిట్లనగ బ్రశాం
తినంది రాఘవుడు చిత్తధృతి బూని ప్రశో
ధన మొనరించెం దత్కా
ననప్రదేశంబు లక్ష్మణాన్వితు డగుచున్.

852. తరువుతరువు జూచిరి చూ
చిరి శైలదరీనదీవిచిత్రపులినముల్
విరిపొదరిండ్లున్ జూచిరి
పరిభ్రమించుచు సమస్తవనదేశమునన్.

853. సీతా! యెచ్చట నుంటివి?
సీతా! బదులాడవేమి? చెవిబడదో! భూ
జాతా! నాపిలు పనుచున్
నాతీ! కాన్పింప వేమి నా కీ వనుచున్.

854. రాముడు పిల్వగ నచటన్
భూమీధరముల ప్రతిధ్వనులె కానీ క
ర్ణామృతమై విన రా దా
భూమీతనయగళరావ మోహో యనుచున్.

855. నిరతాన్వేషణపరులై
యరుగుచు గాంచి రొకచోట నవనిన్ విధ్వ
స్తరథధనుస్తూణము లా
భరణాంచితసూతదేహబాహుశిరంబుల్.

856. రణనిహతపిశాచముఖ ఖ
రనిచయముం దోచె, నాభరణశకలములున్
గననయ్యె నచ్చ టచ్చట
వనస్పతిచయంబు గానబడె భగ్నంబై.

857. కనుమివి లక్ష్మణ! యిచ్చోట
రణచిహ్నంబులు గనబడు ర మ్మివిగో యీ
ఘనకర్కశపదముద్రల్
గను మివి మృదుపాదరేఖలం బడి చనెడున్.

858. ఈ సుకుమారచరణరే
ఖాసముదయ మిది మదీయ కాంతాపదవి
న్యాసం బగు సౌమిత్రీ!
నా సీతన్ దఱిమిపట్టి నా డిట నెవడో.

859. ఈ విరులదండ లీ మణి
సౌవర్ణాభరణజాలశకలంబులు సీ
తావనజేక్షణ తాల్చిన
వావంతయు లేదు సందియం బిందనుజా!

860. సమరం బిచ్చోట బ్రవృ
త్తమైన యట్టు లనిపించు దారుణముగ నా
కమలేక్షణకై పోరిరి
సమసె నొకం డెవ్వడొ! జయసంయుతు డెవడో!

861. ఆ తన్వి సీతయే యగు
నో తమ్ముడ! కొంచుబోయెనో ప్రాణముతో
శాతాయుధంబు చేతన్
మై తెగనేసెనొ! యసురుడు మాంసార్థముగన్.

862. ఎవ్వడొ ముష్కర రాక్షసు
డవ్వరవర్ణిని వధించి యాహారముగా
గ్రొవ్వి భుజించియ యుండున్
రవ్వయు సంశయము లే దరయ సౌమిత్రీ!

863. నవపల్లవకోమల దే
హ విదేహాధిపుతనయ మహాకర్కశదా
నవు నసి కెఱయైనపు డెం
త విలాపము సేసెనొ! మది నన్ను దలచుచున్.

864. ఫలపుష్పార్థము కానీ
జలావగాహంపు గోర్కి స్వాంతంబున దీ
గెలుసాగిన గానీ యా
కలకంఠి బయల్వెడలిన గనపడరాదే.

865. అనురక్త సుధామధుర
స్వన, ధర్మాచారనిరత సాధుహృదయ స
జ్జనుతశీల మహితస
ద్గుణాన్విత మహీసుత చెడుగుం బడె నయయో.

866. జానకి లభింపకుండగ
నే నెట్టు లయోధ్య కేగ నేర్తున్ సౌమి
త్రీ! నా తల్లులకు సమా
ధానం బేమందు నేది ధాత్రిజ యనినన్.

867. వనవాసపు టిడుమల కో
ర్చి నిరాయాసముగ బురికి సేరె నని ముదం
బున గూతు జూడ వచ్చెడు
జనకవిభున కెట్లు చూపజాలుదు మోమున్.

868. పరు లెవ్వరో ప్రియసతి నప
హరింప రాముండు వచ్చె నవనీతలమున్
బరిపాలింపగ నొక్కడు
పరాక్రమవిహీను డంచు ప్రజలు న్నగరే.

869. పురికిన్ రాను జనను స్వః
పురంబునకు నేని యనుజ! భూమీతనయా
విరహితుడనై, రయంబున
నరుగుము పురి కీవు సౌఖ్య మందుదు వీవేన్.

870. భరతున్ సమాదరంబున
బరిష్వజించి తెలుపుము శుభంకరముగ రా
జ్యరమం గొను మ న్నానని
పరమోదారుండు వాడు బహుధార్మికుడున్.

871. జనయిత్రీతతికి శిరః
ప్రణామముల్ సేసి తనుము వ్రతనియమాచా
రనిరత నాదుజనని వృ
ద్ధ నోము మాదర మెసంగ దనయవిహీనన్.

872. క్షితిరాజ్యసంపదం బా
సితి, దూరం బైతి బుణ్యశీల జననికిన్
మృతిజెందె తండ్రి కోల్పో
యితి బ్రియసతిసీత జెల్లె బుణ మిక క్షితితో.

873. ఉడుగక పూర్వభవంబుల
గడుంగడు నఘంబు లెన్ని కావించితినో
పడయుచునుంటిన్ ఫల మి
ప్పుడు కష్టము లెల్ల నొక్కమొగి ముసరుకొనన్.

874. సకలజగచ్చక్షువు నీ
వు కర్మసాక్షివి జగత్ప్రముఖుండవు నా జా
నకి యే మయ్యెనొ? రవిదే
వ! కృపన్ నీ వైన దెల్పవ! శుభము వడయన్.

875. అనిలమహాదేవ! జనక
తనూజ కన్పడుటలేదు తద్దయు నెరియున్
మన మఖిలవ్యాపక! జీ
వనానిలము నిల్ప దెల్పవా! సతిజాడన్.

876. గిరితెల్పలేదు గోదా
వరియుం దెల్పదు హితముగ వనదైవతముల్
దరులుం దెల్పవు వైయ
చ్చరవరులుం దెల్ప రింక జానకి జాడన్.

877. ధర్మపరుల రక్షించున్
ధర్మం బందు రనవరతధర్మవ్రత నే
ధర్మము రక్షించె జెపుమ!
కర్మాధీనంబు బ్రతుకు కాదె! నరులకున్.

878. దైవతకోటికి సమ్మో
దావహముగ రాక్షసవధకై పూనితి నా
దేవత లెల్ల గృతఘ్నులు
కావం జూడరు మదీయకాంత నిడుమలన్.

879. గుణసంపన్నత శాంతుం
డ నై చరించుట దివిజగణ ముపేక్షాభా
వన జూచు నన్ను నిర్వీ
ర్యునిగాగం దలచి గుణ మయోగ్యం బయ్యెన్.

880. ఈ దైవతాళి నిక సుఖ
మోదంబుల జెంద నీను బుణ్యసతీర
క్షాధర్మమున్ ద్యజించిరి,
నాదగు శౌర్యప్రదర్శనం బొనరింతున్.

881. జీవముతో నిపు డస్మ
జ్జీవనసుఖహేతుభూత సీతాతన్విన్
నావంకకు దేరేనిన్
గావించెద భూతవిదళనంబుగ్రముగన్.

882. పఱపెద ద్రుళ్ళదగంగా
సురతతి, భస్మంబు గాగ స్రుక్కింతు ధరా
ధరతారకాసహితమీ
చరాచరాఖిలజగంబు సాయకవహ్నిన్.

883. గిరులన్ ధరగూల్చెద సా
గర మింకించెద నఖిలజగజ్జనతాసం
హరణం బొనరించెద శశి
తరణిగ్రహగతులు బాపెదన్ జూడుమికన్.

884. అనుచు మహోగ్రక్రోధం
బున దాలోత్తాలచాపమున్ సజ్యముసే
సి నిశాతభల్లముం బూ
ని నిల్చె లయకాలరౌద్రనిర్భరమూర్తిన్.

885. ఆ రీతి రాముడు ధను
ర్జ్యారావము భూనభోంతరవ్యాప్తముగన్
బారగ జేయుచు జేతన్
గ్రూరాస్త్రము బట్ట లక్ష్మణుండి ట్లనియెన్.

886. రామ! శమింపుము జగదభి
రామాకృతి వెలయు నీవు రౌద్రాకృతివై
తామస మూన భయంపడి
యే మెయి వడకెడినొ? చూడు మీ మహియెల్లన్.

887. నీవు జితేంద్రియు డవరయ
నీవు సమస్తభువనహితనిష్ఠితమతివిన్
నీవు మృదుస్వాంతుడ వి
ట్లావేశము బూన భావ్యమగునా? అన్నా!

888. సకలజగద్వ్యాప్తి యనిలు
నకు, దుస్సహతేజము దిననాథునకున్, ధా
త్రికి క్షమ, దలప, సుధాకరు
నకు జల్లని వెన్నెలయును నైజగుణంబుల్.

889. ఆ నిఖిలవిశిష్టగుణవి
తానము మూర్తీభవించె ధార్మికవర! రా
మా! నీయం దసదృశముగ
మానితతత్సగుణలుబ్ధ మఖిలజగంబున్.

890. దివిజేశ్వరు డైన బురా
భవకర్మాధీనుడె యగు ప్రారబ్ధమె హే
తువు సుఖదుఃఖంబులకున్
వివశుండు నరుం డటంచు నీవ తెలుపవే.

891. చనుదెంచె నొకండె రథం
బున నిచ్చటికిన్ జమూసమూహంబులు వ
చ్చిన జాడదోప దా యొ
క్కనికై భువనవిలయం బకార్యము కాదే.

892. సీతమ గొనిచనె ధర్మా
పేతుడు క్షుద్రుం డొకండు బిశితాశుడు దు
ర్నీతిన్ జగంబు సమయం
జూతు నటందు వది తగునె? సూర్యకులవిభూ.

893. ఒక్కని యపరాధమునన్
బెక్కుర శిక్షించు టదియు నృపనీతియె? పెం
పెక్కునె యశంబు? పాపము
దక్కు, యనపరాధజనవధామూలమునన్.

894. ఎవడు దురాత్ముండై నీ
యువిదన్ హరియించి చనెనొ: యుగ్రంబుగ నె
త్తి వధింపుము వాని యశం
బువచ్చు గాంతయు లభింప బోలున్ దానన్.

895. వనపర్వతదుర్గనదీ
జనపదదేశ మఖిలంబు జరియించి గవే
షణ సేసి రామ: యాపై
నొనరింతము గాక మదికి నొప్పగు దానిన్

896. పుడమిసుత జాడకై నీ
వడుగంగ బఱచె మృగాళి యామ్యదిశన్ దా
ముడుపథముం జూచుచు బల
లు దేగె నద్దిశ ననుచు దెలుపు చందమునన్.

897. దనుజనిలయంబు నైఋతి
యనం బ్రసిద్ధంబు ద ద్దిశాభిముఖముగా
జనిన గనవచ్చు జానకి
యనుచు న్నా మదికి దోచు నన్నా యనినన్.

898. రాముడు ప్రశాంతి చొప్పడ
గా మది క్రోధంబు వీడి కార్ముకపాణిన్
సౌమిత్రి గూడి చనియెన్
రామామణి వెదక బూని నైఋతి దిశగన్.

899. ఆ గతి నన్వేషించుచు
నేగంగ గరు(దహితమహీధరమొ యనం
గా గన్పడె భూమిగతుం
డై గృధ్రవిభుడు జటాయు వ(స్రాంగమునన్.

900. ఎవడొ మహాకాయుడు తా
(మవర్ణదేహుం డొకండు రాక్షసు డేమో
యవరజ! కను మంచున్ రా
ఘవుండు సజ్యంబు సేసె గార్ముకము వడిన్.

901. దనుజుండ గాను రామ! గృ
(ధనాథుడ జటాయువేను ధరణీసుత రా
వణు డపహరింపగ నెదు
ర్కొని భగ్నము సేసితి ద దురుస్యందనమున్.

902. సారథి ఖండించితి దూ
ణీరము విల్లునిమితిన్ దునియలై పడగా
వారువముల గూల్చితి, దుది
ధారుణి బడితి నలసి నిశితకృపాణహతిన్.

శ్రీరాముడు జటాయువున కపర(క్రియలు సేయుట

903. అనుచుండ రాముడు శరా
సనంబు బడవైచి, య(శుసంచయపిహితే
క్షణు డగుచుం బరుగున దా
పున కేగి కవుంగలించి పొక్కుచు ననియెన్

904. ఏమీ! దశవదనుండా
నా మైథిలి గొంచు బోయినది పతగవిభూ!
మో మెట్లుండె? ధరాసుత
యే మన్నది! దుష్టదనుజహింసావిలయై.

905. రావణు రూపం బెయ్యది
యావాసంబు బలవిక్రమాదులు తెలియం
గా వివరింపు ఖగేశ్వర!
నా వనిత లభించి పొసగునా? సౌఖ్యంబుల్

906. అనినన్ జటాయు వనె నా
యన! సుఖపడె దీవు కొందు వవనీసుత రా
వణదైత్యం గూల్చి జగ
జ్జనప్రస్తుతిపాత్రముగ విచారము విడుమా!

907. విందం బనెడు ముహూర్తం
బందున్ గొని పోయె రావణాసురుడు మహీ
నందిని తత్సుముహూర్తము
జెందించు న్నష్టవస్తుసిద్ధి నరులకున్.

908. గాలము మ్రింగిన చేపయ
వోలెన్ రావణుడు కూలిపోవుట తథ్యం
బాలం బందున దిగులున్
జాలింపుము రామచంద్ర! జానకి. కొఱకై.

909. అనినన్ రాఘవు డనె ల
క్ష్మణు జూచి మహాత్ముడీ ఖగవిభుడు పడియుం
డె నిక్క త్తగరుద్వయుడై
తనువెల్లయు శోణితంపు ధారలు గ్రమ్మన్.

910. జనకజ గావం జన నీ
తని కీ స్థితి బట్టె దైవత సదృశు డనఘుం
డనుజా! నా కుపకృతి బూ
నిన వారును గీడ్వడుదురె నిర్భాగ్యుండన్.

911. నను దహియించెడు శోకా
గ్ని నిరంతమ్ముగ మహాబ్ధికిన్ బోయి మునిం
గిన నయ్యది శోషిల్లెడు
ననుజా! నిక్కం బనుచు మహాదుఃఖమునన్.

912. ఖగపతి కిట్లనె దంద్రీః
పగవాడు చెఱగొని నట్టి పడతికి నై నె
వ్వగ బడుదున! యాపద బా
పగ వచ్చిన నీదు నిడుమ వంతబడుదునా.

913. పలుక గల వేని నా మై
థిలి యెటు లున్నదొ వచించి దివిజరిపునకున్
నిలయం బేదియొ దానిన్
దెలుపు మనగ న వ్విహగపతి ప్రయత్నమునన్.

914. నోరు దెఱచి రామవిభుః కు
బేరావరజుండు వాడు విశ్రవససుతుం
డా రావణు డని యాపై
నేరక తలవాల్చె నోట నెత్తురు గారన్.

915. మృతు డైన జటాయున కవి
రతముగ దుఃఖించి యుత్తరక్రియలెల్లన్
బితరున కట్లుగ దీర్చి నృ
పతిసుతు లరిగిరి జనకనృపాత్మజ నరయన్.

కబంధశాపమోక్షణము

916. శరచాపధారు లై యరి
గిరి రాముడు లక్ష్మణుండు గిరికాననని
ర్ఝరములు సరోవరంబుల్
తరించి చేరిరి భయప్రదక్రౌంచవనిన్.

917. ఇనరశ్మియుం జొరగ రా
క నభోమార్గావరోధకమ్ముగ దరుగు
ల్మనివహములున్ లతాదులు
బెనగొని కనుగానరాని విపినం బందున్.

918. శ్రవణకటుభీషణమ్ముగా
రవంబులు దిగంతరాళరణితంబులుగా
నవధానమతి జనుచు దా
మవలోకించిరి తమోమయ మ్మొక్క గుహన్.

919. ఆ ధరణీధరకందర
శోధనమున్ జేయుచు జనుచో మాంసాస్రా
స్వాదన మొనరించుచు వికృ
తోదరనాసావదన యయోముఖి యనగన్.

920. దనుజాంగన యొక్కతె ల
క్ష్మణుం దరియ నేగుదెంచి కరము నిజకర
మ్మున బట్టి పల్కె సరస
ప్రణయవిహారం బొనర్ప రమ్ము సుఖముగన్.

921. గిరినిర్ఝరపులిన ప్ర
స్థరమ్యవికచప్రసూనతరువేదికలం
దు రమింతము గాక పురుష
వర! జీవితశేషకాలపర్యంతంబున్.

922. అనుచున్ దొందర సేసెడు
దనుజాంగన హస్తమున్ వదల్చుకొనుచు ల
క్ష్మణు డాయమ బొమ్మని చె
ప్పినను‌న్ బైపైకి రా గుపితమానసుడై.

923. ఉరునాసాశ్రవణపయో
ధరముల ఖండించె నస్రధార లొలుక నా
శరియు బఱచె నేడ్చుచు దు
ర్భరబాధన్ శైలగహ్వరంబులు మ్రోయన్.

924\. దనుజ తొలగిచని నంతన్
జనిరి మతంగాశ్రమము దెసన్ రాముడు ల
క్ష్మణుడున్ దద్విపులమహా
వనాంతరచరన్మదద్విపాలోకమునన్.

925\. అరుగుచు నొకచో దీన
స్వరమున నన్న కనె నిట్లు సౌమిత్రి, నిరం
తరజాగరూకుడ వగుము
పరంతప! మనంబు నాకు భయలోలమగున్.

921\. అగపడు నాపద సూచక
ముగ నిట బహుదుర్నిమిత్తములు, కంపించున్
మిగులగ వామభుజనయన
యుగంబు సిద్ధపడు మేదియొ యనర్థ మగున్.

927\. ఐనను జయంబు మనకే
యౌ ననిపించు వకుళద్విజారవము వినం
గా ననుచు నేగుచుండన్
దానవభుజబంధనంబు దాపుర మయ్యెన్.

928\. దనుజదృఢబాహుబంధ
మ్మున జిక్కిన లక్ష్మణు డనె ముష్కరపలలా
శనబాహుబద్ధుడన్ రా
మ! నేరకుంటి న్విడివడుమార్గం బకటా.

929. దనుజుడు ధరాధరోన్నత
తను డురువక్షుండు నిశితదంష్ట్రిండున్ యో
జనదీర్ఘ బాహువు ప్రదీ
ప్తనేత్రవక్త్రింబులు గనబడు నుదరమునన్.

930. శిరమును బదముల్ గనరా
వరయగ బాహాగ్రసితము లైన మృగము లో
గిర మగు నీ రాక్షసు ను
ద్ధురతన్ మాన్పంగ వెఱవు తోపదు మదికిన్.

931. దానవకరబంధన మీ
వైన దొఱగి పాఱిపోయి యగ్రజ! యెట్లో
ప్రాణము రక్షించుకొనుము
భూనాథుడ వగుచు నోముము ప్రజావితతిన్.

932. మనమున దలంచుచుండుము
నను నీ భక్తు నెపుడైన నా కయ్యెదె చా
లును, సేమంబుగ జను మీ
వు ననున్ బలియిచ్చి దనుజభూతంబునకున్

933. అనినన్ రాఘవు డనె ల
క్ష్మణ! లోకశ్లాఘ్యవిక్రమాన్వితుడవు చె
ల్లునె నీ కిట్లన, ధైర్యం
బును గోల్పోవ కరయుము సముచితప్రతికృతిన్.

934. ఏకాలంబున కెయ్యదొ
నాకులకున్ దెలియ రాదు నరులేటికి? యే
లోకంబుల వారును గా
నీ కాలాధీను లగుట నిక్కం బరయన్.

935. కూలుదు రెంతటి ప్రతిభా
శాలురె యైనన్ నరు లనుజా! లోకమునన్
గాలప్రవాహమున బడి
వాలుక సేతువుల వోలె బ్రాభవ ముడుగన్.

936. మన మే మగు వారమొ యీ
క్షణచాచరు డేమి యగునొ! కాలమె సర్వం
బును నిర్ణయించు సౌమి
త్రి! నిరాశం జెందకుము ధృతిం గొను మింకన్.

937. అనుచుండన్ బిశితాశను
డనియె వృషస్కంధులున్ మహాఖడ్గశరా
సనధారు లీర లెవ్వరు
వనమ్మున భ్రమింతు రేల పలుకుడు నిజమున్.

938. మిము రక్షింపగ నొపవు
సుమి యాయుధముల్ క్షుధార్తి సుళ్ళెక్కెడి నాకున్
సమయానుకూలముగ ల
భ్య మైతిరి భుజింతు నిపుడె యాకలి తీరన్.

939 అనుచున్ గిరిగహ్వరమో
యనంగ వదనంబు దెఱచి యసురుడు చేదో
యిని రామలక్ష్మణసహిత
ము నోట బెట్టంగ యత్నముం జేయు తఱిన్.

940. అన్నా! వీని పరాక్రమ
మెన్నంగ భుజంబు లంద యెసగు న్గానన్
ఛిన్నము సేయుదము భుజము
ల న్నిశితాసిం గొను మని లక్ష్మణు డనగన్.

941. త్వరపడి యన్నయు దమ్ముం
డురుశక్తి మెయిం బలాశి యుద్యద్భుజముల్
నఱకిరి శోణితధారల
ధరిత్రి గూలెన్ దనుజుడు ధరణిధరమొ నా.

942. తనువున శక్తిన్ గోల్పడి
దనుజు డడిగె వీర్యబలనిధానులు భుజఖం
డన మొనరించి యుపకృతిన్
బొనరించితి రీరు నాకు బురుషవరేణ్యుల్.

943. తెలుపుడు మీ రెవ్వరొ చే
తుల నాయుధముల్ ధరించి దుర్గమగహన
మ్ములలో దాపసవేష
మ్ము లూని యేటికి చరింత్రొ మోహనరూపుల్.

944. దనుజుం డి ట్లడుగంగా
ననియెన్ రాఘవుడు దశరథావనిపతినం
దనులము లక్ష్మణు డీతం
దనుజుడు నాకు నను రాము డందురు దనుజా.

945. జనకుని యానతి చొప్పున
వనంబుల జరింప వచ్చి పంచవటీకా
ననమున నుండగ నాసీ
త నపహరించె నసురుండు దశముఖు డనగన్.

946. ఆయమ నన్వేషింపుచు
నీ యెడ కరుదెంచినార మెవ్వండవు నీ
యీ యసమాకృతికిన్ గత
మేయది రావణు నెఱుంగుదె! తెలుపు మనగన్.

947. రామాఖ్యశ్రవణంబున
నా ముష్కరదానవు డనె హర్షంబు మెయిన్
ఏమీ రాఘవుడవ! నా
స్వామీ! యెన్నాళ్ళకు దయవచ్చెన్ నాపై.

948. దశరథరాముం డేతెం
చు శాపమోక్షంబు గూరుచ భుజంబుల్ ద్రెం
చి, శమించు నంతట విప
ద్దశ లనుచున్ వేచియుంటి దనుజవిరామా.

949. దను వనువాడన్ శ్రీకిం
దనయుండ ప్రభాకరామృతకర దివిజనా
థ నిభానవద్యరూపం
బున నెసగిన వాడను మదముకలిమి రామా!

950. భువనఖ్యాతిజరింపుచు
నవమానించితి నొకప్పు డసమతపోవై
భవు స్థూలశిరాఖ్యముని
ప్రవరున్ వనమూలసంకలనతత్పరునిన్.

951. కోపమున శపించె ననున్
దాపసి జనగర్హితవికృతాకృతిగాగన్
జేపడె జిరాయువు తపః
ప్రాపితధాతృవరమహిమ రాఘవ! నాకున్.

952. ఎదిరించితి మరణభయం
బు దక్కి సురనాథు వజ్రమున్ వైచె నతం
డది త్రోసివైచె శిరమున్
బదద్వయంబు నుదరంబున మహోద్ధతిమై.

953. శిరమును బదములు లేక యు
దరస్థితాస్యమున జీవితం బెట్లగు నో
గిరమున్ గొను టెట్లసువుల్
హరింపు మని వేడితిన్ సురాధిపు నంతన్.

954. వనజభవు వర మమోఘము
దను! నీవు చిరాయువవు వథార్థుండవె యో
జనదీర్ఘబాహుయుగమున్
గొను మని యిచ్చె సురరాజు కూరిమి వెలయన్.

955. వనవాసము సేయుచు ల
క్ష్మణు తోడన్ రాము డెపుడు చనుదెంచి భవ
ద్ఘనభుజవిదారణము స
ల్పునో యపుడ లభించు శాపమోక్షం బనియెన్.

956. మును స్థూలశిరుం డియ్యది
యనియెన్ శాపావసాన మదుగంగా జీ
వన మది దుర్భర మయ్యెడు
దినాధిపాన్వయ! కబంధదేహముతోడన్.

957. నశియించి పోయె నా ది
వ్యశక్తు లన్నియును రామ! యవనిజ నెఱుగన్
దశముఖు నెఱుంగ స్థూలశి
రశాపదష్టుండ, జ్ఞానరహితుండ బ్రభూ!

958. నను దహియింపు మినుండ
స్తనగంబున్ జేరకుండ స్వాకృతి ప్రాపిం
చిన యంత దోచు నఖిల
మ్మును బుద్ధికి, జెప్పనేరుపున్ జేపడెడున్.

959. అనినన్ రాముని కనుస
న్న నెఱిగి లక్ష్మణుడు వారణవ్రజభగ్నా
వనిరుహకాష్ఠతతిం బే
ర్చి నగోపాంతంబున శిఖిశిఖలం గూర్చన్.

960. అనల జ్వాలబడి కబం
ధుని దేహము దగ్ధమైన తోడన్ దేజో
ఘనదివ్యరూపమున దను
వు నభంబున నిల్చి రాఘవున కిట్లనియెన్.

కబంధుడు శ్రీరాముని సుగ్రీవునితో జెలిమి సేయుమనుట

961. ప్రాపించితి నీదు దయన్
రూపజ్ఞానంబులన్ వినుము రాఘవ! భూ
మీపుత్రిక నరయంగా
నోపి సహాయపడు వాని నొకని దెలిపెదన్.

962. కపివంశశేఖరుడు స్నే
హపాత్రుడున్ ధర్మనిరతు డమలయశుండున్
దపనసుతుడు సుగ్రీవుడు
విపులాంసుడు సుప్రసిద్ధవీరుడు జగతిన్.

963. తన యన్న వాలి క్రోధ
మ్మున కెఱయై ఋశ్యమూకభూధరమున
డు నతండు భార్యగోల్పడి
యనుచరవర్గంబుతో సహాయాపేక్షన్.

964. ఆత డెఱుంగు నిశిచర
వ్రాతం బఖిలంబు రామభద్రః శుభకరం
బౌత భవదీయసఖ్యం
బాతనితో ధర్మబద్ధమై యుభయులకున్.

965. అరుగుడు పశ్చిమముగ నీ
యరణ్యమున రమ్యపుష్పితానోకహభూ
ధరనిర్ఝరావలోకన
పరమానందాత్ము లగుచు బంపాతటికిన్.

966. ఆ నిర్మలపంపాజల
పానం బొనరించి తీరపాదపఫలముల్
దేనియ లాని బహువిహం
గానీకసుమధుర గీతగానము వినుచున్.

967. శ్రమవాసి చనుం డటు ప
శ్చిమంబుగ మతంగమౌనిశేఖరుమహితా
శ్రమమున్ జేర నచటిక్ష్మా
జము లవ్యయసురభిశప్రసవభరితంబుల్.

968. తరువుల్ సుమమాలికలన్
ధరించి నట్లుండు నిర్జనం బగు నా సుం
దరదేశ మిప్పుడు వసిం
చిరి పూర్వ మచట మతంగశిష్యప్రవరుల్.

969. సమిధల మోపులు మోయుచు
శ్రమపడు నమ్మౌనిశిష్యసంఘతను స్వే
దము భూమిరుహాలంకర
ణమయ్యె భూమి బడక పవనగతి సుమములై.

970. వారల తపఃప్రభావం
బారయ నట్టిది చని రమరాలయమునకున్
వా రెల్లరు రాఘవః పరి
చారిక యొక్కతె గల దట శబరి యనంగన్.

971. కనికరమున నామెకు ద
ర్శనభాగ్యం బిడి కృతార్థురాలిం గావిం
చి నభోమణిసుతు జేరం
జను దంతన్ ఋశ్యమూకశైలంబునకున్.

972. రవిసుతు డవశ్యమున్ బం
పు వనేచరసైన్యసంఘమున్ భూమితనూ
జ వెదక నాతం డెఱుగున్
సవితృప్రభ సొచ్చు మేఱ క్ష్మాతల మెల్లన్.

973. చొఱరాదు ఋశ్యమూకము
దురితాత్ముల కేరి కేని దుర్జనులున్ జొ
చ్చిరయేని నిహతులౌదు ర
సురతతిచేతన్ సుషుప్తి జొక్కిన వేళన్.

974. ఆ పర్వతంబునన్ ని
ద్రాపరవశు డెవ్వడైన ధనలాభంబున్
బ్రాపించి నట్లు కలగను
జేపడు నాతనికి బిదప శ్రీ తథ్యముగన్.

975. కను డనతిదూర మ మ్మహి
తనగోత్తమ, మా మతంగతాపసవనవా
రణఘీంకారములు ప్రతి
ధ్వనించు దద్గిరిదరీవితానములందున్.

976. అనలము సాక్షిగ స్నేహం
బొనరింపుము భాస్కరతనయుని తోడన్ మే
లొనరుచు, నన్యోన్యసహా
యనిబద్ధాత్ము లగుడు చను డయ్య రఘువరా!

977. అతడును నీవును దుల్య
స్థితి నున్నారు షడుపాయచింతనము మహీ
పతులకు లాతియె నీవును
నతండు గలియుట జయావహం బియ్యెడలన్.

978. అనుడున్ బ్రహృష్ట చిత్త
మ్మున దనువున్ వీడ్కొని రఘుపుంగవయుగ్మం
బునడచె దదుక్తమార్గం
బున మాతంగముని యుటజముం జేరంగన్.

శ్రీరామదర్శనమున శబరి మోక్షమునకేగుట

979. రామ! రఘువంశజలనిధి
సోమ! సుగుణధామ! పరమసుందరనామా!
భూమిసుతాకామ! వరం
ధామ! మునిమనోభిరామ! దనుజవిరామా!

980. స్వాగత మిదె నీకున్ సు
స్వాగతము, కొను మివె యర్ఘ్యపాద్యంబులు శ్రీ
రాగవ! లక్ష్మణయుక్తుడ
వై గారామున గణింపు మస్మత్పూజన్.

981. గురువులు చెప్పిరి నాకీ
వరుదెంతు వటంచు దర్శనాసక్తమతిన్
బరమాత్మ! వేగనులతో
నిరీక్షణము సేయుచుంటి నీరాకకుగాన్.

982. ఎన్నడు వత్తువో నీ వను
చు న్నీవరుదెంచు త్రోవ జూడ్కులు సర్వం
బు న్నిల్పితి నాలోచన
లన్నియు నీయంద లగ్నమై యుండంగన్.

983. దినమున్ దినమ్ముగా, గ్రా
న్నన సెజ్జల దారి బఱచి నానావిధరు
చ్యనవీనఫలంబులు గూ
ర్చి నిర్మల జలంబు సేకరించుచు నుంటిన్.

984. హృదయమున నీదు నామము
వదలక స్మరియించుచున్ భవత్పావనమూ
ర్తి దనివితీఱగ దర్శిం
చి దేహబంధంబు వాయ సిద్ధం బైతిన్.

985. జీవితము ధన్య మయ్యెన్
దావకపాదాబ్జదర్శనంబున రామా!
భావిత తపఃఫలంబున్
గైవసము భవాబ్ధితారకము నై తనరున్.

986. పావనపంపాజల మిది
యీ వనఫలములు సుధాసదృశముల్ దృప్తిన్
నీ వారగించి తేనియు
నీ విశ్వం బెల్ల దృప్తి నెసగం గాంచున్.

987. కరముల శరచాపంబులు
శిరముల జడలు వదనముల జిఱుహాసములున్
ధరియించిన మీదు మనో
జ్ఞరూపవైభవము బాపె నా హృదయార్తిన్.

988. అనుచున్ శ్రీరాఘవల
క్ష్మణులకు గడు భక్తితోడ సత్కృతు లొనరిం
చి నిజశరీరము వాయం
గ ననుమతి న్వేడె శబరి కైవల్యేచ్ఛన్.

989. దరహాసము సేసెన్ రఘు
వరు డంగీకారముగ శబరియున్ రామ
స్మరణంబున శిఖిశిఖలన్
శరీరము న్బాసె దాపసజనుల్ మెచ్చన్.

990. ఆరీతి శబరకాంత శ
రీరము బాసి దివి కేగ బ్రియమంది మహో
దారచరితుండు రాఘవు
డా రవిసుతు జేర బయన మయ్యె ననుజుతో.

ఇతిశమ్

శ్రీరామ! భక్తజనమం
దార! రమావరసదృశగుణాలంకారా!
భూరిఖరదూషణాద్యమ
రారాతిచయోన్మథనకృతాహవభీమా!
ఇది మచ్చేతఃస్సంస్థిత
సదయాత్మక రామచంద్ర చరణార్పిత మౌ
చు దనరు రామకథ రసా
స్పదమారణ్యకము సుజనసమ్మత మగుతన్.

శ్రీః శ్రీః శ్రీః శ్రీః శ్రీః
మంగళంమహత్.

